# కావ్యప్రబంధాలలో ఆధ్యాత్మిక కథలు - విశ్లేషణ


రచయిత

**శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణ**



**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2024**

**KAVYAPRABANDHALALO ADHYATMIKA KATHALU-VISLESHANA**

*by*
**Sri Errapragada Ramakrishna**

Editor
**Dr. Akella Vibhishana Sarma**
Special Officer,
Publications Division

T.T.D. Religious Publication Series No. 1499
© All Rights Reserved

*First Print:* 2024

*Copies:* 500

*Published by :*
**J.SYAMALA RAO,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.



# ముందుమాట

మానవుడు సంఘజీవి. తన మనసులోని భావాలను ఎదుటివారికి తెలియజేయడానికి అనేక విధాల ప్రయత్నిస్తాడు. దీనికి భారతీయ ప్రాచీన సాహిత్యం ఎంతగానో తోడ్పడింది, సమాజాన్ని బలోపేతం చేయడానికి కూడా సహకరించింది.

శ్రీ ఎఱ్ఱాప్రగడ రామకృష్ణగారు తాను రచించిన 'కావ్యప్రబంధాలలో ఆధ్యాత్మిక కథలు' ద్వారా మనకు అనేక విషయాలలో స్పష్టమైన అవగాహనను కల్పించారు. వీరు 15 శీర్షికల ద్వారా సామాజిక చైతన్యానికి ఉపయోగపడే అంశాలను ఎంపికచేసి మనకు స్ఫూర్తిని కలిగించారు.

"ధర్మసౌధమ"నే శీర్షికలో జయాపజయాలను ఎలా స్వీకరించాలో తెలియజేశారు. అర్హతకు తగని అవకాశాలను తిరస్కరించాలని, ధర్మబద్ధంగానే నడుచుకోవాలని, భక్తులు భగవంతునికి సమర్పించిన కానుకలను దురుపయోగం చేయరాదని, వాటిని ధర్మప్రచారానికి వినియోగించాలని వక్కాణించారు. లోగుట్టు అనే శీర్షికలో ఊరన్న తరువాత అందులో సమాజహితాన్ని కోరే పురోహితుడుండాలని, తల్లిమాట విన్న పిల్లలు బాగుపడినట్లుగా, వేదం ద్వారా పురోహితుడు ధర్మమార్గంలో ముందుండి నడిపిస్తాడని స్పష్టం చేశారు.

భ్రమరకీటన్యాయంలో ద్వేషించినా, ధ్యానించినా, భీతి చెందినా భగవంతునిలో తాదాత్మ్యం చెందితే అదే సాయుజ్యమని మారీచవృత్తాంతం ద్వారా వివరించారు. నేనే గొప్ప, నాకంటే అందగాడు, సంపన్నుడు లేడనే భావన కలిగినపుడు, మానావమానాల పట్టింపుతో తన నాశనాన్ని తానే కోరుకుంటాడని "దక్షప్రజాపతి" శీర్షిక ద్వారా తెలియజేశారు. దాతననే గర్వంతో విఱ్ఱవీగిన బలిచక్రవర్తితలపై తన పాదాన్ని మోపి,

శ్రీహరి బలిమోహాన్ని సైతం తొలగించి, స్వర్గాధిపతిని చేసి జన్మధన్యతను చేకూర్చినాడని "వామనావతార" శీర్షిక ద్వారా స్పష్టమవుతున్నది.

"లోపలి గాయాల ప్రభావం" అనే శీర్షికక్రింద గర్భిణిగా ఉన్నపుడు తల్లి అగచాట్లకు, అవమానాలకు లోనయితే ఆ ప్రభావం బిడ్డపై పడుతుంది. అందుకనే గర్భిణీస్త్రీని చాలా జాగ్రత్తగా, ప్రశాంత వాతావరణంలో ఉంచి చూసుకోవాలని చెప్పడం జరిగింది. భక్తిని అర్థంతో తూచడం సాధ్యం కాదు. ఈ సత్యం "కృష్ణతులాభారం"తో తేలిపోయిందని "కృష్ణతులాభారమనే" శీర్షిక తెలియజేస్తుంది.

అహంకారం, కోపం చివరికి దుఃఖానికే దారితీస్తాయని దేవయానికథ ద్వారా తెలుస్తున్నది. రాముణ్ణి సంపూర్ణ అవతారమూర్తిగా మలచడంలో విశ్వామిత్రుని పాత్ర అమోఘమని "విశ్వామిత్రుడి పాత్ర" అనే శీర్షికలో తెలియజేశారు.

ఈ విధంగా శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణగారు 15 శీర్షికలతో పలు సందేశాత్మక కథలను విశ్లేషించారు. అంతేకాక సమాజంలో వ్యక్తిత్వ విలువను కూడా తెలియజేశారు. ఎంతో శ్రమకోర్చి మనకీ సందేశాలను విశ్లేషణాపరంగా వివరించి అందించిన శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణగారికి ధన్యవాదాలను సమర్పిస్తూ, వారికి ధన్యవాదాలు.

ఈ గ్రంథాన్ని పరిశీలించి ముద్రణయోగ్యంగా తీర్చిదిద్దడంలో కృషి చేసిన ప్రచురణల విభాగ ప్రత్యేకాధికారి డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి శుభాభినందనలు.

*సదా శ్రీవారి సేవలో...*

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

# విషయసూచిక


| | పుట |
|---|---|
| 1. ధర్మసౌధం | 1 |
| 2. లోగుట్టు | 9 |
| 3. భ్రమరకీటన్యాయం | 15 |
| 4. దక్షప్రజాపతి | 24 |
| 5. వామనావతారం | 31 |
| 6. ప్రవరాఖ్యుడి కథ | 41 |
| 7. శ్వేతకేతువు – వివాహవ్యవస్థ | 52 |
| 8. పుండరీకచరిత్ర | 59 |
| 9. లోభగుణవంతులు | 67 |
| 10. నేను – నాది | 74 |
| 11. లోపలి గాయాల ప్రభావం | 85 |
| 12. కృష్ణతులాభారం | 90 |
| 13. అమరత్వసిద్ధి | 98 |
| 14. దేవయానికథ | 107 |
| 15. విశ్వామిత్రుడి పాత్ర | 113 |

# 1. ధర్మసౌధం

ఇద్దరు రాజుల మధ్య యుద్ధం జరిగింది. ఓడిపోయినరాజు తన రాజ్యాన్ని విడిచిపెట్టి, అడవుల్లోకి పారిపోయాడు. ఆధ్యాత్మికచింతనలో నిమగ్నమయ్యాడు. గెలిచిన రాజు విజయోత్సాహంతో యజ్ఞం తలపెట్టాడు. అనుకోకుండా యాగధేనువు మరణించింది. అది రాజుకు అశుభసూచనగా తోచింది. యజ్ఞాన్ని ఎలా పూర్తి చేయాలో తెలియక కలవరపడ్డాడు. పురోహితులను సంప్రదించాడు. ఇలాంటి గడ్డు సమయాల్లో తగిన ధర్మనిర్ణయం చేయగలవాడు ఆ ఓడిపోయిన రాజేనని తేలింది. ఆయన మాత్రమే ధర్మసంకటం నుంచి గట్టెక్కించగలవాడని నిశ్చయం అయింది. గెలిచిన రాజు ఇక ఏ మాత్రం సందేహించలేదు. అహంకరించలేదు. సత్వరమే ఓడినరాజును కలిశాడు. యజ్ఞసంపూర్తికై ఆయనను అర్థించాడు. ఆయనా కాదనలేదు. ఏ రకమైన శషభిషలకు తావులేకుండా ధర్మనిర్ణయాన్ని ప్రకటించాడు. యజ్ఞక్రతువుకు సహకరించాడు. యాగం చక్కగా పరిసమాప్తమైంది.

ఆర్షధర్మనిర్వహణలో తమతమ ఆభిజాత్యాలను, అహంకారాలను పూర్తిగా విడిచిపెట్టి యజ్ఞకార్యాన్ని నెరవేర్చిన ఆ ఇద్దరి రాజుల కథే – శ్రీకృష్ణదేవరాయల 'ఆముక్తమాల్యద' కావ్యంలోని 'ఖాండిక్యకేశిధ్వజోపాఖ్యానం' లోని ప్రధాన అంశం.

భారతీయప్రాచీనసాహిత్యం – సమాజమనే ధర్మసౌధాన్ని బలోపేతం చేసేందుకై ఎంతగా తపనపడిందో... దీన్ని పటిష్ఠంగా నిలిపేందుకై ఎంతగా సహకరించిందో... మనం అర్థం చేసుకోవాలంటే – ఈ కథను శ్రద్ధగా సమీక్షించాలి.

ఈ కథలో ఓడిన రాజు–ఖాండిక్యుడు. గెలిచి, యజ్ఞాన్ని సంకల్పించిన రాజు – కేశిధ్వజుడు. యజ్ఞసంస్కృతిని ఎరిగినవారి

చిత్తప్రవృత్తులు, సంస్కారం ఎంత ఉన్నతంగా ఉంటాయో– ఈ కథలోని చివరి మలుపును గమనిస్తే మనకు బాగా బోధపడుతుంది.

ఖాండిక్యుడి సహకారంతోనే తన యజ్ఞం పరిపూర్ణం అయిందని కేశిధ్వజుడు గ్రహించాడు. సభలో ప్రకటించాడు. గురుదక్షిణగా ఏం కావాలన్నా ఇస్తానని సభాముఖంగా ప్రార్థించాడు. అది సంప్రదాయం. ఓడినరాజుకు ఓరిమి ఎంత ప్రధానమో, గెలిచిన రాజుకు సంయమనం, ధర్మసంరక్షణ, సంప్రదాయపరిరక్షణ – అంతే అవసరం! కాబట్టి ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, ఖాండిక్యుడు తన రాజ్యాన్ని తిరిగి తనకు గురుదక్షిణగా కోరినా నిస్సంకోచంగా ఇచ్చేయడానికి కేశిధ్వజుడు సిద్ధపడ్డాడు. అయితే అటు ఖాండిక్యుడూ ధర్మజ్ఞుడే. కాబట్టి ప్రలోభాలకు గురి కాలేదు. తనకు బ్రహ్మజ్ఞానాన్ని బోధించమని కేశిధ్వజుణ్ణి కోరాడు. బ్రహ్మజ్ఞానసంపద కేశిధ్వజుడి సొత్తు. కాబట్టి ఖాండిక్యుడు తనకు గురుదక్షిణగా దీన్నే అర్థించాడు.

ఖాండిక్యుడి నిర్ణయం సభాసదులకే కాదు. కేశిధ్వజుడికి సైతం విస్మయంగా తోచింది. ఆయన ఆంతర్యం ఏమిటో తెలుసుకోవాలని పించింది. దాన్ని గమనించి "రాజ్యభోగాలు – భౌతికసంపదలు వాటిని కష్టంతో సాధించుకోవాలి! శ్రమించకుండా సంపదలు అయాచితంగా లభించాలని కోరుకోవడం ధర్మం కాదు. వాస్తవానికి చెమటోడ్చి సాధించినప్పుడే సంపదల విలువ తెలుస్తుంది. యుద్ధంలో నా కన్నా మెరుగ్గా పోరాడిన, నా కన్నా బలవంతుడి చేతిలో నేను ఓడిపోయాను. జయాపజయాలు ధర్మాధీనాలు. ఇందులో సిగ్గుపడవలసింది ఏముంది? తిరిగి నేను పుంజుకొని ధర్మమార్గంలో క్షాత్రబలంతో రాజ్యాన్ని చేజిక్కించుకొంటే అది సక్రమం అవుతుంది. పరాక్రమంతో కాకుండా యాచనతోనో, అవకాశం వచ్చిందని గురుదక్షిణగానో పొందితే అది అక్రమం అవుతుంది. రాజ్యం–వీరభోజ్యమనే మాటకు అర్థంలేకుండా

పోతుంది. సూటిదారిలో రాజ్యం పొందడం ఒప్పు. దొడ్డిదారిలో పొందితే తప్పు. అది నాకు ముప్పు. కాబట్టి నీవు నా రాజ్యాన్ని ఉచితంగా ఇద్దామనుకొన్నా, నేను దాన్ని స్వీకరించలేను. అంతకన్నా ఎన్నోరెట్లు విలువైన బ్రహ్మజ్ఞానాన్నే నేను కోరుతున్నాను" అన్నాడు ఖాండిక్యుడు నిశ్చయంగా!

ఖాండిక్యకేశిధ్వజసంవాదం ఆముక్తమాల్యదకావ్యానికి గుండెకాయవంటిదని వ్యాఖ్యాతలు తీర్మానించడానికి ముఖ్యమైన కారణాలు ఏమిటంటే - ఆ కథనంలోంచి తొంగిచూస్తున్న ధార్మికనేపథ్యం... కర్తవ్యప్రబోధమును గెలుపుఓటములను ఎలా స్వీకరించాలో... కర్తవ్యాన్ని ఎలా గ్రహించాలో... అయాచితంగా వచ్చిపడే అవకాశాలను ఎందుకు తిరస్కరించాలో - ఆముక్తమాల్యద గొప్పగా వివరించింది. భారతీయధార్మికచింతనను అద్దంపట్టి చూపించింది. ఇలాంటి కథలను తరగతిగదుల్లో బోధిస్తే, వీటిని పాఠ్యాంశాలుగా నిర్ణయిస్తే - అవి బాల్యాన్ని ధార్మికపథంలోకి నడిపిస్తాయి. వ్యక్తిత్వవికాసానికి దోహదం చేస్తాయి. ఉచితానుచితాల పట్ల విచక్షణను అలవరుస్తాయి.

సాహితీసమరాంగణసార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలకు ఈ ఆముక్తమాల్యదకావ్యం విశేష ఖ్యాతిని ఆర్జించి పెట్టింది. ఇది అయిదు కథల సమాహారం. విష్ణుచిత్తుడి వృత్తాంతం, ఖాండిక్యకేశిధ్వజుల సంవాదం, యామునాచార్యుని కథ, బ్రహ్మరాక్షసుడి శాపవిమోచనం (దానిలోనే అంతర్భాగంగా మాలదాసరికథ) లతో అంటే, మంగళకరంగా ఆరంభమై మంగళకరంగా సాగి, గోదా శ్రీరంగనాథుల కల్యాణంతో మంగళకరంగా పరిసమాప్తం అయింది..

ఆముక్తమాల్యద అంటే గోదాదేవి తను తొలుత ధరించిన పూమాలను విష్ణుమూర్తికి సమర్పించేదని దాని అర్థం. ఆమె విష్ణుచిత్తుడి పెంపుడు కూతురు. ఆయనకు తులసికోటలో దొరికింది. దీనిలో ఒక రహస్యం ఉంది.. రామాయణంలో జనక మహర్షి పొలం దున్నితే

సీతమ్మతల్లి దొరికిందనుకొంటాం. కాని సత్యం అది కాదు. సీతమ్మ దొరుకుదామనుకొన్నప్పుడు జనకుడు నాగలి పట్టాడు. సంకల్పం– సీతమ్మది, ప్రయత్నం జనకుడిది. గోదాదేవివిషయంలోను అంతే! గోదాదేవిశ్రీరంగనాయకుల వివాహమే ఈ కావ్యంలో ప్రధానాంశం కనుక రాయలవారు దీన్ని విష్ణుచిత్తీయమనే వ్యవహరించినా, 'ఆముక్తమాల్యద' అనే పేరే ప్రాచుర్యంలోకి వచ్చింది. విశిష్టాద్వైతంలో పన్నెందు మంది విష్ణుభక్తులు ప్రసిద్ధులు. వారిని పన్నిద్దరాళ్వారులంటారు. వారిలో ఒకరు విష్ణుచిత్తుడు. గోదాదేవి సైతం ఆ ఆళ్వారుల్లో ఏకైక మహిళా ప్రతినిధి. ఆమె లక్ష్మీదేవి అవతారమని, కాదు భూదేవి అంశ అనీ రెండు అభిప్రాయాలున్నాయి. రాయలవారు మాత్రం గోదాదేవిని భూదేవిగా సంభావించారు.

వైష్ణవాన్ని పరతత్త్వంగా ప్రతిపాదించడం కోసం, దాన్ని స్థిరపరచడం కోసం విష్ణుచిత్తుడు పాండ్యరాజుకొలువులో వాదనకు దిగుతాడు. గెలుపు సాధిస్తాడు. అదే సందర్భంలో శ్రీమహావిష్ణువే స్వయంగా "ఒక విష్ణుచిత్తుడు, ఒక యామునుడు వైష్ణవసిద్ధాంతాన్ని గట్టిగా నిలబెడుతున్నారు" అంటాడు లక్ష్మీదేవితో. ఈ పాండ్యరాజు పేరు మత్స్యధ్వజుడు. అతడికన్నా ముందువాడైన మరో పాండ్యరాజుకు శైవమతాభిమానం ముదిరి వైష్ణవం పట్ల విష్ణుభక్తుల పట్ల చులకనగా వ్యవహరిస్తాడు. ఆయన భార్యపేరు మాత్రం వైష్ణవి. ఆమె సాయంతో యామునుడు రాజసభలో ప్రవేశిస్తాడు. పండితులతో వాగ్వాదానికి పూనుకొంటాడు. విజయం సాధిస్తాడు. పందెం ప్రకారం అర్ధరాజ్యం సంపాదిస్తాడు. ఒక క్షత్రియకాంతను వివాహం చేసుకొని రాజ్యపాలన సాగిస్తాడు. పుత్రసంతానం కలుగుతుంది. అటు సంసారయోగం ఇటు రాజభోగాలతో దారితప్పుతాడు. చివరకు శ్రీరామమిశ్రుడనే బాల్యమిత్రుడి ఉపదేశంతో వైరాగ్యం సిద్ధిస్తుంది. ఆ మిత్రుడు రాజును

శ్రీరంగానికి తీసుకొనిపోయి, రంగనాథుడి కైంకర్యమే శాశ్వతభోగమని నచ్చచెబుతాడు.. యామునుడికి కళ్ళుతెరుచుకొంటాయి. కొడుక్కి పట్టాభిషేకం చేసి తాను సన్యాసం స్వీకరిస్తాడు. క్లుప్తంగా ఇదీ యామునాచార్యుడి కథ.

యామునరాజనీతిగా ప్రసిద్ధికెక్కిన ఈ కథాభాగంలోనే – రాయలవారు ఎన్నోరకాల రాజధర్మాలను వివరించారు. రాజనీతిని ఉపదేశించారు. విశేషం ఏమంటే – యామునుడు తన కొడుక్కి చెప్పిన వన్నీ రాయలవారి స్వీయ అనుభవాలు, ఆణిముత్యాలు. వాటిలో చాలా భాగం ఈనాటికీ చెల్లుబాటయ్యే ధర్మసూక్ష్మాలు, నేటి పాలకులు పాటించవలసిన నియమాలు.

ఒక్క ఉదాహరణ చెప్పుకోవాలంటే రాయలవారు ప్రయోగించిన ప్రత్యేక పదం “ఆయతగాడు” గురించి తెలుసుకోవాలి. ఒక్క మాటలో చెప్పాలంటే దేవుడిసొమ్మును అక్రమమార్గాలకు అనుచితకార్యాలకు మళ్ళించే వారిని ఆయన “ఆయతగాళ్లు” అన్నాడు. అరణం అంటే కానుక. భక్తులు తమశక్తి కొద్దీ భగవంతుడికి తమ మడులు మాన్యాలు ధనరాశులు ఆభరణాలు కానుకగా సమర్పిస్తారు. అరణంగా తాము దేవుడికి కైంకర్యం చేసే సంపదలు సద్వినియోగం కావాలని కోరుకొంటారు. ఆలయనిర్వాహకులు వాటిని ధర్మకార్యాలకై సక్రమంగా ఖర్చుచేస్తే – తాము తరాల తరబడి తరిస్తామని భక్తులు గట్టిగా విశ్వసిస్తారు. పూర్వకాలంలో దేవాలయాల్లో ధూపదీపనైవేద్యాది కైంకర్యాలకు వేలాది ఎకరాలను భక్తులు కానుక చేసినట్లు చరిత్రలో తెలుస్తుంది. శాసనాల్లో కనిపిస్తుంది. స్థలపురాణాల్లో వినిపిస్తుంది. ఏదైనా ఘనకార్యం సాధించిన వారి గురించి మనవాళ్లు “అదంతా వారి పెద్దల పుణ్యం” అనడం దేనికంటే ఒకరు చేసిన పుణ్యకార్యం తరాలను ఉద్ధరిస్తుంది కాబట్టి. తమ పెద్దల పుణ్యం తమకు కలిసొచ్చిందని

గుర్తించినవారు తమ తదుపరి తరాలవారు బాగుండాలన్న ఆలోచన చేస్తారు. అది జాతికి మేలు చేస్తుంది. అదొక ధార్మికపరంపర.

అందుకే దేవాలయనిర్వహణను ఆయతగాళ్లు చేపడితే ధర్మహాని జరుగుతుందని యామునరాజనీతిలో కృష్ణరాయలు హెచ్చరించాడు. స్వార్థప్రయోజనాల నిమిత్తమే కాదు, రాజుగారి బొక్కసానికి బలం చేకూర్చడానికైనా సరే – దేవుడి సొమ్మును వినియోగించరాదని ఆయన స్పష్టంగా చెప్పాడు. ఇది ఈ కాలానికీ బాగా వర్తిస్తుంది. ఆ సొమ్మును దారిమళ్ళిస్తే జరిగే నష్టం ఏమిటంటే – భక్తుల మనోభావాలు దెబ్బతింటాయి. అంతేకాదు, దాతల ఆశయాలకు అనుగుణంగా నిధులు ఖర్చుకావడం లేదని తేలితే, భక్తులకు దానం చేయాలన్న కుతూహలం తగ్గిపోతుంది. దానచైతన్యం లోపిస్తుంది. కాబట్టి దేవాలయాలనేవి – ఏనాడూ ప్రభుత్వానికి ఆదాయవనరుగా మారిపోరాదని కృష్ణదేవరాయలు హెచ్చరించాడు. దాతల ఆశయాలకు తూట్లుపడరాదని ఆదేశించాడు, లోకానికి బోధించాడు.

ఇక మాలదాసరి కథ. దాని గురించి కవి సమ్రాట్ ఒక విలక్షణమైన ప్రకటన చేశారు. "తెలుగుసాహిత్యంలో ఆముక్తమాల్యద ఒక బెనారస్ పట్టుచీర వంటిది అయితే మాలదాసరి కథ దాని అందమైన జరీ అంచువంటిది" అన్నారాయన. పట్టుచీర నిండా పసిడి కుసుమాలు ఎన్నో ఉండవచ్చుకాని పల్లుఠీవి (చీరకొంగు) పల్లుకే కదా మరి! అంటే కావ్యం నిండా మంచి మంచి కథలే గాని, మాలదాసరికథ ప్రత్యేకమైనదని ఆయన అభిప్రాయం.

మాలదాసరి నిత్యం సంకీర్తనలతో వేకువనే ఆలయానికిపోయి స్వామికి ప్రీతిగా మేలుకొలుపులు పాడేవాడు. ఒకనాడు అర్ధరాత్రి మాలదాసరి కోళ్లపాకలోకి అడవిపిల్లి చొరబడింది. కోళ్లన్నీ గగ్గోలుగా అరిచాయి. ఒకటికి పదిసార్లు కోడికూతలు తన చెవిన పడేసరికి,

తెల్లవారిపోయిందనుకొన్నాడు మాలదాసరి. యథావిధిగా బయలుదేరి, కటికచీకట్లో దారితప్పి ఓ బ్రహ్మరాక్షసుడికి చిక్కాడు. వాడు తనను కబళించబోతుంటే దీనంగా ప్రార్థిస్తూ – “స్వామిని మేలుకొలిపి తిరిగి వచ్చి నీకు ఆహారం అవుతాను” అని పరిపరి విధాల బతిమాలతాడు. ఏ కళనున్నాడో బ్రహ్మరాక్షసుడు దానికి సమ్మతిస్తాడు. మాలదాసరి స్వామికోవెలకు పోయి, గానకైంకర్యం పూర్తిచేసి రాక్షసుడి దగ్గరకు తిరిగివస్తాడు. తనను భోంచేయమంటాడు. మాలదాసరి సత్యనిష్ఠ రాక్షసుడిని విస్మయానికి గురిచేస్తుంది. రాక్షసబుద్ధిని విరిచేస్తుంది. వాడిలో గొప్ప మార్పువస్తుంది. మానవాస్త్రం దెబ్బతిన్న మారీచుడు రాముడికి కింకరుడైనట్లు, రాక్షసుడు సైతం మాలదాసరికి దాసుడై పాదాలపై పడతాడు. తన పూర్వజన్మవృత్తాంతాన్ని వినిపించి, ఈ రాక్షసజన్మను తొలగించమని ప్రాధేయపడతాడు. మాలదాసరి ఆశ్చర్యపడి తనకలాంటి శక్తిసామర్థ్యాలు లేవని, తాను ఎలాంటి మహిమలూ చేయలేనని చెబుతాడు. రాక్షసుడు ఆ మాటకు తృప్తిచెందకుండా “స్వామివారికి నీవు చేసిన గానకైంకర్యపుణ్యాన్ని నాకు ధారపోయాలి'' అని వేడుకొంటాడు. మాలదాసరి దానికి అంగీకరిస్తాడు. ఆ పుణ్యంతో రాక్షసుడికి పూర్వరూపం, అప్పటి పాండిత్యవైభవం తిరిగి దక్కుతాయి. మాలదాసరిపాదాలపైపడి పరిపరి విధాల ప్రార్థించి, గురువుగా స్వీకరిస్తాడు. ఇరువురూ కలిసి శ్రీరంగం చేరుకొంటారు. ఈ కథను రాయలవారు వరాహపురాణం నుంచి స్వీకరించారు. ఆముక్తమాల్యదలో శ్రీహరి ఈ కథను విష్ణుచిత్తుడికి స్వయంగా చెబుతాడు.

ఇక విష్ణుచిత్తుడి కథలోకి వస్తే ఆయనది విల్లిపుత్తూరు. సంస్కృతంలో దాన్నే 'ధన్విపురం' అంటారు. అలాగే విష్ణుచిత్తుణ్ణి వైష్ణవసంప్రదాయంలో భట్టనాథుడని వ్యవహరిస్తారు. గృహస్థధర్మనిర్వహణలో ఆయనది అందెవేసిన చేయి. నియమనిష్ఠలలో దిట్ట. నిరంతరం అతిథి అభ్యాగతుల

సేవలో నిమగ్నమై ఉంటాడు. ఆయన భార్య గొప్ప సాధ్వీమణి. భర్తకు అనుకూలవతి. ఆమె తోడ్పాటుతో విష్ణుచిత్తుడు అనునిత్యం పుణ్యకార్యాచరణలో మునిగి తేలుతూ ఉంటాడు. విష్ణుమూర్తి ఆదేశంతో పాండురాజు మత్స్యధ్వజుడి కొలువుకు పోయి, వాదోపవాదాలతో శ్రీవైష్ణవతత్త్వాన్ని బలంగా ప్రతిపాదించి, అద్భుతంగా ప్రతిష్ఠాపన చేసి వస్తాడు. ఆ తీవ్రవాగ్వాదాల మధ్యలో విష్ణుచిత్తుడు సభకు వివరించిన కథే మనం మొదట్లో చెప్పుకొన్న ఖాండిక్యకేశిధ్వజసంవాదం. అదీ దాని సందర్భం.

శ్రీకృష్ణదేవరాయల కరవాలానికి, విష్ణుభక్తి–రాజనీతి అనే రెండూ రెండు పదునైన అంచులు. ఆ కరవాలాన్ని ఆయన కలంగా మార్చి లోకానికి కానుక చేసిన ఒకానొక అమరకావ్యమే – ఆముక్తమాల్యద! లోకం దాన్ని తెలుగులో పంచకావ్యాల్లో ఒకటిగా గౌరవించింది. ఆదరించింది. పాఠ్యాంశంగా నిర్ణయించింది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఆముక్తమాల్యదకావ్యమే గొప్ప ధర్మసౌధం! తెలుగువారికి దక్కిన గొప్ప వరం!

# 2. లోగుట్టు

**అప్పిచ్చువాడు, వైద్యుడు**
**ఎప్పుడు ఎడతెగక పారు ఏరును, ద్విజుడున్**
**చొప్పడిన ఊరనుండుము!**
**చొప్పడకున్నట్టి ఊరు చొరకుము సుమతీ!**

**– సుమతీశతకం!**

తెలుగువాడు కొన్ని విద్యల్లో గొప్ప నేర్పరి. తనదికాని సాహితీ ప్రక్రియను మూలంకన్నా హృద్యంగా మలిచి, ఇదే అచ్చంగా మూలమైన దన్నట్లుగా లోకాన్ని అచ్చెరువు కలిగించే విద్య తెలుగువాడి సొంతం! శతకసాహిత్యం అందుకు గట్టిసాక్ష్యం.

వాస్తవానికి ఈ ప్రక్రియ తొలుత సంస్కృతంలోను, దరిమిలా ప్రాకృతంలోను ప్రభవించి, తెలుగువాడి కన్నా కన్నడిగులను అలరించింది. అయినా తెలుగువాడి హస్తవాసిపుణ్యమా అని పసిడికి పరిమళం సోకినట్లు గుబాళించింది. శతకసాహిత్యం తెలుగువాడి సాంస్కృతిక ఆధ్యాత్మికవారసత్వంగా, తరగని సంపదగా పరిణమించింది. సమాజంలో నైతిక విలువలకు ఊతమిస్తూ... ఆధ్యాత్మిక వైఖరిని ప్రోత్సహిస్తూ... ఉత్తమ జీవనమార్గాలను నిర్దేశిస్తూ వచ్చిన నీతిశతకాలు ప్రజల నాల్కలపై శాశ్వతంగా నిలిచిపోయాయి. శతకశైలి, దాని ప్రబోధం ఎంతో విలువైనవని నిరూపించిన వాటిలో సుమతి, వేమన శతకాలది అగ్రస్థానం.

సుమతీశతకంలోని పద్యాలకు వ్యాఖ్యానం నిజానికి అవసరంలేదు. అయితే సత్యమని ప్రయోగించిన ఒకో పదం రాజశేఖరచరిత్రంలో మాదయగారిమల్లన చెప్పినట్లు "వ్యాకోచవచోవిలాసాన్ని" ప్రదర్శిస్తుంది. పాఠకుడి అనుభవాన్ని బట్టి, అవగాహనాసామర్థ్యాన్ని అనుసరించి, ఎదలో వ్యాకోచిస్తూనే ఉంటుంది. అది మనిషిపరిణతికి తగ్గట్టు వయసుతో

పాటు ఎదుగుతూనే ఉంటుంది. సుమతి, వేమనశతకాలు ఆ కోవకు చెందినవి. బద్దెన అనే గొప్ప కవి సుమతీశతకం రాశాడు. ఆయన పేరు తెలియకపోవచ్చు గాని, ఆయన రాసిన పద్యాలు కొన్ని అయినా నోటికి రాని తెలుగువాడు క్రిందటి తరం దాకా ఎవడూ లేడు. ఆయన పద్యాలకు దక్కిన ప్రాచుర్యం అంతటిది.

ఏదైనా ఒక ఊళ్ళో మనిషి స్థిరపడాలి అనుకుంటే – అదిగో, ఆ సుమతీశతకకారుడి లెక్కప్రకారం – ఆ ఊరికి కొన్ని లక్షణాలుండాలి. ఆ ఊళ్ళో అప్పులిచ్చే దాత ఒకడుండాలి. వైద్యుడొకడుండాలి. జీవజలాలనందించే నది ఒకటి ఆ గ్రామం సమీపాన పారుతూ ఉండాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ఆ ఊళ్ళో వేదాధ్యయనం చేసిన బ్రాహ్మణుడు ఒకడుండాలి. "అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎప్పుడు ఎడతెగక పారు ఏరున్, ద్విజుడున్..." అనడంలో వైద్యుడు అప్పులివ్వాలని కాదు – ఎప్పుడు అయినా ప్రాణావసరం వస్తే అప్పులిచ్చి ఆదుకునేవాడు, ప్రాణం మీదకి వస్తే వైద్యంతో ఆదుకొనేవాడు – ఇద్దరూ ఊళ్లో ఉండవలసిన ముఖ్యమైన పౌరులు – అని కవిగారి భావం. అదలా ఉంచి, దాహంతీర్చడానికి నది సరేగాని, బ్రాహ్మణుణ్ణి కూడా ఒక ముఖ్యుడు అని కవి ఎందుకన్నాడు?... అనేది ఆలోచించాలి. అది మన సంప్రదాయానికి చెందిన ఒక విశేషం.

అంతకన్నా ముందు. ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయం ఒకటుంది – "బ్రాహ్మణకులంలో పుట్టిన వారొకరు ఉండాలి" – అని కాదు సుమతీశతకకారుడు చెప్తున్నది – "వేదాధ్యయనం చేసిన పండితుడు ఒకడు ఊళ్ళో తప్పనిసరి" అంటున్నాడు. "ద్విజుడు" అనే మాటకి తాత్పర్యం అది. కవులు వాడే పదాలన్నీ మనకి నిఘంటువుల్లో దొరుకుతాయి. ప్రతి పదానికీ ఒక నిఘంటువు కాకపోతే మరొకటి అర్థం చెబుతుంది. కాని వాటిని ప్రయోగించడంలోని ఔచిత్యం

శబ్దోపాసకులకు మాత్రమే తెలుస్తుంది. అందుకే నిఘంటువులేవీ కవిత్వ సంపుటాలు కావడం లేదు! శబ్దవిద్య తెలుసున్నవాడి పదప్రయోగ నైపుణ్యం కారణంగా, పదాల కూర్పులో ప్రదర్శించే ప్రస్తావనాచాతుర్యం కారణంగా ఆ నిఘంటువుల్లోని పదాలకే కవిత్వపరిమళాలు అబ్బుతాయి. అదిగో అలాంటి శబ్దవిద్యారహస్యాలు ఎరిగిన కవి బద్దెన. ఇక్కడ "ద్విజుడు" అనే పదాన్ని తెలిసే ప్రయోగించాడు ఆయన. ఆ మాటకు - వేదవిద్యలు తెలుసున్నవాడు - అనే అర్థాన్ని మనం గ్రహించాలి. ఎందుకంటే బద్దెనకవి శబ్దోపాసకుడు కాబట్టి!

మనకి భారతభాగవతాల్లో ధౌమ్యుడితో పరిచయం అయింది. "ఆ మహాభాగుడి దగ్గరకి వెళ్ళి మీకు సాయం చెయ్యమని ప్రార్థించండి. ఆయన తోడు మీకు చాలా అవసరం" అని పాండవులను స్వయంగా వ్యాస మహాముని ఆదేశించాడు. అరివీర భయంకరులు, శౌర్యప్రతాపవంతులు అయిన పాండవులకు - ఒక బ్రాహ్మణుడి తోడు అవసరమా? ఒంటి బ్రాహ్మడు పంచపాండవులకు సహాయం చెయ్యడం ఏమిటి? విడ్డూరం కాకపోతే! - అని మనకి అనిపిస్తుంది.

ధౌమ్యమహర్షి ద్విజుడు. ఆయన అండ పాండవులకు అవసరం. అదే వ్యాసమునిశాసనం. లక్కయిల్లు దహనమైతే కృష్ణుడి అనుగ్రహంతో బ్రతికి బయటపడ్డారు పాండవులు. అడవుల్లో అజ్ఞాతంగా గడుపుతున్నారు. వారిప్పుడు గృహస్థధర్మనిర్వహణలోకి ప్రవేశించవలసి ఉంది. అంటే, ద్రౌపదిని చేపట్టి గృహస్థాశ్రమం స్వీకరించాలి. కర్తవ్యనిర్వహణకు సిద్ధం కావాలి. వాళ్ళు పుట్టింది - ఇలా అడవుల్లో ఎవరి కంటాపడకుండా, గుట్టుగా జీవించడానికి కాదు. కృష్ణుడి ధర్మప్రతిష్ఠాపనోద్యమంలో భాగం పంచుకోవడానికి వాళ్ళు పుట్టారు. అదే వారి స్వధర్మం! అందుకే వాళ్ళనా విధంగా తయారుచేయడానికి, నిరంతరం వాళ్ళని ధర్మమార్గంలో నిలపడానికి, ఆ యా సందర్భాలతో మంచీ చెడ్డా వివరించి చెప్పడానికి

– ఒక ద్విజుడి మాటసాయం వారికి బాగా అవసరం. అంతేకాదు, గృహస్థధర్మనిర్వహణమంతా – వేదంతో ముడిపడి ఉంది. వేదం ఎలా నిర్దేశిస్తే మనిషి అలా నడవవలసి ఉంది. వేదం చెప్పిన ప్రకారం నడిస్తేనే తక్కిన పురప్రజలకి ఆ మనిషి మూలంగా తగిన హితం చేకూరుతుంది. వేదం చెప్పిన పద్ధతిలో, అలా 'పురహితం' కోరే వేదపండితుణ్ణే మనం 'పురోహితుడు' అని పిలుస్తాం. తల్లి మాట విన్న కొడుకులు బాగుపడినట్లుగా, వేదం చెప్పినట్లు విన్న పౌరులు బాగుపడతారు. కాబట్టే, మన పెద్దలు వేదానికి తల్లి స్థానం ఇస్తూ 'వేదమాత'గా ఆరాధించారు. వేదమార్గాన్ని లోకానికి విపులీకరిస్తూ నిస్స్వార్థంగా పురహితాన్ని కాంక్షించే పండితుణ్ణి 'పురోహితుడి'గా సంభావించారు. అలాంటివారిని నడిచే దేవాలయాలు (మొబైల్ టెంపుల్స్)గా కీర్తించారు. శుభ, అశుభ కార్యాలన్నింటా వేదం ఏం నిర్దేశించిందో దాన్ని తమచేత అమలుచేయించే అధికారం వారికి కట్టబెట్టారు. అందుకూ "ఆ ఊళ్ళో ద్విజుడు ఉన్నాడో లేదో చూసుకోమని" బద్దెన హెచ్చరించింది. "మీ అభ్యుదయంలో నేనూ పాలుపంచుకుంటాను పదండి" – అన్నాడు ధౌమ్యుడు – ధర్మరాజు వచ్చి సాయం కోరగానే! అదిగో అదీ పురోహితుడి లక్షణం. తన గ్రామానికి మంచి జరుగుతోందంటే, వ్యక్తిగతంగా తానేమీ ఆశించకుండా ధర్మమార్గంలో ముందుండి నడిపించడం – పురోహితుడి స్వధర్మం.

ధౌమ్యుడు పాండవులతో చేతులు కలిపాక జరిగిన కథాభాగం అందరికీ తెలిసినదే. లాక్షాగృహం నుండి బయటపడి, అజ్ఞాతంగా తలదాచుకున్న పాండవులు – దుర్యోధనుడి దుశ్చర్యలకు జడిసి తమ ఉనికి బయటపడకుండా జాగ్రత్తపడ్డారు. దాంతో పాండవులంతా మరణించారనే కౌరవులు భావించారు. ఈలోగా పాంచాలరాజు ద్రుపదుడు తన కూతురు ద్రౌపదికి స్వయంవరం ప్రకటించాడు. మత్స్యయంత్రాన్ని ఛేదించాలన్నది ఆయన విధించిన షరతు. దానికి

సమర్థుడు అర్జునుడొక్కడే - అన్నది ద్రుపదుడి నమ్మకం. ఆ రకంగా అర్జునుడు ఎక్కడ ఉన్నాడో కనుగొని తన కుమార్తెను అతనికిచ్చి చేయాలన్నది ద్రుపదుడి ప్రణాళిక. అర్జునుణ్ణి వరించడానికే ద్రౌపది జన్మించిన విషయం ఆయనకు తెలుసు. ఎందుకంటే ఆమె వరపుత్రిక. కనుక లక్కయింట్లో పాండవులు మరణించడం అసంభవం - అనేది ద్రుపదమహారాజుకు తెలుసు. అందుకే వారి ఉనికిని కనిపెట్టడం కోసం కొందరు చారులను నియమించడం సైతం జరిగింది. ఇలా చారుచర్యతో పాటు, స్వయంగా అర్జునుడు తనని తాను వెల్లడి చేసుకునేందుకై ద్రౌపదిస్వయంవరఘట్టం కల్పించి, మత్స్యయంత్రాన్ని కూల్చాలన్న నిబంధనను విధించి, ద్రుపదుడు నిమ్మకు నీరెత్తినట్లు స్థిమితంగా కూర్చున్నాడు. అది భారతగాథ.

పాండవులు వచ్చి తన సాయం అర్థించగానే ముందూ వెనుకా ఆలోచించకుండా - ధౌమ్యుడు పాండవులతో చేతులు కలపడం - ఉన్నవాడు ఉన్నట్లుగా తన పనులు మానుకొని వారితో కలసి ప్రయాణానికి సిద్ధమైపోవడం - మనకి చిత్రంగా అనిపిస్తుంది. కాని అది చాలా సహజమైన విషయం. మహర్షులు వారికంటూ ప్రత్యేకంగా నిర్వహించవలసిన పనులు ఏమీ ఉండవు. తమ కోసం వారేమీ చెయ్యరు. చేసేదంతా లోకహితం కోసమే. మన ఋషులకు చాలామందికి సంసారాలు లేవు. ఉన్నవారికి అవి గుదిబండలు కావు. లోకాలన్నీ క్షేమంగా ఉండాలని, ప్రజలంతా బాగుండాలనీ కోరుతూ హోమాలు, యజ్ఞాలు చెయ్యటం ఒకటే వారికి తెలుసు.

అంతేకాదు, ఏదో లక్ష్యంతో ఆ పరమేశ్వరుడు అవతారం ధరించి ఈ భూమిపైకి దిగి వచ్చినప్పుడల్లా ఒకానొక రహస్యప్రణాళిక ఈ భూమి మీద అమలవుతూ వస్తుంది. ఆ దివ్యప్రణాళికను అనుసరించి ఆయా ఋషులంతా తమ తమ కర్తవ్యాలను, స్వధర్మాలను నిర్ణయించుకుంటారు.

భగవంతుడి పనిలో భాగం పంచుకుంటారు. ఇప్పుడు కృష్ణుడు అవతారమూర్తిగా ఈ భూమి మీదకి దిగివచ్చాడు. దుష్టశిక్షణ, ధర్మప్రతిష్ఠాపన – ఆయన అవతారలక్ష్యాలు. దానికి పనికొచ్చే యోధులు – పాండవులు. కృష్ణుడు తలపెట్టిన ఆ మహాయజ్ఞానికి పాండవులు కార్యకర్తలు. కనుక పాండవులను రక్షించడమూ, వారిని తనకు పనికొచ్చేట్లు మలచుకోవడమూ కూడా కృష్ణుడి పనే. ఈ రహస్యం అటు వ్యాసుడికీ తెలుసు, ఇటు ధౌమ్యుడికీ తెలుసు. ఈ విషయంలో తాము చేతులు కలపవలసిన అవసరమూ, నిర్వహించవలసిన కర్తవ్యమూ – వారికి ఎరుకే. అందుకే భారతంలో పాండవులు కోరినప్పుడు కాదు, వారికి అవసరమైన ప్రతిసారీ వ్యాసమహర్షి ప్రత్యక్షమవుతూ వచ్చాడు. తనంతతానే మార్గనిర్దేశం చేస్తూ వచ్చాడు. వ్యాసుడుగాని, ధౌమ్యుడుగాని పాండవులకు సహాయపడటంలో పాండవుల ప్రమేయం ఏమీ ఉండదు. వాళ్ళు కృష్ణుడికి ఆయుధాలు. కనుక కృష్ణుడి మనుషులంతా పాండవులకు తోడ్పడతారు. అందులో ఆశ్చర్యపోయేందుకు ఏమీ లేదు. అదంతే!

బద్దెన ప్రయోగించిన ఒక్క పదం వెనుక ఇంత కథ ఉంది!

# 3. భ్రమరకీటన్యాయం

భగవంతుణ్ణి చేరుకోవడానికి ఆయనపట్ల భక్తి ప్రధాన సాధనమని మనమంతా అనుకొంటాం. అదేకాదు. రాగద్వేషాలు కోపతాపాలు శత్రుత్వాలు... అన్నీ సాధనాలేనని భాగవతం చెబుతోంది. చివరకు భయంతో కూడా సాయుజ్యం సాధ్యమేనంది. రాజసూయం ముగింపులో చేదిభూపాలుడు శిశుపాలుడు శ్రీకృష్ణుణ్ణి తూలనాడటం, తదనంతరం శ్రీకృష్ణుడు తన చక్రాయుధంతో వాడి తలతరిగేయడం మనకు తెలిసిన కథే! అయితే వాడి ఆత్మజ్యోతి శ్రీకృష్ణుడిలో లీనమైపోవడం ధర్మరాజుకు సైతం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆయన నారదమహర్షి వద్ద విస్మయాన్ని ప్రకటిస్తూ "స్వామీ! బుద్ధి ఎరిగిన నాటి నుంచీ ఈ శిశుపాలుడు ఆ గోపాలుడి పట్ల కోపంతోనే పెరిగాడు. దుర్బుద్ధిమంతుడు దంతవక్త్రుడూ అంతే! శ్రీమహావిష్ణువును అన్నిసార్లు తిడుతున్నా – వారికేమీ కాలేదు. అంధలోకాలకు పోలేదు. పైపెచ్చు అందరూ చూస్తుండగానే ఆయనలోనే లీనమైపోవడం చాలా ఆశ్చర్యంగా ఉంది. జోరుగాలి దీపజ్వాలను కలవరపెట్టినట్లుగా – ఈ సందేహం నా మనసును కలతపెడుతోంది" అని అడిగాడు. నారదుడు నవ్వాడు. "ఏ రకంగానైనా ఆ సర్వాంతర్యామితో యోగం సాధించడం ముఖ్యం. నిజానికి వైరంతో సాధించినంత 'తన్మయత'ను మనిషి భక్తితో సాధించలేడని నా నిశ్చితాభిప్రాయం" అన్నాడా మహర్షి.

"కోరికతో గోపికలు, భయంతో కంసుడు, ద్వేషం కారణంగా ఈ శిశుపాలుడు, బాంధవ్యం మూలంగా యాదవులు, స్నేహం పేరు చెప్పి మీరూ, భక్తి ద్వారా నావంటివారు ఆయనను పొందగల్గుతున్నాం" అని వివరించాడు. నవవిధ భక్తిమార్గాలను చెప్పిన నారదమహర్షే ఈ మాటలో చెప్పడం విశేషం. ఆయన చెప్పిన మాటల్లో "తన్మయత" అనేది చాలా కీలకమైనది. దాన్ని పట్టుకోవాలి మనం. "ధ్యానిస్తావో...

పూజిస్తావో... ద్వేషిస్తావో... కోపిస్తావో... భగవంతుడంటే భయంతో వణికి ఛస్తావో.... నీ యిష్టం. వాటి సాయంతో తన్మయతను సాధిస్తే సాయుజ్యం నీకు దక్కుతుంది'' అని నారదమహర్షి స్పష్టంగా చెబుతున్నారు.

అమరభాషలో 'భ్రమరకీటన్యాయం' అని ఒకటుంది. సాధారణ పురుగొకటి తాను తుమ్మెదను కాగలనన్న దృఢమైన ఆత్మప్రత్యయంతో, గాఢమైన భావనతో తుమ్మెద వెంట తిరిగి తిరిగి, అది చేసే శబ్దాన్ని అనుకరిస్తూ – తుదకు తుమ్మెదగా మారిపోతుందట. ఆ భావతీవ్రతను, నిరంతరధ్యాసను సూచించేదే – భ్రమరకీటన్యాయం. కీటకమంటే పురుగు. భ్రమరమంటే తుమ్మెద. కీటకానికి తాను తుమ్మెదగా రూపొందడమే అంతిమలక్ష్యం. ఆ సాధనతో అది ఒకానొక తన్మయ స్థితిని పొందుతుంది. భగవంతుడితో మనిషికి ఆ తరహా స్థితి లభిస్తే సాయుజ్యం తప్పక సిద్ధిస్తుందని నారదముని మాటల్లోని ఆంతర్యం. భక్తిలో కన్నా ద్వేషం లోను, పగలోనూ తన్మయత తీవ్రంగా ఉంటుందని ఆయన చెబుతున్నారు. ఇది నిత్యజీవితంలో మన అందరకూ అనుభవమయ్యే విషయమే. ఏ మనిషిపైనో మనం బాగా పగ పెంచుకొన్నామంటే ఇక మనసు నిండా అదే ధ్యాస... మన ఆలోచనలన్నీ ఆ మనిషిచుట్టూనే తిరుగాడుతూ ఉంటాయి. చివరకు నిద్రలో సైతం ఆ మనిషి గుర్తుకొస్తూనే ఉంటాడు. పగతీవ్రతను బట్టి! ఎవరిపై మనం కోపంగా ఉన్నామో– ఆ మనిషిచర్యలను, మాటలను, వాటి అంతరార్థాలను పదేపదే తల్చుకొంటూ, వాటి పట్ల మన అభిప్రాయాలను పేర్చుకొంటూ తిరిగివాటిని సమీక్షించుకొంటూనే ఉంటున్నామంటే ఏమిటన్నమాట? అది ఒక్కమాటలో చెప్పాలంటే, మనం – ఆ మనిషైపోతున్నామని అర్థం. అదే భ్రమరకీటన్యాయమనే పదానికి నిర్వచనం. అదేదో భగవంతుడితో జరిగితే దాని పేరే సాయుజ్యం!

రామాయణంలోని మారీచుడు రావణాసురుడి అనుచరుడని, రాక్షసుడని మనకు తెలుసు. విశ్వామిత్రుడి యాగాన్ని భగ్నం చేయాలని తీవ్రంగా ప్రయత్నించిన ప్రబుద్ధుడు మారీచుడు. అంతేకాదు, దశరాత్ర దీక్షతో విశ్వామిత్రుడు యాగం చేస్తుంటే సరిగ్గా ఏడో రోజున యజ్ఞవేదిని కలుషితం చేస్తే మొత్తం పాడవుతుందని ముందే ఎరిగి పథకం ప్రకారం నాశనం చేసే కుటిలుడు. నిరంతరం మునుల్ని హింసించడమే పనిగాపెట్టుకొన్న దుర్మార్గుడు. అలాంటి రాక్షసుణ్ణి వాల్మీకి 'మహాత్ముడు' అని అభివర్ణించాడు. పైగా అలా అన్నది మామూలు వ్యక్తికాదు. ఒక మహర్షి వాక్యకోవిదుడైన ఋషి. మహర్షుల నోట ఎలాంటి మాట వెలువడినా దాన్ని అర్థం అనుసరిస్తుందంటాడు ఉత్తరరామచరిత్రలో భవభూతి మహాకవి. అంటే ఋషుల నోట నిరర్థకమైన మాట వెలువడే అవకాశం లేదని అర్థం. కాబట్టి మారీచుడనే రాక్షసుడు మహాత్ముడు ఎందుకయ్యాడో, ఎలా అయ్యాడో మనం పరిశీలించాలి.

విశ్వామిత్రుడు యాగదీక్షలో భాగంగా మౌనవ్రతాన్ని స్వీకరించి సిద్ధాశ్రమంలో యాగం ఆరంభించాడు. యజ్ఞకుండంలో అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లాయి. రామలక్ష్మణులు కంటికి రెప్పలా కాపలాకాస్తున్నారు. ఇంతలో ఆకాశంలో భీకరశబ్దాలు వినవచ్చాయి. నల్లని వార్షుకమహామేఘం ఆకాశాన్ని ఆక్రమించినట్లుగా తన అనుచరులతో కలిసి మారీచసుబాహులు గగనత్వాన్ని కమ్మేశారు. యజ్ఞవేదికపై రక్తవర్షం కురిపించారు. గమనించాడు రాముడు. శీతేషువును సంధించి, మానవాస్త్రంగా అభిమంత్రించి విడిచాడు. శీతేషువుశక్తి మనిషిని సంహరించదు - స్మృహను పోగొట్టి యోజనాలదూరం విసిరికొడుతుంది. మారీచుడు బతికి ఉండటమే రాముడికి కావాలి. కాబట్టి దాంతో మారీచుణ్ణి మూర్ఛపోయేలా చేసి శతయోజనాల దూరంలో సముద్రజలాల్లోకి విసిరికొట్టాడు.

అంతే! మరుక్షణంలో మారీచుడి రక్తంలోని రాక్షసకణాలు మాడి మసైపోయాయి. అణువణువునా రామభయం ఆవరించింది. దూరంగా ఎక్కడో అడవిలో ఒక ఆశ్రమం నిర్మించుకొన్నాడు. జింకచర్మం జటావల్కలాలు నియతాహారనియమాలతో పరమసాధువుగా మారిపోయాడు. కలలో మెలకువలో ఇంటాబయటా ఆఖరుకి చెట్టూపుట్టా ప్రకృతి అంతటా రామస్వరూపమే తోస్తోంది. రథం రత్నం వంటి మాటల్లోని రకారం వింటే చాలు రామనామం స్ఫురణకు వస్తోంది. అన్నివేళలా అదేధ్యాస అదేధ్యానం అదేజపం. భీతభక్తి నిలువెల్లా చుట్టుముట్టింది. అదొక విలక్షణమైన భక్తితత్త్వంగా పరిణమించింది. క్రమంగా మారీచుడికి రాముడే సర్వస్వం అయిపోయాడు. రాముడనే తుమ్మెద చుట్టూ పరిభ్రమిస్తున్న కీటకంలా మారిపోయాడు. రామభయంతో రెండో జన్మ ఎత్తినట్లయింది. ఆ రెండో జన్మలోని మారీచుడే వాల్మీకిమహర్షి చెప్పిన మహాత్ముడు!

అలా కొంత కాలం గడిచింది. ఒకసారి ఉన్నట్టుండి మారీచుడి ప్రభువు రావణాసురుడు ఈ ఆశ్రమానికి వచ్చాడు. ఒక పథకాన్ని వివరించాడు. "మారీచా! శ్రద్ధగా విను! నీవు వెండిచుక్కలతో మెరిసే బంగారులేడివిగ మారిపో. రాముడి ఆశ్రమంచెంత సీతకంటపడేలా సంచరించు. సీతను ఆకర్షించు. ఆమె నిన్ను తప్పక ఇష్టపడుతుంది. నిన్ను పట్టి తెమ్మని రామలక్ష్మణులకు పురమాయిస్తుంది. వారు లేని సమయం చూసి నేను సునాయాసంగా సీతను అపహరిస్తాను. భార్యావిరహంతో రాముడు కృంగి కృశించిపోతాడు. అలా నిర్వీర్యుడైన రాముణ్ణి సంహరించి మన ఖరదూషణాదులను చంపిన నేరానికి, శూర్పణఖను తీవ్రంగా అవమానం చేసిన పాపానికి తగిన ప్రతీకారం తీర్చుకొంటాను. రామలక్ష్మణులపై నా పగను చల్లార్చుకొంటాను" అన్నాడు.

రావణాసురుడు అలా చెబుతుంటే మారీచుడు బెంబేలు ఎత్తిపోయాడు. భయంతో వణికిపోయాడు. వాడి గొంతు ఎండిపోయింది. పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. నిలువెల్లా కంపించిపోయాడు. ఆ సందర్భంలోనే వాల్మీకి మహర్షి "మారీచస్య మహాత్మనః" అన్న విశేషణం వాడారు.

మారీచుడు నెమ్మదిగా తేరుకొన్నాడు. రావణుడికి శతవిధాల హితవుపలికాడు. బుద్ధితక్కువై తాను రెండోసారి రాముడి జోలికిపోయి చావుదెబ్బతిని బయటపడ్డ వైనం వివరించాడు. "ప్రభూ! రాముడంటే ఏమిటో నాకు తెలుసు. ఆయన ప్రతాపం ఎంతటిదో కూడా తెలుసు. నీవు ఆయన ముందు చాలవు. నా మాట విని, ఖరదూషణాదులకు శూర్పణఖకు జరిగిన అవమానాలు మర్చిపో. అవి వారి స్వయంకృతాలు కాదంటావా! నేరుగా రాముడితోనే యుద్ధానికి దిగు. అంతేగాని సీతను అపహరించడమనే మహాపరాధానికి పూనుకోకు. నీ వింకా కొంతకాలం జీవించాలనుకొంటే నీ ప్రయత్నాన్ని విరమించి హాయిగా లంకానగరానికి తిరిగి వెళ్ళిపో. సుఖంగా బతుకు!" అన్నాడు.

ఆ సంవాదం సందర్భంలోనే మారీచుడినోట "రాముడంటే ఎవరనుకొంటున్నావు? ఆయన మూర్తీభవించిన ధర్మం... రామో విగ్రహవాన్ ధర్మః" అనే లోకోత్తరమైన ప్రశంస వెలువడింది. అది మారీచుడి ఉపాసనకు ప్రతిఫలంగా రూపుకట్టిన మహావాక్యం! ఆ ఉపాసన అవిచ్ఛిన్న తైలధారలా, అవిరామంగా సాగినప్పుడే అంతటి అద్భుత మహిమాన్వితమైన భావన గుండెల్లోంచి ప్రవహిస్తుంది. వాక్యంగా వినవస్తుంది. సాధారణమైన వాక్యంకానే కాదది. ఒకానొక నిశ్చల నిర్వికార ఉపాసనస్థితిలో మనసు స్థిరపడినప్పుడు ఆ తపస్సిద్ధికి ప్రతీకగా స్ఫురించే వేదమంత్రం లాంటిదది. పరమపవిత్రమైన తులసిదళంలాంటి పలుకది. ఆ ఒక్కమాట అన్నందుకే మారీచుణ్ణి మనం మహాత్ముడిగా

సంభావించవచ్చు. ఆయన ముందు జన్మను, ఆ జన్మకు చెందిన పాపాలను పూర్తిగా క్షమించేయవచ్చు. అంతటి గొప్ప దర్శనమిది! మనలో రామాయణం తెలిసినవారు చాలామందే... కాని రాముణ్ణి తెలిసినవారు చాలా కొద్దిమంది. మహాభారతం నాటి విషయమూ అంతే. కృష్ణుడికి సమకాలికుల్లో కృష్ణుడంటే ఎవరో తెలిసిన భీష్మపితామహుని వంటివారు కొద్దిమందే. “నాకు రాముడంటే ఎవరో బాగా తెలుసు” అని బాలకాండలో విశ్వామిత్రుడు అన్నాడు, అరణ్యకాండలో మారీచుడన్నాడు. ఈ నేపథ్యం లోంచి “మారీచుడు మహాత్ముడు” అన్న వాల్మీకిమహర్షి ప్రశంసను మనం అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఋషుల మాటలకు చుట్టూ ఉండే కాంతిపరివేషాన్ని (ఇంగ్లీషులో ఆరా) మనం గుర్తించాలి. అంతరార్థాలను గ్రహించాలి.

మరి అంతటి మహాత్ముడు, మహితాత్ముడు – రావణుడు చెప్పినట్లే ఎందుకు చేశాడు? సీతాపహరణానికి ఎలా తోడ్పడ్డాడు? రామలక్ష్మణులను ఎందుకని మోసగించాడనేవి ప్రశ్నలు. వాటికి జవాబులు దొరకాలంటే మనం తిరిగి రావణ – మారీచ సంవాదం గురించి ఆలోచించాలి.

సీతాపహరణం విషయంలో తనకు సహకరించమని రావణుడు అడిగినప్పుడు పలువిధాలుగా హితవచనాలు పలికాడు మారీచుడు. “రాక్షసేశ్వరా! ఎల్లవేళలా ప్రియంగా మాట్లాడే పురుషులు నీకు లోకంలో చాలామందే దొరుకుతారు. నిజమైన హితకరమైన మాట నీకు అయిష్టంగా ఉన్నా నీముందు పలికేవారు చాలా అరుదుగా ఉంటారు. ఒక్కమాట చెబుతున్నాను విను! రణరంగంలో నీవు రాముడి కంటపడ్డావంటే చాలు మృత్యుదేవత నిన్ను సమీపించినట్లే. విశ్వామిత్రుడి యాగాన్ని భగ్నం చేయాలని నేను వెళ్ళినరోజున రాముడు నన్ను చంపాలని అనుకోలేదు. కాబట్టి బతికిపోయాను. అందులో నా చాకచక్యం ఏమీలేదు. సుబాహుణ్ణి సంహరించాలనుకొన్నాడు. ఆగ్నేయాస్త్రంతో

బూడిద చేశాడు. మాతో కూడా వచ్చిన మూకనంతటినీ వాయువ్యాస్త్రంతో చెదరకొట్టేశాడు. నా బతుకు రాముడి భిక్ష. నా ఆయుర్దాయం రాముడి ప్రసాదం. నీవు ఒక్కసారి సీతను అపహరించావే అనుకో. నీవు ఉండవు, నేనూ ఉండను, లంకా ఉండదు, రాక్షసులంటూ ఎవరూ మిగలరు! సీతను అపహరించమని నీకు సలహా ఇచ్చిన వాడెవడో గాని, నిన్ను నీ వంశాన్ని సర్వనాశనం చేసేందుకే ఈ సలహా ఇచ్చాడు. అది గుర్తించి నీ ప్రయత్నాన్ని విరమించు" అని పరుషంగానే మాట్లాడాడు.

పోయేకాలం దాపురించిన వాడికి ఔషధం రుచించనట్లు మారీచుడి మంచిమాటలు రావణుడికి నచ్చలేదు. "నిన్ను నేను సలహా అడగడానికి రాలేదు. ఆజ్ఞాపించడానికి వచ్చాను. రాముడి కంటపడితే నీవు బతుకుతావో లేదో సందేహం అని అంటున్నావు. నాతో విరోధం పెట్టుకొంటే సంశయం అక్కరలేదు, చావు నిశ్చయం. మారు మాటాడకుండా నా చేతిలో చస్తావో, రాముణ్ణి వంచిస్తావో తేల్చుకో!" అని స్పష్టంగా చెప్పాడు.

మారీచుడికి తన ఆయుర్దాయం తీరిపోయిందని అర్థమైపోయింది. చివరి మాటగా రావణుడితో "ఈ సహాయం చేస్తే అర్ధరాజ్యం ఇస్తాను, హాయిగా బతుకమని నీవు చెబుతున్నావు. నీకు అర్థంకాని విషయం ఏమంటే రాముడి కంటపడ్డానంటే చాలు. ఇక నేను చచ్చిపోయినట్లే లెక్క. సీతాపహరణంతో నీవూ చనిపోక తప్పదు. మన ఇద్దరికీ ఇక భవిష్యత్తు లేదు…" అని అంటూనే మరో విచిత్రమైన మాటకూడా అన్నాడు. "నేను రాముడి చేతిలో చనిపోయినా ఆయన నిన్నూ సర్వనాశనం చేసి తీరతాడు కాబట్టి నీ విషయంలో నేను కృతకృత్యుణ్ణే అవుతాను" అనేశాడు. ఇది చాలా లోతైన మాట.

అంటే తాను దేహత్యాగానికి సిద్ధపడటమేకాదు, రావణుడు తన పరివారంతో సహా సర్వనాశనం కావాలని కూడా మారీచుడు ఒక

నిశ్చయానికి వచ్చాడు. రాముడి చేతుల మీదుగా దాన్ని జరిపించాలని నిర్ణయించాడు. రాముడి బాణం దెబ్బతో ప్రాణాలు విడుస్తూ రాముడి కంఠస్వరాన్ని అనుకరిస్తూనే "హా సీతా! హా లక్ష్మణా!" అని పెద్ద పెద్దగ అరుస్తూ కూలిపోయాడు. రావణుడి చేతిలో చావకుండా బతికి పోయాడు. రాముడి చేతిలోనే పోయాడు.

ఇక్కడితో మారీచుడి కథ ముగిసిపోయిందని అనుకొంటే పొరబాటు. అలా అయితే మారీచుడు కిక్కురుమనకుండా చనిపోవాలి. చనిపోయాక అరిచినా, అరవకపోయినా ఇక రావణుడు చేసేదేం లేదు. అయితే, రాముడికి ద్రోహం తలపెట్టినవాడు, సీతను అపహరించాలను కొన్నవాడు - ఇక భూమ్మీద ఉండరాదన్నది మారీచుడి సంకల్పం. రావణుడితో చెప్పిన 'కృతకృత్యుడు' అనే మాట అప్పుడే నిజం అవుతుంది. 'హా సీతా! హా లక్ష్మణా' అని బిగ్గరగా కేకపెట్టడం పైకి రావణుడి ప్రణాళికలో భాగంగా అనిపిస్తుంది. మారీచుడు రాముణ్ణి మోసంచేశాడని అనుమానం వస్తుంది. అది వాస్తవమే రావణుడి కోణంలోంచి చూస్తే! కాని భ్రమరకీటన్యాయాన్ని అనుసరించిగాని, 'మారీచుడు మహాత్ముడు' అన్న వాల్మీకిప్రశంసను దృష్టిలో పెట్టుకొనిగాని ఆలోచిస్తే - అది రామతాదాత్మ్యంలోంచి ఉబికిన దివ్యస్మరణగా తెలుస్తుంది. అదీ రాముడి గొంతును అనుకరిస్తూ!

దీనికే మరో ఆధారం రామాయణంలో ఉంది. అది మారీచుడి రామభక్తికి ముక్తాయింపు. రామైక్యభావనకు చెందిన ఉట్టంకింపు! మారీచుడు బిగ్గరగా అరిచాడు. చచ్చిపడిపోయాడు. రాముడు ఏం చెయ్యాలి? తన గొంతుతో ఉన్న ఆ అరుపులకు సీతాలక్ష్మణులు తీవ్ర ఆందోళనకు లోనవుతారని, వేగంగా ఆశ్రమానికి పోయి 'తనకేం కాలేదని' వారికి ధైర్యం చెప్పాలి. అంతేకదా! కాని మరి చిత్రంగా రాముడు ఏం చేశాడో తెలుసా? పరుగుపరుగున ఆశ్రమానికి రాలేదు సరికదా...

తీరిగ్గా 'పృషతం' అనే జంతువును వేటాడి, దాని చర్మాన్ని ఒలిచి, మాంసాన్ని మూటగట్టి అప్పుడు నిదానంగా ఆశ్రమానికి చేరాడు.

ఈ కార్యక్రమంకోసం రాముడు ఎంత సమయం తీసుకొన్నాడంటే లక్ష్మణుడు పర్ణశాల నుంచి బాగా దూరం అయ్యేటంత! రావణుడు సీతను అపహరించడానికి సమయం సరిపోయేంత! సీతాపహరణం నిరాటంకంగా పూర్తయ్యేటంత! ఇదంతా దేనికంటే మారీచుడి కోరికను మన్నించేందుకు! రాక్షసజాతి రావణుడితోపాటు సమూలంగా నాశనంకావాలన్న అతడి సంకల్పం నెరవేరేందుకు! మహాత్ముల సంకల్పాలను నెరవేర్చవలసింది పరమాత్ముడే కదా మరి!

మారీచుడు ఎంతోపాపం చేసి రాక్షసుడిగా పుట్టాడు. రావణుడి అనుచరుడిగ బతికాడు. రామబాణం స్పర్శతో రెండో జన్మ ఎత్తాడు. రామధ్యాసలో తరించాడు. రాముడి అవతారలక్ష్యం కోసమే మొదట్లో తనను సంహరించలేదని గ్రహించాడు. అందుకే రావణుడికి... కాదుకాదు రాముడికి చివరల్లో సహకరించాడు. ఎంతో పుణ్యం చేసుకొని మహాత్ముడయ్యాడు. రాముడి చేతిలో మరణించాడు. తన పుట్టుకను పునీతం చేసుకొన్నాడు. భీతభక్తితో ధన్యతను సాధించాడు.

## 4. దక్ష ప్రజాపతి

దక్షుడు ప్రజాపతుల్లో ఒకడు. ఈయన బ్రహ్మకు కుడి బొటనవేలు నుంచి జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. బ్రహ్మ ఎడమ బొటన వేలునుంచి పుట్టిన ధరణిని దక్షుడు వివాహం చేసుకున్నాడు. సతి వీరి పెద్దకుమార్తె. ఆమెను పరమశివుడికి ఇచ్చి పెళ్ళి చేశాడు. శివుడి విషయంలో దక్షుడు చేసిన దురాగతాన్నే పోతన "వీరభద్రవిజయం" అనే కావ్యంగా రూపొందించాడు. ఇది వైవస్వతమన్వంతరంలోని కథ. వీరభద్రుడి ఆవిర్భావానికి చెందిన గాథ.

శివుడి నెలవై, అంతా శివమయమైన చోట, శివుణ్ణి మాత్రం పిలవకుండా, తక్కిన వారందరినీ ఆహ్వానించి దక్షప్రజాపతి అశ్వమేధ యాగం ప్రారంభించడంతో కథ మొదలైంది. శివుడి విషయంలో అది తీవ్రమైన అపచారం.

ఇంద్రాగ్ని, యమ, వరుణ, కుబేరాది సకల దేవతలను, సమస్త ఋషిగణాలందరినీ దక్షుడు పేరుపేరునా పిలిచాడు. కాని శివుని పేరైనా ప్రస్తావనకు రాలేదు. ఈ విషయం తెలిసికూడా అహంభావియైన దక్షునికి భయపడి అందరూ యాగానికి వచ్చారు. దక్షుని కుమార్తెలైన ఇరవైయేడుగురు తారలతో కలిసి అల్లుడైన చంద్రుడు వచ్చాడు. అందరికీ మర్యాదలు చేసి యాగం మొదలుపెట్టాడు దక్షుడు.

అంతలో నిర్భయంగా నిష్పక్షపాతంగా ధర్మాన్ని గురించి మాట్లాడే దధీచిమహర్షి యాగశాలకు వచ్చాడు. అక్కడున్న వారందరినీ కలయజూసాడు. యాగంలో శివుడులేని వెలితి కొట్టొచ్చినట్లు కనబడుతోంది. శివుడులేకుండా యాగం ఏమిటని ఆశ్చర్యపోయాడు. ఇంతలో ఆ మహర్షికి దక్షుడు ఎదురయ్యాడు. వెంటనే పట్టరాని కోపంతో "రుద్రుడులేని యాగమొక యాగమా? దేవాదిదేవుణ్ణి ఎందుకు

పిలువలేదని" దక్షుని నిలదీశాడు. దక్షుడు నిర్లక్ష్యంగా శివుని అవమానిస్తూ మాట్లాడాడు. శివుణ్ణి చులకన చేశాడు.

దధీచి అక్కడున్న దేవతలను, వేదాలను, బ్రహ్మవిష్ణువులను నిలదీసి ఈశ్వరుడు లేని యాగానికి మీరందరెట్లా వచ్చారని అడిగాడు. వారుకూడా నీళ్ళు నమిలారు. వెంటనే దధీచి యజ్ఞవాటికను వీడి కైలాసానికి వెళ్ళాడు. పరమేశుని ధిక్కరించి, తక్కినవారందరినీ ఆహ్వానించి దక్షుడు యాగం జరుపుతున్న విషయాన్ని విన్నవించాడు.

ఆ మాటలకు పరమేశుడు అగ్గిమీద గుగ్గిలమైనాడు. పెద్ద హుంకారం చేశాడు. ఆ హుంకారంలోంచి అతి రౌద్రరూపుడైన వీరభద్రుడు ఉద్భవించాడు. గజచర్మం, పాములు ధరించి ఉన్నాడు. వేయి చేతులు, నిప్పులు రాలే నేత్రాలు, మెరుపుల వంటి కోరలు, సూర్యబింబం లాంటి మణికిరీటం, నుదుట అగ్నినేత్రం, ఎటువంటి బ్రహ్మాండాలైనా ముక్కలు చేసి శత్రువులను చీల్చి చెండాడగల అతిబలవంతుడు ఆ వీరభద్రుడు.

రుద్రుడు పార్వతి వైపు చూశాడు. ఆమె తన కోపంలోంచి భయంకరాకారం గల భద్రేశ్వరి అను కన్యను పుట్టించింది. వీరభద్రేశ్వరుడు, భద్రేశ్వరి కలిసి పార్వతీ పరమేశ్వరులకు సాష్టాంగ నమస్కారం చేశారు. తమను పిలిచిన కారణం తెలుపమని కోరారు. పరమేశ్వరుడు దక్షుడు చేస్తున్న యాగం వలన తమకు జరిగిన అవమానాన్ని ఆయన వివరించాడు. ఆ యజ్ఞాన్ని ధ్వంసం చేసి, అందరికీ తగిన బుద్ధి చెప్పి, దక్షుణ్ణి తగిన విధంగా శిక్షించమని ఆజ్ఞాపించాడు. యజ్ఞవాటికను రణరంగంగా మార్చమని ఆదేశించాడు.

వీరభద్రుడు, భద్రేశ్వరి స్వామికి నమస్కరించి లక్షల, కోట్ల సంఖ్యలో ప్రమథ గణాలను సృష్టించి వారితో కలిసి దక్షుడి యాగానికి బయలు

దేరారు. అంత సైన్యం తరలిపోతుంటే కొండలు చెట్లు గడగడ వణికి నేలకూలాయి. ఆకాశమంతా పెనుధూళితో నిండిపోయి చీకటి కప్పేసింది. వారంతా యజ్ఞవాటికను సమీపించారు.

వీరభద్రుడు తన గణాలను హెచ్చరించి, దక్షుణ్ణి చూచి పెద్దగా బొబ్బపెట్టాడు. ఆ కేకకు లోకాలన్నీ అదిరిపడ్డాయి. యాగం చుట్టూ కూర్చున్నవారంతా భయంతో చెల్లాచెదురైనారు. మూర్ఛపోయినవారు మూర్ఛపోగా, చచ్చినవారు చావగా, పారిపోయినవారు పారిపోగా, చెట్ల తొర్రలలో దూరినవారు సృష్టిసంహారం జరుగుతున్నదేమో అని భయపడ్డారు. దక్షుడు తన భయాన్ని దాచుకుంటూ "నువ్వెవరు? ఇక్కడి కెవరు పంపితే వచ్చావు?" అని అడిగాడు. శివుడికి చెందవలసిన యాగభాగము పంచమని చెప్పాడు వీరభద్రుడు. దక్షుడు ఆ ప్రతిపాదనను తిరస్కరించి అనవసరమైన వాగ్వాదం పెట్టుకున్నాడు.

వీరభద్రుడు సభలోని వారందరినీ చూచి "ఈ దక్షుడు చేసిన పాపము క్షమించరానిది. శివుణ్ణి యాగానికి పిలువక, అతనికి యాగభాగం ఇవ్వక మహాపరాధం చేశాడు. దీనిని సమర్థించిన మీరెవ్వరూ కూడా క్షంతవ్యులు కారు. ఇక్కడున్న ఒక్కొక్కరిని వెయ్యిసార్లు చంపినా నాకోపం తగ్గదు. యుద్ధానికి సిద్ధపడండి" అని హెచ్చరించాడు.

ఆ వెంటనే శంఖం పూరించాడు. తన ఊపిరితోనే బ్రహ్మాండాలను బద్దలు చేశాడు. అనేక ఆయుధాలతో రౌద్రమూర్తియైన వీరభద్రుడు తన గణాలతో కలిసి, వారిపై విరుచుకుపడ్డాడు. దేవతలను ఖండ ఖండాలుగా చేశాడు. వాళ్ళంతా చెల్లాచెదురై తలొక వైపు చెదిరిపోయారు.

ఇంద్రుడు, విష్ణువు, అగ్ని, సూర్యుడు, యముడు, వాయువు, చంద్రుడు మొదలైనవారందరిని పేరుపేరునా పిలిచి శిక్షించాడు. సూర్యుని రక్తం కక్కుకొనేట్లు కొట్టాడు. అగ్నికి నాలుక కోసేశాడు.

యముని పిడికిళ్ళతో గుద్ది కాళ్ళకింద వేసి మర్దించాడు. నైరుతుని గదలతో పిండి చేశాడు. యక్షమూకలను అగ్నినేత్రాలతోనే భస్మం చేసాడు. చంద్రుని తన మెరుపుల కోరలతో గుచ్చాడు.

ఇలా వీరభద్రుడు మదపుటేనుగులా విజృంభించి యాగస్తంభాలను పీకేస్తూ, ఆచార్యులు హెూతలు గంధర్వ సిద్ధ సాధ్య సమూహాలను మట్టగిస్తూ, సురాసురులను నరికి పోగులు పెడుతూ ప్రళయకాలాగ్నిలా విరుచుకుపడ్డాడు.

ఈ విధంగా దేవతాగణాలను, ఋషి మునిగణాలను వేధించి వీరభద్రుడు దక్షుని వైపు తిరిగాడు. "అంతటి మహనీయుని లెక్క చేయకుండా ఇంతటి మహాపాపానికి ఒడిగట్టిన నిన్ను బ్రతకనివ్వను." అని హెచ్చరించగా, దక్షుని బంధుజనులు, భార్యాబిడ్డలు తలలు బాదుకొని ఏడ్చారు. అయినా వీరభద్రుడు శాంతించలేదు. దక్షుని తలనరికి భద్రకాళి చేతికిచ్చి ఆనందంగా నాట్యం చేసుకోమన్నాడు.

భద్రకాళి తెగిన దక్షుని తలతో బంతి ఆట ఆడుతూ నాట్యం చేస్తూ యజ్ఞవాటిక అంతటా కలయతిరిగింది.

ఆ సమయంలో యాగపురుషుడు మాయామృగం రూపంతో పారిపోతుంటే వీరభద్రుడు వెంటాడి, తరిమి అర్ధచంద్రబాణంతో అతని శిరస్సు ఖండించాడు. దేవతాజనులు భయపడి చెల్లాచెదరై పారిపోతుంటే విష్ణువు వారిని నిలువమని చెప్పి వీరభద్రుని అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య భయంకరమైన యుద్ధం జరిగింది. ఈ యుద్ధం కోసం శివుడు ప్రత్యేకమైన రథం వీరభద్రునికి పంపాడు. యుద్ధంలో వీరభద్రుడు విష్ణువు రెండు భుజాలలోను బలంగా గుచ్చుకొనేట్లు బాణాలు గుప్పించాడు. విష్ణువు వీరభద్రుని తన అస్త్రశస్త్రాలతో నొప్పించాడు. వారిద్దరికి వారిద్దరే సాటి... మరెవ్వరూ సాటిరారు అన్నట్లు భీకరయుద్ధం జరిగింది.

వీరభద్రుడు విష్ణువు విల్లువిరిచి గరుడుని రెక్కలు ఖండించాడు. విష్ణువు కోపంతో శంఖ, చక్ర, గదాధరులైన తనవంటి సైన్యాన్ని సృష్టించాడు. వారందరినీ వీరభద్రుడు తనకంటిమంటలతో మసిచేశాడు. విష్ణువు చక్రాన్ని ప్రయోగిద్దామని చేయెత్తాడు. కాని వీరభద్రుని రౌద్రరూపం చూసి భయపడ్డాడు. రథంలేక నేలపైనున్న విష్ణువును తన బాణాలతో అంతం చేద్దామనుకొని కూడా, ఆయన శివునకు ప్రియమిత్రుడు అని ఆగి, ఆలోచించి ఆ ప్రయత్నం విరమించాడు. ఆ చక్రాన్ని నుగ్గునుగ్గు చేశాడు.

ఇంద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించగా వీరభద్రుడు దానిని చేతితో పట్టుకున్నాడు. తన కెదురొచ్చిన దేవగణాలందరినీ భగ్న శరీరులుగా చేశాడు. ఆ ప్రదేశమంతా రక్తపుటేరులు పారించాడు. శివనిందచేయువారికి, స్మృతులను నిందించినవారికి, అటువంటి వారి పక్షాన చేరినవారికి ఇలాగ చేటు తప్పదని తెలియజేశాడు.

ఈ విధంగా వీరభద్రుడు, భద్రకాళి, ప్రమథగణాలు యుద్ధమున చెడినవారందరినీ పరమశివుని పాదాల ముందు పడవేశారు. అప్పుడు బ్రహ్మ పరమేశ్వరునితో "బిడ్డల తప్పులు మన్నించడం తండ్రులకు తగి యున్నది. కనుక క్షమించ"మని పలికాడు.

కరుణామయుడైన శివుడు వారందరిని మన్నించి పూర్వపు రూపాలను అనుగ్రహించాడు. వారందరూ శివునికి ప్రణామం చేసి, తమను అనుగ్రహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పరిపరి విధాల శివుని స్తుతించారు.

అందరూ ఒకచోట కొలువుదీరారు. వీరభద్రుడు జరిగిన విధ్వంస కాండను సవిస్తరంగా శివునికి నివేదించాడు. దేవతలందరికీ వారివారి ఆయుధాలు ఇచ్చివేశాడు. పరమ దయాళువైన శివుడు దక్షుని కూడా

అనుగ్రహించి అక్కడ పడిఉన్న ఒకపొట్టేలుతలను తెచ్చి దక్షుని శరీరానికి అంటించమని ప్రాణం పోసాడు. దక్షుడు తన అజ్ఞానాన్ని మన్నించమని వేడుకున్నాడు. నాటి నుండి శివద్వేషం వీడి దక్షుడు పరమ భక్తుడైనాడు. శివుడు వీరభద్రుడిని ప్రమథగణాలకు రాజుగా అభిషేకించాడు. వీరభద్రుడు, భద్రకాళి ఇరువురూ కలిసి గౌరీశంకరులకు నమస్కరించారు. పరమేశ్వరుడు వారిని దగ్గరకు తీసుకొని తన ఒడిలో కూర్చుండబెట్టుకొని ఆశీర్వదించాడు.

సహజకవి పోతన నిర్మించిన వీరభద్రవిజయం సంక్షిప్త కథాంశం ఇది. ఆధునిక యుగంలో దక్షుడి స్వరూపాన్ని గుర్తించాలంటే మనిషి తన మనస్సనే దర్పణాన్ని పరికించాలి. ''నేను గొప్ప సమర్థుణ్ణి''... ''నేను బాగా సిరిసంపదలు కలిగినవాడిని''... ''నా రూపం ఎంతో ఆకర్షణీయమైనది''... వంటి భావనలు మనసుతో నిండుగ తొణికిసలాడే ప్రతివాడూ ఒక దక్షుడే! అలాంటి ఆలోచనలు తనలో జీర్ణమైపోయినప్పుడు. మానావమానాలపట్ల పట్టింపు ఎక్కువగా ఉంటుంది. ప్రతి విషయంలో ''నా అంతటివాణ్ణి''... అనే దురహంకారం దూసుకొచ్చి ఎదుటివాడు తనను అవమానం చేశాడన్న చింత ప్రారంభం అవుతుంది.

ఇంతకూ శివుడిపై దక్షప్రజాపతి ఆగ్రహించడానికి గల కారణం చాలా చిన్నది. ఒకసారి ఎప్పుడో ఆయన సభలోకి ప్రవేశించే సమయంలో అందరూ గౌరవంగా లేచి నిలబడ్డారు. శివుడు మాత్రం లేవలేదు. అల్లుడు చేసిన పని మామగారికి చిన్నతనంగా తోచింది. ''హత్తెరి! ఒక ప్రజాపతి అంతటి వాణ్ణి... నేను సభలోకి వచ్చినప్పుడు ఆయన లేచి నిలబడకపోవడమా! ఎంత కండకావరం!'' అని ఆగ్రహించాడు. దానికి ప్రతీకారంగా ఇప్పుడు తాను తలబెట్టిన యాగానికి అసలు పిలవడమే మానేశాడు. ఇంతటి రభసకు అంతచిన్న సంఘటన కారణమైంది.

మన జీవితాల్లోనూ ఎన్నో సందర్భాల్లో సరిగ్గా ఇలాంటి సంఘటనలే ఎదురవుతూ ఉంటాయి. మనం అవమానానికి లోనవుతూనే ఉంటాం. నిజానికి అవమానం అనేది అవతలివ్యక్తినుంచి మనకు కలగదు. మనలోని దక్షుడు మేల్కొన్నప్పుడు మనకు మనమే ఆపాదించుకొంటాం అవమానాన్ని!

వాస్తవానికి చదరంగం ఆట నడుస్తున్నప్పుడే రాజూ–బంటు అనే తేడాలు. ఆట ముగిసేసరికి పావులన్నీ చేరుకొనేది, ఒకే పెట్టెలోకి జీవనచదరంగం పూర్తికాగానే మానవులందరూ జారుకొనేది – ఒకే మట్టిలోకి! ఈ సత్యం మనసులోకి ఇంకినప్పుడు మనలోంచి దక్షుడు తొలగిపోతాడు. సత్యం ఆవిష్కారం అవుతుంది.

"తాను వస్తే అల్లుడు లేచి నిలబడలేద"ని అలిగిన దక్షుడు శ్రీమహావిష్ణువు రాగానే పరమశివుడు తటాలున లేచి నిలబడటం చూడగానే సత్యం గ్రహించాడు. ఆ సత్యమే వీరభద్రుడై దక్షుణ్ణి సంహరించింది. కనుక ఈ కథకు "వీరభద్రవిజయం"గా పేరొచ్చింది.

## 5. వామనావతారం

**శంభుండో హరియో పయోజభవుడో....**
**స్వస్తి, జగత్త్రయీ భువన శాసనకర్తకు...**
**కారే రాజుల్ రాజ్యముల్ గల్గవే...**
**ఇంతింతై వటుడింతయై మరియు...**
**రవిబింబంబు ఉపమింప పాత్రమగు...**

ఈ అయిదు పద్యాలూ – వామనావతారఘట్టానికి పంచ ప్రాణాలు! పోతన్నప్రశస్తికి మూలకారణాలు. అలాగే వామనుడి తల్లి అదితి – "నన్ను కన్నతండ్రి నా పాలి దైవమ..." అంటూ తన బిడ్డనే పిలుస్తుంది. కన్నబిడ్డను కన్నతండ్రి అని పిలవడమనేది తెలుగుభాషకు మాత్రమే దక్కిన మమకారపు నుడికారం. ఇక ఏ భాషకు దక్కిందండీ అంత తియ్యని వరం!

అదిగో, ఆ వామనుడు బలిచక్రవర్తి యాగశాలకు నడిచివస్తుంటే అక్కడివారంతా అనుకున్నారట – ఎవరీ బాలుడు? పరమశివుడా? ప్రజాపతా? సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడా? సూర్యభగవానుడా? లేక అగ్నిభట్టారకుడా? అని. ఆ బాలవటుడి తేజస్సు చూస్తుంటే వారికలా అనిపించిందన్నమాట. పైన చెప్పిన అయిదు పద్యాల్లో మొదటిదాని తాత్పర్యం – ఇదే! అసలు వామనావతారం బాపతు ప్రధానలక్ష్యం – ఆ పొట్టి ఆకారంలోనే వ్యక్తమయింది. యాచనకు వచ్చినవాడు ఒదిగి ఉండాల్సినవాడే కదా! ఇచ్చేవాడికన్నా చిన్నవాడే కదా! అదీ అందులోని రహస్యం.

తనరూపంతో సగం కార్యం చక్కబెట్టాడు. ఇకమాట! సభలోకి వస్తూనే వామనుడు ఒళ్ళు ఝుల్లుమనేలా అందుకున్నాడు పద్యం. ఈ ముల్లోకాలకు అధినేత అయిన నీకు శుభమగు గాక! "స్వస్తి! జగత్త్రయీ

భువనశాసనకర్తకు...!" అంటూ అసలీ పద్యం ఎత్తుగడలో ఉంది సొగసంతా! అక్కడికి బలిచక్రవర్తికథ పూర్తయిపోయినట్లే! ఆ పద్యంతోనే అతను వామనుడికి దాసానుదాసుడైపోయాడు. ఏం కోరినా ఇచ్చేస్తానని అనేసాడు కూడా! అయినా వామనుడు బలిచక్రవర్తివంశచరిత్రను అంతా తవ్విపోసాడు. ఎందుకని? అక్కడ దైత్యగురువు శుక్రాచార్యుడున్నాడు. ఆయన అడ్డుపుల్ల వేసినా - బలిని తన మాట తప్పడానికి వీల్లేనంతగా లోబర్చుకోవాలి. అందుకనే బలితాలూకు పూర్వీకుల చరిత్రను ఏకరువు పెట్టాడు. మనలో కూడా కొందరికి అనిపిస్తుంది. వామనుడు రాజును పొగడవలసిన అవసరం ఉందా! కావలసిందేదో అడిగి పట్టుకుపోవచ్చు కదా - అని.

నిజానికి అది పొగడ్త కాదు - ఉపదేశం! "బాబూ! నీ పెద్దల మార్గం ఒక్కసారి గుర్తుచేసుకో. ఈ మాయ నుంచి బయటపడు" - అని వామనుడు చేసిన ఉపదేశమది. "స్తుతిముఖేన ఉపదేశః" అని మన పెద్దలు చెప్తుంటారు. అలా ఇక్కడ వామనుడు వందిమాగధుల పాత్రలను పోషించాడన్న మాట. వందిమాగధులనేసరికి రాజులను అస్తమానూ పొగడుతూ ఉండేవారని మనకి అనిపిస్తుంది. కాని నిజం కాదు. అది చలనచిత్రాల వల్ల కలిగిన దురభిప్రాయం మాత్రమే!

వందిమాగధులనేవాళ్ళు భజనరాయుళ్ళు కాదు. అదొక వ్యవస్థ. వాళ్ళు రాజోద్యోగులు. వాళ్ళపని రాజుని పొగడ్డం కాదు. హెచ్చరించడం! ఏమైనా తేడా వస్తే, తలతీసేసే రాజులను - దారిలో పెట్టడానికి వందిమాగధులనేవాళ్ళు - చాలా చాకచక్యంగా వ్యవహరించేవారు. రాజుగారు ఏదైనా తలవంపులు తెచ్చే పనులకు పాల్పడుతున్నాడనుకోండి - అప్పుడు వంది ఆయన ముందు నిల్చి రాజుగారి వంశానికి చెందిన వైభవోపేతమైన గతాన్ని కీర్తిస్తాడు. అంటే ఏమన్నమాట - "అయ్యా! మీరిలాంటి కానిపనులకు తలపడి - మీ వంశానికి చెడ్డపేరు తేవద్దని

చెప్పడం! వంశగౌరవానికి చెందిన పరంపరను, వారసత్వాన్ని ఇంగ్లీషులో 'పెడిగ్రీ' అంటారు. దాన్ని పరిరక్షించే పని వందిది.

ఇక మాగధుడు చేసేపని - 'లెగసీ'కి సంబంధించినది. రాజుగారి వ్యక్తిగత గుణగణాలను సందర్భోచితంగా గుర్తుచేస్తూ - ఆభిజాత్యాన్ని స్ఫురణకి తెచ్చి, వ్యక్తిగతప్రతిష్ఠకి కళంకం తెచ్చే పనుల నుండి రాజును దూరంగా ఉంచి కాపాడే పని మాగధుడిది. మనిషి వ్యక్తిగతప్రతిష్ఠ ద్వారా వంశానికి లభించే గౌరవాన్ని ఆంగ్లభాషలో లెగసీ అంటారు. దాని రక్షణ మాగధుడిది.

వామనుడు చేసిన పని సరిగ్గా అదే. పూర్వీకుల యశస్సునూ, బలిచక్రవర్తికీర్తినీ రెండింటినీ అతను ప్రస్తావనకు తెచ్చాడు. ఇది గొప్ప ప్రస్తావనా చాతుర్యం. చెట్టుసారం పండులో వ్యక్తమైనట్లుగా మనిషి సారం మాటలో వ్యక్తమవుతుంది. వామనుడి పలుకులను బట్టి మనం అటు వామనుడి సారాన్ని గ్రహించవచ్చు.

మాగధుడి పాత్రను పోషిస్తూ, "నీవు గొప్ప పరాక్రమవంతుడివి. అంతేకాదు, దాతల్లో నీతో పోల్చదగినవారు ఈ ముల్లోకాల్లో లేరు" అని వామనుడు అంటుంటే - అతను ఏమి అడిగినా దానం ఇచ్చేయాలన్న నిశ్చయానికి వచ్చేయడం, ఒక ప్రక్కన శుక్రుడు వారిస్తున్నా ఆ వటువును చూస్తుంటే కాదనబుద్ధి పుట్టడం లేదయ్యా అనడం, ఒకవేళ అతను విష్ణువే అయినా అతని చేయి క్రిందవడం, నా చేయి పైది అవడం చాలదా అనడం అలా అని బలికి అనిపించడం ఇదిగో ఇదంతా విష్ణుమాయ.

"కారే రాజుల్, రాజ్యముల్ గల్గవే గర్వోన్నతిం బొందరే? వారేరీ? సిరిమూట గట్టుకుని పోవం జాలిరే"- అని శుక్రుణ్ణి ప్రశ్నించడం దాకా బాగానే ఉంది. దానం చేద్దామన్న ప్రీతివరకూ ఏమీ ఫర్వాలేదు కానీ, దాతననే గర్వం తలకెక్కుతోందని గమనించకపోవడముందే, అదే తన

పతనానికి కారణం కాబోతోందని గ్రహించలేకపోవడముందే, అదే విష్ణుమాయ! దాతననే గర్వం తలకెక్కి విష్ణువు చేయి 'క్రింద' నా చేయి 'పైన' అనే భావనకి చోటిచ్చిందే, అదే విష్ణుమాయ!

బలి వామనుణ్ణి అడుగుతాడు – "ఇంత చిన్నకోరిక కోరడం నీకు మర్యాదా కాదు, నాకు పరువూ కాదు. నాలాంటి చక్రవర్తి దానం చేసేడంటే – ఇక పది జన్మల వరకూ దరిద్రం నీ దరి చేరరాదు. తిరిగి ఎక్కడా చేయి చాపవలసిన అవసరం రాకూడదు" అని.

దీనికి వామనుడు – "దాత చాలా గొప్పవాడు కదా అని, అవసరం లేకపోయినా అడగడం తప్పు. పుచ్చుకునేవాడి ఆశను బట్టి కాక, అవసరాన్ని బట్టి కోరిక ఉండాలి" అని అంటాడు.

ఇక వామనమూర్తి విశ్వరూపాన్ని వర్ణిస్తూ పోతన్నగారు ఇంతింతై పద్యంలో తన చేతిలోని కెమెరాను నేలమీంచి క్రమంగా ఇదిగో ఇంతవాడు ఇంతయిపోయాడు. అంతైపోయాడు. ఎంతో అయిపోయాడంటూ ఆకాశం లోకి తీసుకుపోతాడు. మళ్ళీ రవిబింబం పద్యంలో మళ్ళీ అంత పై నుంచి క్రమంగా కిందకి తీసుకొస్తాడు.

మహత్తరమైన పద్యాలివి రెండూ సరస్వతికి నైవేద్యాలు. ఆర్ట్ ఫోటోగ్రఫీలో అసలు వస్తువు – దాని ఇతివృత్తము – అని రెండు రకాలుంటాయి. అసలు వస్తువంటే సబ్జెక్టు; లేదా సెంటర్ ఆఫ్ అట్రాక్షన్. ఇతివృత్తమంటే బ్యేక్‌డ్రాప్ లేదా పెరెస్పెక్టివ్ అనే అర్థంలో తీసుకొంటే – "ఇంతింతై..." పద్యంలో ఇతివృత్తం స్థిరంగా ఉండి వామనుడు పెరిగిపోతుంటాడు. ఆకాశాన్ని, మేఘాలను, సూర్యమండలాన్ని, ధృవ, మహర్లోకాల్ని... ఆఖరికి బ్రహ్మాండాలని ఆక్రమిస్తాడు. అదే "రవిబింబం..." పద్యంలో వస్తువు స్థిరంగా ఉండి ఇతివృత్తం కదులుతున్నట్లు కనబడుతుంది. అంటే వామనుడు స్థిరంగా నిల్చుని

ఉంటే– ఆయన తలపై సూర్యబింబం మొదట గొడుగులా ఉందిట. ఆ తర్వాత శిరోభూషణమైంది. పిదప చెవికి అలంకారంలా తోచింది. ఆ పైన కంఠానికి భూషణమైంది. కాసేపటికి దండకడియం అయింది. ముంజేతి కంకణం అయింది. మేఖలాఘంటిక (ఘంటిక అంటే చిన్న ఘంట అని అర్థం) అయింది. ఇంకా కిందకి దిగిపోయి, కాలి అందెగా, ఆఖరికి పదపీఠికగా కనిపించింది. అంటే వామనుడు అంతగా ఎదిగిపోయాడు.

ఇది మూలభాగవతంలో లేని వర్ణన. ఇది పోతన్న చిత్రణ. ఇది వ్యాసుడు చెప్పిన విశేషం కాదు. పోతన్న చూసిన విశేషం. నెత్తిమీద కనబడిన సూర్యుడు క్షణాల వ్యవధిలో పాదాల దగ్గర కనిపించాడంటే ఇక వామనుడి తలభాగం ఏలోకాలను దాటిపోయి ఉంటుందో మనల్ని ఊహించుకోమని సూచించిన వర్ణన! మొదటి పద్యం భౌతికమైన జగత్తుకి సంబంధించినది – రెండోది భావనామయ జగత్తుకి చెందినది. మొదటిది కంటిలో కదిలే బొమ్మ. రెండోది మనసులో ఎదిగే బొమ్మ. వామనమూర్తి త్రివిక్రమతత్త్వం నెపంతో పోతన్న ప్రదర్శించిన కవితావిశ్వరూపం ఇది!

భగవంతుడి అవతారవిభూతి రెండు విధాలుగా ఉంటుందన్నారు అరవిందయోగి. మనిషిగా రావాలనుకొంటే – మనిషి ఆకారాన్ని, స్వభావాన్ని తనలో ఆవాహన చేసుకొని మరీ దిగిరావడాన్ని – 'అవరోహణ' అన్నారాయన. మనిషిగా దిగి వచ్చిన దివ్యశక్తి తిరిగి దైవ స్వభావాన్ని ప్రకృతిచైతన్యాన్ని ఉపాసిస్తూ దేవతాస్వరూపుడిగా ఎలా ఎదగాలో ఈ లోకానికి స్వయంగా నేర్పించడాన్ని – 'ఆరోహణ'గా పేర్కొన్నారు. రామావతారాన్ని గమనిస్తే ఆ విషయం స్పష్టంగా మనకు బోధపడుతుంది.

దుష్టశిక్షణ, శిష్టరక్షణ అనేవి అవతారమూర్తుల ప్రధాన లక్ష్యాలు. వామనావతారం మాత్రం దానికి భిన్నంగా సాగింది. వామనుడు చేసిందల్లా

బలిచక్రవర్తిని నిగ్రహించడం ఒక్కటే. బలి దుర్మార్గుడు కాదు సరికదా, దాతగా పేరొందినవాడు. అలాంటివాణ్ణి శిక్షించడం దుష్టశిక్షణ కాదు. కాబట్టే భాగవతాన్ని వివరిస్తున్న శుకయోగిని "ఏ తప్పూ చేయని బలిని హరి వరుణపాశాలతో ఎందుకని బంధించాడు?" అంటూ పరీక్షిత్తు ప్రశ్నించాడు భాగవతంలో. అప్పుడు శుకమహర్షి ఒక రహస్యాన్ని వెల్లడించారు.

అది ఏడో మన్వంతరం. దానికి భూలోక అధిపతి - వైవస్వత మనువు. దేవలోక అధిపతి - పురందరుడు. ఆయనే ఇంద్రుడు. ఇది సృష్టి నిర్దేశించిన ఒక చట్టం. బలి ఆ చట్టాన్ని ధిక్కరించాడు. భార్గవులను బతిమాలి, వారి సాయంతో విశ్వజిత్‌యాగాన్ని నిర్వహించాడు. అగ్నిహోత్రుడి నుంచి దివ్యరథాన్ని, సింహపతాకాన్ని, అభేద్యకవచాన్ని, ఎన్నో అమోఘ ఆయుధాలను సాధించాడు. వెంటనే దేవేంద్రుడిపై దండెత్తి ఆయన సింహాసనాన్ని ఆక్రమించాడు. అంతేకాదు చాలా తెలివిగా ఆలోచించి "నా కన్నా ముందు ఎందరో రాక్షసులు స్వర్గాన్ని ఆక్రమించినా, వారు ఎంతోకాలం ఆ పదవిని ఎందుకు నిలబెట్టుకోలేకపోయారు?" అని కులగురువు శుక్రచార్యుడితో సమాలోచనలు చేశాడు. దానికి శుక్రుడు గొప్పగా ప్రతిస్పందించాడు. ''రాజా! ఇంద్రపదవిని నిలబెట్టుకోవాలంటే పరాక్రమం ఒక్కటే చాలదు... తపోబలమూ కావాలి... యజ్ఞయాగాదులు నిర్వహించాలి... దేవతలను మెప్పించాలి... వేదవేత్తల దీవెనలు పొందుతూ ఉండాలి... ఉదాత్తస్వభావుడిగా మారాలి... రాక్షసులకు అది సాధ్యంకాదు. ఇంద్రపదవి దక్కగానే ఇష్టానుసారం ప్రవర్తిస్తూ వారు భ్రష్టులైపోతూ వచ్చారు. అందుకే మనవారెవరూ ఆ పదవిలో ఎక్కువకాలం మనలేకపోయారు" అని శుక్రాచార్యుడు వివరించాడు.

బలిచక్రవర్తి వివేకి. గురువు సూచనలను అక్షరాలా పాటించాడు. మంచిపేరు తెచ్చుకొన్నాడు. ఇంద్రుడిగా శాశ్వతంగా ఉండిపోవాలన్నదే

వాటి వెనక అసలుసిసలు ఆంతర్యం. వాస్తవానికి ఆ మంచిపనుల కారణంగానే దరిమిలా ఎనిమిదో మన్వంతరం 'సావర్ణి'లో ఆయనే కాబోయే ఇంద్రుడు! అంటే ఆయన చేసిన సత్కార్యాలు వృథా కాలేదు. త్రిలోక ఆధిపత్యంపై మమకారం, రాక్షసకులంలో ఈ స్థాయి యజ్ఞయాగాదులు ఎవరూ చేయలేకపోయారన్న అహంకారం, సృష్టిక్రమాన్ని ధర్మాన్ని ధిక్కరించి విశ్వరాజ్యాంగసంక్షోభానికి కారకుడు కావడం అనే మూడు దోషాలే – వామనుడి మూడు అడుగులై బలిచక్రవర్తిని పాతాళానికి అణిచేశాయి. రాక్షసగుణాలతో వామనత్వం వహించిన బలిని నిజానికి వామనావతారంలో శ్రీహరి 'ఉద్ధరించాడు' పాతాళరాజ్యాభిషిక్తుణ్ణి చేసి తపోబలంతో బలి దైవీగుణవంతుడు కావడానికి కారణం అయ్యాడు. అది శిక్ష కాదు – శిక్షణ. అవలక్షణాల నుంచి బలిని స్వర్గాధిపత్యం దిశగా ఆరోహణ చేయించడమే – వామన అవతారలక్ష్యం!

వాస్తవానికి అతల వితల సుతల రసాతల పాతాళాది లోకాలను 'దిగువలోకాలు' అంటారు. అవి రాక్షసుల పాలనలో ఉంటాయి. బలిచక్రవర్తి స్థావరం నిజానికి అదే. ఎంతటి సజ్జనుడైనా, దాత అయినా ఆయన ఉండవలసింది దిగువలోకాల్లోనే. అయితే తన బలిమిని చూసుకొని విర్రవీగుతూ, ఊర్ధ్వలోకాలను ఆక్రమించాలని చూడటం బలిచక్రవర్తి చేసిన నేరం. మానవులకు, దేవతలకు చెందిన ఊర్ధ్వ లేదా ఎగువలోకాలను ఆక్రమించాలనుకోవడం దుస్సాహసం. అది ధర్మాతిక్రమణం. త్రిలోకాధిపత్యం అనేది ఆయన దురాశ. అలా ముల్లోకాలను ఆక్రమించడం దురాక్రమణ అవుతుంది. బలి విషయంలో అది స్వయంకృతనేరం. విశ్వరాజ్యాంగధిక్కారం బలి చేసిన దోషం. కాబట్టి అంతటి సజ్జనుడూ నేరస్థుడై శిక్ష అనుభవించవలసివచ్చింది. ఎగువలోకాల పాలకులు దిగువలోకాలను గాని, దిగువలోకాల వీరులు

ఎగువలోకాలను గాని ఆక్రమించాలనుకోవడం వల్ల విశ్వరాజ్యాంగ సంక్షోభం ఏర్పడుతుంది. బలిచక్రవర్తి వల్ల ఏర్పడింది. కాబట్టి విశ్వరాజ్యాంగనిర్మాత, సంరక్షకుడు అయిన శ్రీహరి వామనావతారం ధరించి బలిని శిక్షించవలసివచ్చింది. అయితే రావణాది దానవుల మాదిరి బలి దుర్మార్గుడు కాదు. కాబట్టి వామనుడు బలితో యుద్ధంగాని కనీసం గాయపర్చడం కాని చేయలేదు. తన రాజ్యానికి తిరిగి పంపించాడు. ఎగువలోకాల్లోకి ప్రవేశించకుండా అదుపు చేశాడు.

శ్రీమహావిష్ణువు ధర్మానికి రక్షకుడు, పాలకుడు. మూడడుగుల నేలను యాచించి, బలి నుంచి దానం స్వీకరించాక, ఒక అడుగుతో ఎగువలోకాలను, రెండో అడుగుతో దిగువలోకాలను ఆక్రమించాడు. బ్రహ్మాండం కంపించిపోయింది. విశ్వం క్షోభించింది. విష్ణువుకు జాలి కలిగింది. తిరిగి త్రివిక్రమరూపం చాలించి వామనమూర్తిగా మారాడు. బలిని సమీపించి, అతడికి మరో అవకాశం ఇచ్చాడు. "రాజా! మూడో అడుగు మోపేందుకై చోటు చూపిస్తావా? లేక అసత్యదోషం కారణంగా అంటే మాటతప్పడం వల్ల నరకానికి పోతావా?" అని అడిగాడు. అప్పుడు బలిచక్రవర్తి తన తలను చూపించాడు. "ఈ ఆయువుగాని ఐశ్వర్యంగాని రాజ్యభోగాలుగాని... ఏవీ శాశ్వతం కావు. అందుకే మా తాత ప్రహ్లాదుడు నిన్ను సేవించి ధన్యుడయ్యాడు" అన్నాడు. అక్కడితో ఆగిపోలేదు. "నీ అంతటివాడు నా దగ్గరకు యాచకుడిగా రావడం నేను చేసుకొన్న పుణ్యం" అన్నాడు. అంటే ఇంతకుముందు శుక్రుడితో ఇదేమాట చెప్పినప్పుడున్నంత అతిశయం లేదుగాని, 'శ్రీహరిచేయి నా చేతికన్నా కిందిది' అనే భావనలోని అహంకారలేశం ఇంకా బలిని విడిచి పెట్టలేదన్నమాట. అది శ్రీహరిపాదస్పర్శతో కాని పూర్తిగా తొలగిపోదు. కాబట్టి వామనుడు బలితలపై తన పాదం మోపి ఆ మోహాన్నిసైతం నిర్మూలించాడు. బలిని పునీతుణ్ణి చేశాడు.

ఇంతలో బలిచక్రవర్తి భార్య వింధ్యావళి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ వచ్చింది. ఆమె పరమ యోగ్యురాలు. పతివ్రత. దానం గ్రహిస్తున్నవాడు శ్రీమన్నారాయణమూర్తి అని తెలిసీ, నిశ్చింతగా నిర్వికారంగా బంగారు కలశంతో జలాన్ని తెచ్చి. బలిచక్రవర్తి వామనుడి కాళ్ళు కడిగిన సన్నివేశంలో ఆ జలకాన్ని ధారగా పోసింది. అయినా ఈ సన్నివేశం చూసి చలించిపోయింది. "నా భర్త నీవు కోరినదల్లా దానమిచ్చాడు కదా! అయినా ఇలా చేస్తున్నావేమిటి?" అని వామనుణ్ణి నిలదీసింది.

దానికి వామనుడు చెప్పిన సమాధానం – వామనావతారఘట్టానికి పతాక శీర్షిక వంటిది. బలిచక్రవర్తికే కాదు, ఈ విశ్వానికే పాఠం వంటిది. ఆయన ఏమన్నాడంటే "నేను ఎవరిని అనుగ్రహిస్తానో వారి ఐశ్వర్యాన్ని ముందుగా హరిస్తాను. ఎలాంటి గర్వానికి, ఇంద్రియప్రలోభాలకు గురికానివాడే నా అనుగ్రహానికి పాత్రుడౌతాడు. నీ భర్త ఎంతో పుణ్యాత్ముడు. అందుకే నేను అనుగ్రహించాను. ఇకపై అతడికి ఏ దుఃఖమూ అంటదు. సుతలలోకానికి పోయి హాయిగా జీవిస్తాడు" అన్నాడు. అలా అంటూ తన భక్తవాత్సల్యానికి చిహ్నంగా "నేనే అతడి రాజ్యానికి రక్షకుడిగా కాపలా ఉంటాను" అని మాట ఇచ్చాడు. ఇచ్చిన ప్రకారం కాపలాదారుగా ఉండిపోయాడు. లోకాలను కాచే శ్రీహరి బలిఇంటికీ కాపలాకాశాడు. అదీ శ్రీహరి భక్తపరాధీనతకు ప్రగాఢ సాక్ష్యం!

అలా ఉన్న రోజుల్లోనే ఒకసారి రావణాసురుడు సుతలలోకానికి వచ్చి బలిచక్రవర్తిని రెచ్చగొట్టబోయాడని పురాణవచనం. బలి చలించలేదు. ప్రలోభానికి లొంగలేదు. "ఈ పురమందిరం వాకిలిలో ఉన్న స్వర్ణచక్రాన్ని తొలగించగలవేమో చూడు" అన్నాడు రావణుడితో. ఎంత ప్రయత్నించినా దాన్ని కనీసం కదపడం రావణుడివల్ల కాలేదు. "నా నగరాన్ని శత్రుదుర్భేధ్యంగా సంరక్షిస్తున్న ఆ చక్రం సాక్షాత్తూ

శ్రీమహావిష్ణువు” అని బలిచక్రవర్తి రావణుడికి చెప్పాడు. అలా ఇచ్చిన మాట ప్రకారం బలిని, అతడి రాజ్యాన్ని రక్షించాడు శ్రీహరి. తదనంతరం సావర్ణిమన్వంతరంలో ఇంద్రపదవికి తగిన అర్హత చేకూరేలా బలిచక్రవర్తిని పుణ్యకార్యాలకు ప్రేరేపించాడు. పాతాళలోకాలనుంచి ఉద్ధరించి మధ్యలో మానవలోకాలను దాటించి, దేవలోకమైన స్వర్గానికి అధిపతిని చేసి బలిచక్రవర్తిజన్మకు ధన్యతను చేకూర్చాడు.

ఇదీ! వామనమూర్తి అసలుకథ!

## 6. ప్రవరాఖ్యుడి కథ

అనగా అనగా ఒక ఊరు, పేరు అరుణాస్పదపురం. ఆ ఊళ్ళో ప్రవరుడు అనే ఒక సజ్జనుడుండేవాడు. అతడు గొప్ప శీలసంపద కలవాడు. సుగుణాలరాశి. ఎన్నడూ ధర్మమార్గం తప్పనివాడు. వేదవేదాంగ పండితుడు. యౌవనమందే యజ్ఞయాగాలు చేసిన ఘనుడు, తరుణవయస్సులో ఉన్నవాడు, పైగా ధనవంతుడు. అతనికి పుష్కలంగా పండే మాన్యక్షేత్రాలున్నాయి. ఏ రాజుగారైనా అన్ని విధాలా దానం ఇవ్వడానికి ఇతడే అర్హుడు అని ఎంచి ఏదైనా దానం ఇవ్వబోతే, దానం స్వీకరించడం కూడా పాపం అని భావించి పరిగ్రహించేవాడు కాడు. దానం పుచ్చుకుంటే దానికో ప్రాయశ్చిత్తం చేసుకోవాలంది శాస్త్రం. ఒక్క సాలగ్రామదానస్వీకరణకే ఏ పాపం అంటుకోదట. అయితే ప్రవరాఖ్యుడు దాన్ని కూడా స్వీకరించేవాడు కాడు. పరుల ధనాదులను కాని, పరకాంతలను కానీ కలలో కూడ ఆశించనటువంటి పరమపవిత్రుడు ప్రవరాఖ్యుడు.

ప్రవరుడికి అతిథిపూజ అంటే పరమానందం. అంతేకాదు, తీర్థయాత్రలన్నా, తీర్థయాత్రలు చేసివచ్చిన పుణ్యమూర్తులన్నా అతనికి ఎంతో భక్తి. అటువంటివారు వస్తున్నారని తెలిస్తే ఎంతదూరం అయినా వాళ్ళకి ఎదురేగి, పాదాలకి నమస్కరించి ఇంటికి ఆహ్వానించేవాడు. భక్తితో ఆతిథ్యమిచ్చి, వాళ్ళకి ఇష్టమైన భోజనపదార్థాలని వండించి, వడ్డించి, సంతృప్తులుగా చేసేవాడు. వాళ్ళు భుజించి కూర్చున్నాక వారు వెళ్ళి చూసి వచ్చిన ప్రదేశాల గురించి, తీర్థక్షేత్రాలు గురించి వివరంగా అడిగి తెలుసుకొనేవాడు. ఆ యా ప్రదేశానికి తాను వెళ్ళలేకపోతున్నానే అని చింతిస్తూ, నిట్టూర్పులు విడుస్తూ ఉండేవాడు. తానూ వెళ్ళాలని ఉబలాటపడేవాడు.

కానీ నిత్యాగ్నిహోత్రి, పితృసేవాతత్పరుడు అయిన ప్రవరుడు తన నిత్యకృత్యాలయిన అనుష్ఠానాలకు ఏ రోజూ భంగం కలగటానికి

ఇష్టపడేవాడు కాదు. అందువలన అరుణాస్పదపురాన్ని విడిచి ఎక్కడికీ వెళ్లేవాడు కాదు.

ఒకనాడు ప్రవరుని ఇంటికి ఒక సిద్ధుడు వచ్చాడు. యథావిధిగా ప్రవరుడు అతనికి అర్ఘ్యపాద్యాలిచ్చి, సకలోపచారాలు చేశాడు. మంచి భోజనం పెట్టి, అతను విశ్రాంతి తీసికొన్న తరవాత చెంతచేరి "మహాత్మా! మీరు ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతూ ఇలా నా ఇల్లు పావనం చేశారు? మీరు ఏయే దేశాలు తిరిగారు? ఏ యే పర్వతాలను చూశారు? ఏయే పవిత్ర తీర్థాలలో మునిగారు? ఏ యే ద్వీపాలు, ఏ యే పుణ్యస్థలాలు, ఏ ఏ ప్రదేశాలు సందర్శించారు?" అని ఉత్సాహంగా అడిగాడు.

అందుకు ఆ సిద్ధుడు "నేను మెట్టని గుట్ట, సేవించని తీర్థం, క్షేత్రం, చూడని ప్రదేశం లేవు" అంటూ తాను ఆసేతుహిమాచలం ఏయే వింతలు, విడ్డూరాలు చూశాడో చెప్పుకొచ్చాడు. అదంతా విని ప్రవరుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. ఆ పైన కొంచెం అనుమానమూ కలిగింది "స్వామీ, మీరు వర్ణించినవన్నీ సందర్శించి రావాలంటే ఏళ్ళూ పూళ్ళూ పడుతుంది కదా, మీరు చూస్తే అంత వయసు ఉన్నవారిలా కనపడ్డం లేదు, అదెలా సాధ్యమయింది?" అని ప్రశ్నించాడు.

దానికి ఆ సిద్ధుడు నవ్వి "నువ్వన్నది నిజమే, నడకే ఆధారం గలవారికి ఇది పొసగనిదే, కాని నా వద్ద ఈశ్వరకృపవల్ల ఒక పాదలేపనం ఉంది. ఆ పసరు ప్రభావంతో ఎంత దూరమైనా లిప్తమాత్రంలో పోగలను. ఆకాశంలో సూర్యుడి రథాలు ఎంత వేగంగా ప్రయాణించగలవో భూమి మీద నేను అంత దూరమూ, అంతే వేగంగా అలసట లేకుండా ప్రయాణించగలను" అని చెప్పాడు.

ప్రవరుడికి ఎంతోకాలంగా తీరకుండా ఉండిపోయిన తన తీర్థయాత్రాసందర్శనాభిలాష తీరే మార్గం దొరికింది. ఇలా వెళ్ళి, అలా

వచ్చేయగలిగితే తన నిత్యకర్మలకు, అనుష్ఠానాలకు, తల్లిదండ్రుల సేవకు ఏమీ అంతరాయం కలుగదు కదా మరి! అతను వెంటనే ఆ సిద్ధుడికి భక్తిశ్రద్ధలతో అంజలి ఘటించి, తన చిరకాల వాంఛ తీర్చమని ప్రార్థించాడు. సిద్ధుడు ప్రసన్నుడై, తన బుట్టలోంచి పసరు తీసి, దాని పేరు ఇదీ అని చెప్పకుండా, ప్రవరుడి పాదాలకి దాన్ని పూసి తన దారిన తాను చక్కాబోయాడు. ఆ పసరు పూసి అతడలా వెళ్ళగానే ప్రవరుడు తన మనసులో 'హిమవత్పర్వతాన్ని చూడాలి' అని సంకల్పించాడు. మరుక్షణంలోనే అతడు హిమగిరిశిఖరం మీదికి పోయి నిలిచాడు.

కన్నుల పండువలాగా సొగసులొలికే హిమగిరిపై ప్రవరుడు అనేక రమ్యమైన ప్రదేశాల్ని చూశాడు. ఎన్నో పవిత్రమైన స్థలాల్ని చూశాడు. నరనారాయణులు తపస్సు చేసిన బదరీవనాన్ని సందర్శించి పులకించిపోయాడు. భగీరథుడు తపస్సు చేసిన చోటు, ఆకాశగంగ భూమికి దిగిన చోటు, వివాహానికి పూర్వం పార్వతీదేవి పరమేశ్వరునికి శుశ్రూష చేసిన ప్రదేశం, మన్మథుడు శివుని మూడవ కంటిమంటచే దగ్ధమైన ప్రదేశం, అగ్నిదేవుడు సప్తర్షుల భార్యలపై మోహం చెందిన వనం, కుమారస్వామి జననం చెందిన ఱెల్లుదుబ్బులు మొదలైన ఎన్నో దివ్యమైన, మనోహరమైన ప్రదేశాలను, సుందరమైన లోయలను, గుహలను, సెలయేళ్ళను చూసి పరవశించిపోయాడు. హిమాలయపర్వత ప్రకృతి సౌందర్యం ప్రవరుణ్ణి ముగ్ధుణ్ణి చేసింది.

ఆ అందాలకి ఎంత ముగ్ధుడైపోయినా, పరమ నిష్ఠాగరిష్ఠుడైన ప్రవరుడు – నిత్యం అనుష్ఠించే కర్మకలాపాలకి వేళ దాటిపోతోంది అని గ్రహించాడు. ఈ చోద్యాలను రేపు మళ్ళీ వచ్చి ఆస్వాదిస్తాను అనుకొని 'ఇంటికి చేరాలి' అని సంకల్పించాడు. కానీ ప్రయోజనం కలగలేదు. తీరా చూస్తూ ఏముంది? పాదాలకి పూసుకున్న పసరు కాస్తా మంచు వలన కరిగిపోయింది! ప్రవరుడి గుండెలో రాయిపడినట్టయింది. 'అయ్యో!

ఇక ఇక్కడి నుండి నాకు విముక్తి లేదు. నా జీవితం ఇక్కడే క్షుద్రమార్గంలో అంతమైపోతుంది కాబోలు! ఆ పసరు ప్రభావాన్ని పరీక్షించడానికి, నేను ఏ కాశీయో, గయో, కురుక్షేత్రమో, ప్రయాగో వెళ్ళకుండా, నరమానవులెవరూ అగుపించని, క్రూరమృగాలు విశేషంగా సంచరించే ఈ మంచుకొండకే ఎందుకొచ్చాను? ఓ దైవమా, నా నిత్యానుష్ఠానాలకు దూరం చేసి, తీసుకొచ్చి ఇలా మిన్నులుపడ్డ చోటున, అంటే ఆకాశం భూమిని తాకేలాగా ఉన్న దూరప్రాంతంలో పడేశావు కదయ్యా!" అని పరిపరి విధాల చింతించాడు.

కొంచెంసేపటికి తేరుకొని 'ఈ హిమగిరి మునీంద్రులకు నిలయం. నన్ను ఇల్లు చేర్చగల మహాత్ముడు ఒక్కడైనా ఇక్కడ కనిపించకపోడు' అని ధైర్యం తెచ్చుకొని ముందుకు సాగాడు. అలా వెళుతూ ఉండగా, అతనికి ఒక గానం వినిపించింది. వెంటనే అతని హృదయంలో ఆశాజ్యోతి వెలిగినట్లయింది. 'అక్కడేదో ముని ఆశ్రమం ఉన్నట్లుంది, ఇక నేను రక్షింపబడతాను' అనుకుంటూ ఆ పాట వినవచ్చిన దిక్కుగా త్వర త్వరగా వెళ్ళాడు. అక్కడ ఒక గరుడపచ్చల మేడ, దివ్యమైన ఉద్యానవనం కనిపించాయి. అక్కడ ఒక తిన్నెమీద కూర్చుని, మధురంగా పాడుతూ, వీణ వాయిస్తూ ఉన్న ఒక అద్భుత సౌందర్యవతి అయిన దేవతాస్త్రీ అతనికి కనిపించింది.

ప్రవరుడు ఆమెను సమీపించి "ఓ సుందరీ, తోడు లేకుండా ఒంటరిగా చరిస్తున్న నీవు ఎవతెవు? నన్ను ప్రవరుడంటారు. దారి తప్పి ఉన్నాను. నా ఊరు చేరే మార్గం చెప్పి పుణ్యం కట్టుకో, నీకు శుభమౌతుంది" అన్నాడు. ఆమె ఒక గంధర్వాంగన... పేరు వరూధిని. అతడు తనని సమీపిస్తూండగానే చూసి అతని అద్భుతమైన రూపలావణ్య తేజోవిలాసాలకి ముగ్ధురాలైపోయింది. తొట్రుపాటుతో లేచి సమీపంలో ఉన్న ఒక పోకచెట్టును ఆనుకొని నిల్చింది. ఆ అప్సరస మొదటి

చూపులోనే ఆ సుందరాంగుని ప్రేమించింది. ఆ గంధర్వాంగనకు ప్రవరుడి అమాయక పలుకులు విని నవ్వు వచ్చింది. అతనితో ఇలా అంది. ''చెంపకి చారడేసి కన్నులు పెట్టుకొని, ఎవరినయ్యా దారి అడుగుతున్నావు? ఒంటరిగా ఉన్న జవరాళ్ళని పలకరించే నీ నేర్పరితనం కాకపోతే! నువ్వు వచ్చిన త్రోవ ఇంతలోనే మర్చిపోయావా? ఇంక మాటలేమిటికి?"

"నా పేరు వరూధిని. గంధర్వకాంతను. రంభ, తిలోత్తమ, ఘృతాచి, హరిణి, హేమ మొదలైన అప్సరశిరోమణులు నాకు ప్రాణసఖులు. ఓ అపరమన్మథాకారా! నీ మేను ఎండతాపానికి ఎంత కందిపోయిందో చూడు! ముద్దులొలికే నీ మోము వాడిపోయింది. నా అతిథ్యాన్ని స్వీకరించి, నా ఇంట విశ్రమించి, బడలిక తీరిన తరువాత వెళుదువుగానిలే తొందరేమీ లేదు" అంది.

ప్రవరుడి హృదయదర్పణం నిర్మలమైంది. నిరుపమానమైనది. అది ఉన్న రూపాన్ని ఉన్నట్టే గ్రహిస్తుంది. అంతరార్థాలు, గూఢార్థాలు తోచవు దానికి. 'ఈ పడుచు పాపం మర్యాద తెలిసినది. బ్రాహ్మణులయందు అతిథులయందు భక్తిశ్రద్ధలుగల ఆస్తికురాలు' అనుకున్నాడు. వరూధిని తనని చూడగానే తత్తరపాటుతో లేవడం, ఆమె ఒళ్ళంతా కంపించటం, ఓరచూపులూ, మోహాన్ని ప్రకటించే హావభావచేష్టలు అవేమీ అతనికి పట్టలేదు. అవన్నీ పరపురుషుల్ని చూసినప్పుడు స్త్రీలకు కలిగే సహజసిద్ధమైన లజ్జాచేష్టలనుకున్నాడు.

అతను ఆమెతో "రమణీలలామా! నువ్వు చూపించిన ఆదరణే చాలు. అగ్నిహోత్రాదికములైన కర్మకాండ నెరవేర్చవలసిన సమయం సమీపించింది. వేళ అతిక్రమించిపోతోంది. మీ గంధర్వులకి అసాధ్యమైనది ఏదీ లేదు. త్వరగా నన్ను నా ఊరు చేర్చు" అన్నాడు.

వరూధిని చిఱునవ్వు నవ్వి "ఓయి వెఱ్ఱిబ్రాహ్మడా! ఊరో, ఊరో అంటావు, నీ ఊరెక్కడికి పోతుంది? ఇంతలో నీ ఇల్లెక్కడికి పోతుంది? ఈ మణిమయాలైన గుహలు, ఈ ఉద్యానవనాల్లోని మంచి గంధపుచెట్లు, ఇక్కడి గంగానది ఒడ్డున ఉన్న ఇసుకతిన్నెలు, వెన్నెలతీగల పొదరిళ్ళు, ఇవేవీ నీకుటీరానికి సరితూగవా ఏమిటి? అయినా, ఇంక చల్లకి వచ్చి ముంత దాచటమెందుకు? నీ మీద నాకు పట్టరానంత మోహం కలిగింది. మదనుడు నన్ను నీకు కన్యాదానం చేశాడు. నన్నేలుకొని ఈ స్వర్గసుఖాలన్నిటినీ అనుభవించు" అని కుండబద్దలు కొట్టినట్టి చెప్పేసింది.

అగ్నిహోత్రుడిలాగ పవిత్రమైనవాడు, పరమనిష్ఠాగరిష్ఠుడు, సచ్ఛీలుడు అయిన ప్రవరుడు, ఆమె పలుకులు విని నిశ్చేష్టుడైపోయాడు. అతని గుండె గుభిల్లుమంది. 'అయ్యో! ఇదెక్కడి కర్మరా!' అనుకొని, ఆమెతో "కాంతా! నీవు వెఱ్ఱిదానివి. కర్మకాండలతో దినాలను గడిపే నన్ను ఏమని కామించావు? సంగతి సందర్భాలు, ఎదుటివారి మానమర్యాదలూ అవీ గమనించనక్కఱలేదా? నాకిలాటివేవి తెలియవు. అగ్నిహోత్రానికీ, దేవతార్చనకీ వేళ అతిక్రమించిపోతోంది. నా తల్లిదండ్రులు వృద్ధులు. ఆకలితో నకనకలాడుతూ నా రాకకోసం ఎదురుచూస్తూ ఉంటారు. నేను సమయానికి ఇల్లు చేరకపోతే సమస్తధర్మాలూ చెడిపోతాయి. నీ పిచ్చికలాపాలు కట్టిపెట్టి, చేతనైతే ఇల్లు చేరడానికి నాకు సాయం చెయ్యి" అని తన దృఢనిశ్చయాన్ని తెలియజేశాడు. దాంతో ఆమె ప్రవరుడికి ఎన్నో ప్రలోభాలు చూపించి అతన్ని వశపరచుకోవాలని ప్రయత్నించింది.

"మీ మానవులు అన్ని ఆపసోపాలు పడి తపస్సులు, యజ్ఞాలు అవీ చేసేది పరలోకంలో స్వర్గసుఖాలను, మాలాటి అప్సరసల సాంగత్యాన్ని అనుభవించడానికే గదా! అయాచితంగా నా అంతట నేను నీకు లభిస్తూ ఉంటే కాదంటావేమిటి? గంధర్వాంగనల పొందు కాదని వెలుగుకు

భయపడి గొందిలో దాక్కునే గుడ్లగూబలాగ సంసారకూపంలో పడతానంటావేమిటి? "నీ యందు మరులుగొని, మన్మథబారినిపడి హింసపడుతున్నాను. ఆ పాపం నీకు చుట్టుకుంటుంది'' అని బెదిరించింది.

"ఓ దయారహితుడవైన బ్రాహ్మణుడా, ఎందుకు చెడతావు? హృదయం దేనిమీద లగ్నం ఔతుందో, ఇంద్రియాలు దేనివల్ల సుఖిస్తాయో, అదే పరబ్రహ్మం. అదే ఆనందో బ్రహ్మ. దాన్ని ఊహించుకో!" అని మెట్టవేదాంతం వల్లించింది.

వరూధిని శతవిధాలా ప్రయత్నించినా, ప్రవరుడు చలించలేదు. బ్రహ్మవాదులకు ఐహిక సుఖాలపట్ల ఉండవలసిన వైముఖ్యాన్ని, వైదికకర్మల యొక్క ధర్మపరత్వాన్ని, బ్రహ్మవర్చసప్రభావాన్నీ వివరించాడు. "వాటిముందు నువ్వు చెప్పిన సుఖాలన్నీ తుచ్ఛమైనవి" అన్నాడు. "నాకు నా అరణులు, అగ్నులూ, ధర్మకర్మలూ మాత్రమే ముఖ్యమైనవి" అన్నాడు. "ఇలా ధర్మం తప్పి చరించటానికి నా మనస్సు సుతరామూ అంగీకరించదు" అని స్పష్టంగా చెప్పాడు.

అయినాసరే వరూధిని వదలకుండా అతనిమీద పడి కౌగిలించుకోవాలని ప్రయత్నించింది. ప్రవరుడు "హరి, హరీ" అని 'పో' అంటూ ఆమెను త్రోసివేసాడు. ఆమె మితిమీరిన దుఃఖంతో "దయలేనివాడా, ఇలా మోటుగా గెంటేస్తే సౌకుమార్యులైన ఇంతులు తట్టుకోగలరా? చూడు నీ గోరు ఇక్కడ ఎలా గీసుకుపోయిందో'' అంటూ చనుకట్టు చూపి, అవ్యక్తమధురంగా ఏడ్చింది.

పరమపవిత్రుడైన ప్రవరుడు ఆ మాటలకి బదులైనా ఇవ్వకుండా, ఆమె తన పై బడినప్పుడు తన శరీరానికి అంటుకున్న జవ్వాది మొదలైన సుగంధద్రవ్యాల్ని ఆ ప్రక్కనే ఉన్న కోనేటి నీటితో కడుక్కొని, శుచియై,

అగ్నిహోత్రుణ్ణి "ఓ హవ్యవాహనా! వహ్నిదేవుడా! నేనే కనుక దాన - జప అగ్నిహోత్రములు యందు పరతంత్రుడనైతే, ఎల్లప్పుడూ త్రికరణ శుద్ధిగా నీ యొక్క పాదపద్మముల ధ్యానమందే భక్తిగలవాడనైతే, ఇతరుల యొక్క భార్య ధనాదులను నేను ఎన్నడూ కోరనివాడనైతే, నన్ను సగౌరవంగా, సూర్యుడు పశ్చిమాద్రిని క్రుంకకముందు ఇంటికి చేర్చు, తండ్రీ!" అని ప్రార్థించాడు.

ప్రవరుడలా ప్రార్థించగానే, అగ్నిదేవుడతని దేహంలో ఆవహించి, అతనికి అమితమైన తేజోబలాలను కలిగించాడు. అంతట అద్భుతంగా ప్రవరుడు వాయువేగ మనోవేగాలతో తన ఇల్లు చేరి, తన నిత్యకర్మలని సక్రమంగా నిర్వర్తించుకుంటూ జీవనం సాగించాడు.

ఇది అల్లసాని పెద్దన మనుచరిత్రలో చెప్పిన ప్రవరుడి కథ. ఈ కథలోని అంతరార్థాన్ని ఆధ్యాత్మికతత్వాన్ని గ్రహించాలంటే, దీన్ని ఈ నాటి యుగావసరాలకు సరితూగేలా అన్వయించుకోవాలి. ఆధునిక దృక్పథంతో పరికించాలి విశ్లేషించాలి. అప్పటికి గాని ప్రవరుడి ప్రవర్తనలోని పరిణతచిత్తాన్ని గుర్తించలేం.

ఈ ఆధునిక యుగంలో ఉన్నస్థితి నుంచి ఉన్నతస్థితికి చేరుకోవడానికి కొందరు కళల్ని ఆశ్రయిస్తారు. ఉంటున్నస్థితి నుంచి ఉందామనుకున్నస్థితిని అందుకోవడానికి కొందరికి సాహిత్యసృజన సహాయపడుతుంది. అంతర్యామిని కనుగొనడానికి చాలామంది ఆధ్యాత్మికవిద్యను అధ్యయనం చేస్తారు. కళలు, సాహిత్యసృష్టి, ఆధ్యాత్మిక సాధన ఈ మూడింటా తపస్సో, ఉపాసనో ఉంటాయి. వాటిలో లీనమైన ప్రతీసారీ మనిషి తననుంచి తాను విముక్తుడవుతాడు. కనుక, అవన్నీ ఆత్మోన్నతికి దారిచూపే మార్గాలే! ఎవరి అభిరుచుల్ని బట్టి వారు తమ మార్గాలను ఎంచుకుంటారు. మార్గాలేవైనా లక్ష్యం మాత్రం పోతన చెప్పిన

"శ్రీకైవల్యపదంబు" చేరడమే! లేదా, దానికి సరితూగే ఆనందాన్ని అందుకోవడమే! అసలంటూ అలాంటి ఆనందం ఒకటి ఉందన్న 'ఎరుక' గలవాళ్ళు లోకంలో చాలామందే ఉంటారు. ఆ తపనను 'జీవుడి వేదన' గాను, ఆ ఎరుకను 'అచ్చ తెలివి'గాను కవి సమ్రాట్ విశ్వనాథ విశ్లేషించారు. ఆ రెండూ మనిషిని కాలు నిలువకుండా చేస్తాయి. ఉగ్రూతలూగిస్తాయి. అటువంటి కళారసజ్ఞులకు, సాహిత్య ఉపాసకులకు, ఆధ్యాత్మిక సాధకులకు ముందుగా మనసనేది విచ్చుకోవాలి. ఆ యా రంగాల్లో రససిద్ధులైనవారు ఏ యే దారుల్లో నడిచారో, వాటిని వెతికి పట్టుకోగల సంసిద్ధత కావాలి. ఆ ఆసక్తినే 'సహృదయాభిసరణం' అంటారు. ఆ మార్గాన్ని కనుగొని ప్రయాణం కొనసాగిస్తుంటే – ఏదో ఒక మలుపులోనో, కూడలిలోనో ఆ రససిద్ధుల ఆత్మతత్త్వంతో మన చైతన్యానికి అనుసంధానభాగ్యం కలిగి తీరుతుంది. ఒకానొక పరమాద్భుత అద్వైతస్థితి ఏర్పడుతుంది. అది అపురూపమైన అనుభూతి. అక్కడి నుంచి ప్రయాణం జంటగా సాగుతుంది. సృజనపటిమతో ఆయన, సహవాసభాగ్యంతో ఈయనా కలిసి ఒకే గమ్యంకేసి పయనం సాగిస్తారు. ప్రవరుడి పాత్ర ద్వారా పెద్దన మనకు ఆ దిశగా మార్గ నిర్దేశనం చేశాడు.

సత్యంవైపు కలిసి చేసే ఆ ప్రయాణాన్నే "సధ్రీచీనం" అంటారు. కాంతిమంతమైన ఆ ప్రయాణం సత్యదర్శనంతో ముగుస్తుంది. బ్రహ్మానందస్థితి కలుగుతుంది. అందులో లీనమయ్యాక – ఇక మౌనమే తప్ప చెప్పేందుకు, వినేందుకూ ఏమీ ఉండదు. 'నేను' అనేది లేని పరమాద్భుతస్థితి అది. ఆ కేవలస్థితినే 'కైవల్యం' అంటారు.

భారతీయ ప్రాచీన కళారూపాలను, సారస్వతాన్ని ఆధ్యాత్మికతత్త్వాన్ని అధ్యయనం చేసేవారందరికి విశ్వనాథ చెప్పిన 'అచ్చతెలివి' అలవడాలి. ఆ యా సృజనాత్మక ప్రక్రియలపట్ల శ్రద్ధాసక్తులు, తపన గౌరవం ఎంతో

అవసరం. సత్యదర్శనానికి ఆపాటి శ్రమ తప్పనిసరి. ఈ సూత్రం తెలియకుండా కేవల 'ఉపరిశోధన'తో నిజమైన తత్త్వం బోధపడదు.

అల్లసాని పెద్దన "మనుచరిత్ర"ను ఆ మూలసూత్రపు దీపం వెలుగులో పరికిస్తే తప్ప ప్రవరుడెవరు, మాయా ప్రవరుడెవరు అనే ప్రశ్నకు సమాధానం దొరకదు. అది వరూధినిప్రవరాఖ్యుల కథ మాత్రమే అనిపిస్తుంది. అసలు సత్యం ఏమంటే ప్రవరుడు, మాయాప్రవరుడు ఇద్దరు కారు, ఒక్కరే! నిజం! అది కూడా ఎవరో కాదు, మనమే! పదిమందిలో ప్రసంగాలు చేస్తున్నప్పుడు, పవిత్ర క్షేత్రాల్లో ఉన్నప్పుడు మనలో అందరూ ప్రవరాఖ్యులే! అవకాశం దక్కినప్పుడు, వరూధిని చేజిక్కినప్పుడు – మనలో ఎందరు 'మాయాప్రవరులు కాకుండా నిలదొక్కుకుంటారన్నది చాలా పెద్ద ప్రశ్న. ప్రతి మనిషిలోనూ ఆ రెండు విభిన్న స్వభావాలూ, వాటి మధ్య ఘర్షణ సాగుతోనే ఉంటుంది.

ఈ కథ చెప్పిన అల్లసాని పెద్దనా మనలాంటి మనిషే. ఆ మాటకొస్తే అసలు ప్రవరుడు అల్లసాని పెద్దనే. ప్రవరుడి దైవీకగుణాలను తనలో పటిష్ఠం చేసుకోవడానికి, మాయా ప్రవరుడి అసురలక్షణాలను అణచివేయడానికి పెద్దన ఈ కథను రాశాడు. సాహిత్యసృజన పేరిట మాయాప్రవరుడి ధృతరాష్ట్రకౌగిలి నుంచి తనను తాను విముక్తం చేసుకునే నిమిత్తం పెద్దన చేసిన బ్రహ్మాండమైన ప్రయత్నమే మనుచరిత్ర!

అలాంటి పరమానందం కోసం ప్రాచీన కావ్యాలను కాని, కళారూపాలను కాని ఈ వెలుగులో పరిశీలన చెయ్యాలనే కుతూహలమే 'జీవుని వేదన'గా పరిణమిస్తుంది. పరమానందం కోసం పరితపిస్తుంది. దాన్ని రుచిచూడాలని ఆశిస్తుంది. దాన్ని చేజిక్కించుకొనే ప్రయత్నంలో సహృదయుడు చేసే ప్రయాణమే సహృదయాభిసరణం. మనుచరిత్ర విషయంలో పెద్దన ఆత్మతత్త్వంలో అనుబంధం ఏర్పడి ఇక అక్కడి నుంచి కలిసి చేసే ఒకానొక కాంతిప్రయాణమే సధ్రీచీనం. అది ఫలించి అద్వైత

ఆనంద అనుభూతిని దక్షించుకోవడమే - రససిద్ధి. ఆ పై దాని పేరు ఇక మనుచరిత్రకాదు - మన చరిత్ర! అందులో ప్రకాశించే ఒకే ఒక్కడు... అచ్చమైన అద్వైత చైతన్యస్థితిలో అలరారే అసలు సిసలు ప్రవరాఖ్యుడు!

మనసులోని ప్రవరుడి అంశను జాగృతం చేసేందుకై అల్లసాని పెద్దన మనకీ కథను అందించాడు. మనుచరిత్రలోని మాయాప్రవరుడి వృత్తాంతం మనకు ఒళ్ళు మరిపిస్తుంది. అసలు ప్రవరుడి ప్రవర్తన కళ్లు తెరిపిస్తుంది.

ఈ కథలో ప్రవరుడు నిత్యాగ్నిహోత్రియై, నీతినియమాలకు కట్టుబడి గృహస్థధర్మనిర్వహణంలో స్థిరంగా ప్రకాశించాడు. తన స్వభావానికి విరుద్ధమైన వరూధిని వంటి నాయిక ఎంతగా ప్రలోభపెట్టినా చలించకుండా ఉన్నాడు. దరిమిలా వరూధిని మాయాప్రవరులు తమను తాము మోసం చేసుకొని తుచ్ఛమైన సుఖభోగాల్లోకి జారిపోయారు. వారి సంతానమైన స్వరోచికీ అదే లాలస అలవడింది. అతడి బహు భార్యాత్వం, శృంగారవిహారం గమనించి చక్రవాకపక్షులు స్వరోచిని చులకనగా చూశాయని పెద్దన స్పష్టం చేశాడు. అంటే ఆనాటి సమాజంలో విలువలు పతనంకావడం పట్ల కవి తన నిరసనను ఇలా ప్రదర్శించాడు. మానవజాతికి మహత్తర సందేశాన్ని అందించాడు. ప్రవరునితో మొదలైనకథ వరూధిని మాయప్రవరుడు స్వరోచి... వృత్తాంతాలను కలుపుకొంటూ తిరిగి ప్రవరుడి వంటి మనువు సంభవించడంతో మనుచరిత్ర స్వారోచిషమనుసంభవంగా పూర్తయింది.

# 7. శ్వేతకేతువు - వివాహవ్యవస్థ

అంపశయ్యపై భీష్ముడు ఆలోచిస్తూ గడిపింది - కబళిస్తున్న మృత్యువు గురించి కాదు, కరుణిస్తున్న దైవం గురించి. ఆ కరుణ కారణంగానే అవసానదశలో ఉన్న భీష్మాచార్యుడి నోట అమోఘమైన ధర్మసూక్ష్మాలు అద్భుతమైన ఆధ్యాత్మిక ఉదంతాలు లోకానికి వెల్లడయ్యాయి.

ధర్మజ - భీష్మసంవాదంలో ప్రస్తావనకు వచ్చిన మహాపురుషుల్లో శ్వేతకేతువు ఒకరు. ఉద్దాలక మహర్షి కుమారుడైన శ్వేతకేతువు వేదార్థ జ్ఞానసంపన్నుడు. గొప్ప సంస్కారవంతుడు. విశ్వానికే ఆదర్శప్రాయంగా విరాజిల్లుతున్న మన వివాహవ్యవస్థను తొలిదశలో గాడిన పెట్టిన మహానుభావుడు. ఒకప్పుడు మానవులది స్వేచ్ఛాశృంగారం. ఆకర్షణీయమైన స్త్రీ కంటపడితే చాలు, ఆమె వివాహిత అయినా, ఆమెతో పొందుకోరే ఆటవికస్థితిలో ఉండేది అప్పటి సమాజం. ఆ వ్యవస్థలో ఉద్దాలక మహర్షి ఇంట ఆతిథ్యాన్ని స్వీకరించిన అతిథి, పోతూ పోతూ ఆ మునిభార్యతో శృంగారం కావాలని అడిగాడు. తన తల్లిని పరాయి వాడొకడు అలా బాహాటంగా కామించడం - శ్వేతకేతువుకు పరమ దుర్భరంగా తోచింది. ఆ తపశ్శాలి ఉగ్రుడైపోయాడు. "ఇది మొదలుగా వివాహితులైన స్త్రీలను, పరపురుషుడు కోరడానికి వీలులేదు. మానవ జాతి మొత్తానికి ఈ కట్టడి విధిస్తున్నాను" అని గర్జించాడు. శ్వేతకేతువు వాక్శుద్ధి కారణంగా కామం విషయంలో క్రమశిక్షణ మొదలైందని భారతం ఆదిపర్వం వివరించింది. దరిమిలా మన వివాహ వ్యవస్థలో ఓ స్పష్టత వచ్చింది. ఒక పురుషుడికి ఒక స్త్రీ... అనే భావం సమాజంలో బలపడింది. భారతీయ వివాహవ్యవస్థకు ఆ భావమే పునాది.

శ్వేతకేతువు భార్య పేరు సువర్చల. దేవల మహర్షి కుమార్తె అయిన సువర్చల సునిశిత జ్ఞానసంపన్నురాలు. సూక్ష్మగ్రాహి. "అమ్మాయీ! నీకు

వివాహం చేయాలనుకొంటున్నాం. ఎలాంటి వరుడు కావాలి నీకు?" అని తండ్రి అడిగితే "మీ ఇష్టం" అని అనలేదామె. ఆయన కళ్లలోకి సూటిగా చూస్తూ "తండ్రీ! నాకు కాబోయే భర్త గుడ్డివాడైనా ఫర్వాలేదు. చూపు ఉన్నవాడైతే చాలు..." అంది. సువర్చల సూక్ష్మబుద్ధి దేవలుణ్ణి ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. 'గుడ్డివాడు అంటున్నావు, చూపు ఉండాలంటున్నావు... ఎలా సాధ్యం తల్లీ" అని అడిగాడు. దానికామె "సాధ్యమే! మీరు గుణవంతులైన పెళ్ళికుమారులను అన్వేషించండి. యోగ్యుడైన వరుణ్ణి నేను ఎంపిక చేస్తాను" అంది. ఎంతోమంది వచ్చివెళ్ళాక శ్వేతకేతువు వచ్చి "నేను నిన్ను వరిస్తున్నాను. నీవు కోరే లక్షణాలన్నీ నాలో ఉన్నాయి" అన్నాడు. "ఈ దేహమే జీవుడని అనుకొనేవారిలో నేనూ ఉన్నాను కాబట్టి నేను గుడ్డివాణ్ణి. చూపు పలుకు వినికిడి... వంటివి ఏవీ ఆ యా అవయవాలకు సొంతం కాదని, వాటికి ఆ శక్తి పరమాత్మ అందిస్తున్నాడని నా జ్ఞాననేత్రంతో గ్రహించాను కనుక చూపు ఉన్నవాణ్ణి" అని ఆమెకు వివరించాడు. సువర్చలకు అర్థమైంది. శ్వేతకేతువు కంటిచూపుతో కాకుండా, జ్ఞానచక్షువుతో లోకాన్ని పరికిస్తున్నాడని గ్రహించింది. ఆమె కోరుకున్నదీ అదే. కాబట్టి శ్వేతకేతువును భర్తగా అంగీకరించింది.

పెళ్ళిచూపుల్లో "భావం" కలగాలని వేదం స్పష్టంగా చెప్పింది 'ఈమె / ఇతడు నా కొరకు..." అని అనిపించాలంది. అది చాలా ముఖ్యం. పై పై చూపులు కాకుండా, లోలోపలి ఆలోచనలు ఒకటిగా ఉండటం అనుకూలదాంపత్యానికి గొప్ప ఆలంబన. సువర్చలప్రశ్నలోని అంతరార్థాన్ని గ్రహించి, తన సమాధానంతో ఆమెను మెప్పించి, శ్వేతకేతువు సువర్చలను వివాహం చేసుకొన్నాడని – భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు. ఇది కథకాదు... అనుకూలదాంపత్యజీవనవిధానానికి దారి చూపించే దీపస్తంభం, దిక్సూచి.

ఈ తరహా పటిష్ఠమైన పునాదులపై నిలబడిన భారతీయ వివాహవ్యవస్థ ప్రపంచాన్ని ఆకర్షించింది. ఆదర్శంగా నిలిచింది. "నాతిచరామి" మంత్రంలోని ధార్మికనేపథ్యం, కట్టుబాటు పాశ్చాత్యులను అబ్బురపరిచింది. భారతీయ ప్రాచీన ఆర్షవాఙ్మయం ఆ భావనను బలంగా సమర్థించింది. "ప్రాయేణేవంవిధే కార్యే పురంధ్రీణాం ప్రగల్భతా" అన్నాడు కాళిదాసు మహాకవి. పైగా ఆమాట శివుడి నోట పలికించాడు. "వివాహ సంబంధిత కార్యక్రమాలలో స్త్రీలు కడునేర్పరులు" అని దాని అర్థం. భారతీయ కుటుంబవ్యవస్థలో, గృహస్థధర్మనిర్వహణంలో, దాంపత్యసౌభాగ్యంలో స్త్రీల పాత్రకు మన సారస్వతం అద్భుతమైన నీరాజనాలు పలికింది. పల్లకీ పట్టింది. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః - ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు స్థిరనివాసం ఉంటారు" అన్నాడు మనువు. మనుస్మృతి మన దేశానికి చేసిన ఆదేశమే విశ్వానికి సందేశమై గౌరవానికి నోచుకుంది. సంసారమంటే గృహస్థధర్మనిర్వహణయనే మన జాతి విశ్వసించింది. వివాహక్రతువులోని మంత్రాల ద్వారా వివాహవ్యవస్థలోని పవిత్రతను విశదీకరించింది. ప్రతి యజ్ఞకార్యంలోను, యాగవిధిలోను భార్యకు సముచిత స్థానాన్ని నిర్దేశించి, భారతీయతను ప్రతిబింబించింది.

ఎన్నో తెలుగు కావ్యాలు సైతం ఇదే సందేశాన్ని ప్రబోధించాయి. శృంగారనైషధం, మనుచరిత్ర, పాండురంగమహాత్మ్యం, కళాపూర్ణోదయం, ప్రభావతీప్రద్యుమ్నం, ఆముక్తమాల్యద, పారిజాతాపహరణం, వసుచరిత్ర శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యం... అనే తొమ్మిది తెలుగుకవిత్వానికి ఒజ్జబంతుల్లాంటి కావ్యాలు. "తెలుగులో పంచకావ్యాలు ఏవి?" అని ఎవరిని అడిగినా... వీటినుండే ఓ అయిదింటి పేర్లు చెబుతారు.

ఆశ్చర్యకరమైన విషయం, స్ఫుటమైన అంశం ఏమంటే వీటిలో అధికభాగం - వివాహం, కుటుంబవ్యవస్థ అనే రెండు అంశాలపై

ప్రధానంగా పరిభ్రమిస్తూ వచ్చాయి. మహాభారతం శ్వేతకేతువు కథ ద్వారా ఈ జాతికి అందించిన దారిదీపం వెలుగులో దాంపత్యజీవనంలోని ధార్మికనేపథ్యానికి దోహదం చేస్తూ వచ్చాయి. ఆ నేపథ్యాన్ని, సందేశాన్ని బాగా అర్థం చేసుకోవాలంటే 'దాంపత్యం' అనే అంశం గురించి మనం క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలి.

"BY FAR THE MOST STABLE SYSTEM IN THE WORLD IS - THE HINDU TYPE OF PARENT ARRANGED MARRIAGE" - OSWAULD SCHWARTZ OF GERMANY.

భారతీయదాంపత్యవ్యవస్థ గురించి పాశ్చాత్యసమాజం ఏమని భావిస్తోందో చెప్పడానికి ఈ పై మాటలు అర్థం చేసుకోవాలి. మనదేశంలోని తల్లిదండ్రులు ఎన్నోరకాలుగా ఆలోచించి కుదిర్చే విధానం వల్ల - వివాహానికి గాఢమైన స్థిరత్వం చేకూరుతోందని దాని తాత్పర్యం. ఆ నేపథ్యాన్ని బాగా గ్రహించాలంటే, 'దాంపత్యం' అనే అంశం గురించి, సప్తపది గురించి మనం తెలుసుకోవాలి.

భారతీయసంస్కృతిలో వివాహమనేది ఒకానొక గొప్ప సంస్కార విశేషం. అగ్నిసాక్షిగా బలపడే ఏడడుగుల బంధం. అద్భుతం అనేమాటను ఒకే అక్షరంలో చెబితే - అది స్త్రీ! ఆ అద్భుతాన్ని పురుషుడికి సొంతం చేసే రెండక్షరాల ప్రక్రియ పేరు పెళ్ళి! మూడుముళ్ళతో మొదలయ్యే నూరేళ్ళబంధాన్ని మూడు అక్షరాలలో పలికితే - అది దాంపత్యం! దాంపత్యజీవనంలో స్త్రీ అనే వీణను అమోఘంగా శ్రుతి చేయగల గొప్ప విద్వాంసుడి నాలుగు అక్షరాల పేరు - పురుషుడు! అలా వారిద్దరి మధ్య ఏర్పడే ఆత్మీయబంధానికి అయిదక్షరాల మాట - భార్యాభర్తలు! ఆడ, మగ - ఆలుమగలయ్యే కార్యక్రమానికి ప్రామాణికతను ఆపాదించే ఆరు అక్షరాల తంతు పేరు - "వైదికప్రక్రియ". వేదప్రమాణాన్ని అంగీకరించి, భార్యాభర్తలు తమ తలకెత్తుకునే ఏడు అక్షరాల గొప్ప

బాధ్యత - గృహస్థాశ్రమధర్మం! ఇదే సప్తపది! ఏడు అంచెల జీవన మాంగల్యమహాసూత్రం! దాంపత్యమహామంత్రం!

ఏడు అడుగులతో పురుషుడి జీవితంలోకి ప్రవేశించే స్త్రీ - అప్పటి దాకా తనవెంట వచ్చిన ఇంటి పేరును, గోత్రాన్ని, ప్రాణమిత్రుల్ని, అన్నదమ్ముల్ని, ఆఖరికి తన తల్లిదండ్రులను, వారి గారాబాన్ని అన్నీ విడిచి పెట్టి, మరీ వస్తుంది. ఇక పై తన భర్తనుండి - తాను వదులుకున్నవన్నీ పొందగలనన్న నమ్మకంతో వస్తుంది. అందుకే పెళ్ళిచూపులలో 'భావం' కలగాలని వేదం అంటుంది. 'ఈమె నాకోసం పుట్టింది' అనే భావం పురుషుడికి కలగాలి. "ఇతడు నా కొరకై ఉన్నాడు" అనే భరోసా స్త్రీకి కలగాలి. సప్తపదిమంత్రాలతో పురుషుడి నోట పలికించే వాగ్దానం అదే! "ఏడడుగులు నాతో నడిచి మిత్రురాలివికా! ఒకరికొకరం చక్కని స్నేహితులమై జీవితపర్యంతం కలిసి నడుద్దాం"- అని పురుషుడు పలుకుతాడు. నిజానికి సుముహూర్తం అంటే - బెల్లం, జీలకర్ర తంతుకాదు. తొలిచూపులో పురుషుడి కంటి నుండి స్త్రీకి సర్వభద్రంకరమైన ఆ భరోసా ప్రసారమయ్యే క్షణాన్నే శుభముహూర్తం అనాలి. తెర తొలగించాక జరిగే ఈ తంతునే "చక్షుసంయోగం" అంటారు. అది చూపుల కలయిక. ఆ సమయంలో మంచి మనసుతో చేసిన ఆ వాగ్దానాన్ని పురుషుడు జీవితాంతం నిలబెట్టుకోవాలి. భర్త సమక్షంలో ఉండే సమయంలో స్త్రీకి తండ్రి గుర్తొచ్చినా - బెంగ కలగకూడదు. తన తల్లి దగ్గర లేదన్నలోటు తెలియకూడదు. తోబుట్టువులు, స్నేహితులు... ఎవరి గురించీ దిగులు పుట్టకూడదు. వారి నుండి గతంలో ఆమె ఎన్నెన్ని రకాల అప్యాయతలను పొందిందో - అన్ని రకాలనూ ఆమె భర్తనుండి అందుకోగల్గాలి. పురుషుడు స్త్రీకి అన్నిరకాల చుట్టం అవ్వాలి. ఆ అన్ని కోణాల్లోంచి బంధువు అవ్వాలి.

స్పర్శతో, మాటలో, చేతలో, చూపులో... అంతెందుకు 'తన' పురుషుడి స్మరణ మాత్రం చేత స్త్రీ మనసు రాగరంజితం, రసస్ఫోరకం

కావాలి. పురుషుడు స్త్రీకి సఖుడవ్వాలంది వేదం. సఖ్యం అనే మాట పెళ్ళిమంత్రాలలో విశేషంగా ధ్వనిస్తుంది. పైన చెప్పిన ప్రతిచేష్టలోనూ స్త్రీకి 'సఖ్యం' అనేది అనుభవంలోకి రావాలి. అతని లాలనలో ఆమె అనుక్షణం పరవశం చెందుతూ ఉండాలి. ఆమె గుండెల్లో అది ఒకానొక ఆకుపచ్చని పులకరింతగా స్థిరపడి, అతడు ఎక్కడున్నా చెంతనే తనకు తోడుగా ఉన్నాడన్న భావం కలిగిస్తూ – అనుభూతిపరిమళాన్ని పంచుతూ ఉండాలి. దీన్నే 'సర్వేంద్రియసంతర్పణం' అంటారు. స్త్రీలోని ప్రతి అణువునూ ఉత్తేజపరుస్తుందది. అటువంటి పురుషుడికి స్త్రీ తన సర్వస్వాన్నీ ఇష్టంగా ధారపోస్తుంది. ఆమె అలా చేయాలంటే – పురుషుడు రసజ్ఞ మనోజ్ఞ ప్రతిభామూర్తి (రొమాంటిక్ పర్సనాలిటీ) అయి ఉండాలి. "ఈ సృష్టిలో కృష్ణుడొక్కడే పురుషుడు" అని మీరాబాయి అనడంలో అంతరార్థం అదే! భార్య పస్తులుంటే భర్తకు అన్నం సహించని స్థితి కలగాలి. ఆమెకు కష్టమొస్తే తనకు నొప్పి తెలియాలి. ఇంటి దగ్గర ఆమె ఒంటరిగా ఉందని ఏదో తెలియని దిగులు లాంటిది మనసుకు తోచాలి. త్వరగా ఇల్లు చేరాలన్న ఆరాటం కలగాలి. తహతహ పుట్టాలి.

ఇవన్నీ మళ్ళీ స్త్రీకీ వర్తిస్తాయి. దాంపత్యబంధంలోని చమత్కారం అదే! స్త్రీకి గౌరవవాచకం ఇల్లాలు... ఇల్లాలికి గౌరవవాచకం తల్లి! ఆ రెండు హోదాలనూ స్త్రీకి కట్టబెట్టేది వివాహబంధమే! స్త్రీ జీవితంలో సర్వశ్రేష్ఠమైన ఆనందం అనుభవమయ్యేది – అమ్మ అయినప్పుడే! స్త్రీ జన్మకు తల్లి అవడమే ధన్యత! తనకు సర్వేంద్రియసంతృప్తిని చేకూర్చి, తన పుట్టుకను పునీతం చేసే భర్తకు తనను తాను సంపూర్ణంగా సమర్పణం చేసుకొని స్త్రీ తరించాలి. తనకు అమ్మదనాన్ని కట్టబెట్టి, భర్త తనఒడిలో బిడ్డడయ్యాడన్న ఒకానొక అపురూప భావనతో స్త్రీ అద్వైత స్థితిని పొందాలి. ఆ స్థితిలో జన్మించిన సంతానాన్ని 'ఆనందగంధి' అన్నాడు భవభూతి. భార్యాభర్తలను వేదం దంపతులు అనదు – దంపతి అంటుంది.

అలాంటి అద్వైతస్థితిలో అతడు పూవయితే – ఆమె పరిమళం. అతడు చంద్రుడైతే – ఆమె వెన్నెల. అతడు దీపం – ఆమె వెలుగు. అతడు వాక్కు అయితే ఆమె దాని అర్థం. కుమారసంభవంలోని "వాగర్థా" శ్లోకంలో శివపార్వతుల బంధాన్ని కాళిదాసు అలానే కీర్తించాడు. ఆలుమగలు ఆడది మగాడుగా మిగిలిపోకుండా దంపతిగా మారినప్పుడే – సమభాగం, సమభోగం, సమయోగం అన్న అద్భుతభావన సార్థకం అవుతుంది. ఇది భారతీయ దాంపత్య రసయోగంలోని సారాంశం! స్త్రీ పురుషులు తప్పనిసరిగా అధ్యయనం చేయవలసిన పాఠ్యాంశం!

జీవితమనే గ్రంథంలో దాంపత్యం ఒక రమణీయమైన అధ్యాయం కావాలనుకొంటే – వేదం నిర్దేశించిన, మన పెద్దలు సూచించినదే రాచమార్గం. దృఢమైన దాంపత్యబంధానికి అదే ఆలంబన!

# 8. పుండరీకచరిత్ర

"పాండురంగమాహాత్మ్యం"లోని కథలు స్వతంత్రాలు. జన బాహుళ్యంలో తెనాలి రామకృష్ణుడు తన నాటికి ప్రచారంలో ఉన్న కథలను స్వీకరించి, లక్ష్యానికి అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులతో సర్వాంగ సుందరంగా ఈ కావ్యాన్ని నిర్మించాడు.

కవిగా తెనాలి రామకృష్ణుడంటే – చవకబారు ఛలోక్తుల మనిషి కాదు. చాలా ఉదాత్తమైన, ఉదారమైన కవిత్వం రచించినవాడు. పాండురంగమాహాత్మ్యంలో – ఏ కొలమానాలతో చూసినా కేవలం రెండే రెండు పద్యాలు మినహాయిస్తే ఎక్కడా మేర మీరాడేమో అనిపించే అంగాంగ వర్ణనలు సైతం కనిపించవు. తన కాలాన సాధారణకవులు ప్రయాణిస్తున్న దారిలో ఇతడు నడువలేదు. అంతటి నిగ్రహం కలవాడు.

పాండురంగమాహాత్మ్యం అనేది ఈ కావ్యానికి స్థిరపడిన పేరు. "పుండరీకచరిత్ర" – "పౌండరీకమహాత్మ్యం" అనే పేర్లు కూడా ఉన్నాయి. కవికీ, కావ్యానికీ అభేదంతో "పాండురంగవిభుని పదగుంభనంబు" అనేమాట ఒకటి ప్రసిద్ధిలోకి వచ్చింది. పార్వతీ పరమేశ్వరుల సంభాషణగా ఈ మొత్తం కథను సూతుడు శౌనకాది మహామునులకు వినిపించాడు.

మనుషులతో ప్రమేయం ఉన్న ముఖ్య కథలు ఈ పాండురంగ మాహాత్మ్యంలో అయిదు ఉన్నాయి. మొదటిది పుండరీకుడి వృత్తాంతం. ఇది ఆదిలో ప్రారంభమై, అంతంలోనూ ప్రస్తావనకు వస్తుంది. దీనివల్లనే ఈ కావ్యానికి 'పౌండరీకమహాత్మ్యం' అనే పేరు వచ్చింది. పుండరీకుడి గాథ భారతీయకుటుంబజీవనవిధానానికి ఆదర్శం. అతడు బ్రహ్మచర్యదీక్షతో విద్యాబుద్ధులు నేర్చుకున్నాడు. గృహస్థాశ్రమంలో ప్రవేశించాడు. ఉత్తమ గుణాలతో తల్లిదండ్రులను సేవిస్తూ, దానదయాపరాయణుడై,

సమాజానికి ఉపయోగపడుతూ, దైవచింతనతో సంసారయాత్ర సాగించాడు. కొంతకాలానికి సత్సంతానం కలిగింది. పితృఋణం తీరింది. వానప్రస్థానికి చేరుకున్నాడు. తపస్సు కొనసాగించాడు. బాలకృష్ణుడు దర్శనం అనుగ్రహించాడు. వరం కోరుకోమన్నాడు. "ఛత్రితశేషా! నువ్వు ఇదే రూపంతో, ఇక్కడే, ఇలాగే నివసించాలి. ఈ తీర్థం, ఈ క్షేత్రం అద్వితీయంగా ప్రసిద్ధికెక్కాలి. అదీ నా పేరుతోనే ప్రసిద్ధికెక్కాలి" అని పుండరీకుడు కోరుకున్నాడు. స్వామి 'సరే' అన్నాడు. అటుపైని ఇతడు అర్చకుడై, ఆ పాండురంగవిఠలుణ్ణి సేవించుకుంటూ తరించాడు. దంపతులిద్దరూ ముక్తి పొందారు. ఇది మొదటి కథ.

రెండవది - నిగమశర్మోపాఖ్యానం. కళింగదేశంలో పిఠాపురం వీరి ఊరు. "వేదముల్ వోసిన గాదె - శాస్త్రములు పుట్టిన యిల్లు" అనిపించుకొన్న వంశంలో సభాపతిగారికి లేకలేక పుట్టిన బిడ్డడై జన్మించాడు. యౌవనంలోకి అడుగు పెట్టాడు. వాడి జూదాలకు, జులాయి తిరుగుళ్ళకు, ఇంటిసొమ్ములన్నీ హారతికర్పూరం అయిపోయాయి. అప్పులూ, దొంగతనాలు, మరిన్ని దురభ్యాసాలూ, ఊరు విడిచి పారిపోవడాలు, ఎప్పుడో ఊడిపడటాలు సాగించాడు. సర్వభ్రష్టుడయ్యాడు.

ఒకరోజు అక్కగారు వచ్చింది. ఉపదేశాలు చేసింది. అభిజాత్యం చెప్పింది. బాధ్యత గుర్తుచేసింది. మంచిదారికి రమ్మంది. వాడు సరేనన్నాడు. "మారిపోయాను అక్కా!" అన్నాడు. నాలుగు రోజులు గట్టిగా నమ్మకం కలిగించాడు. ఒకనాటి రాత్రి ఆ యిల్లు దోచుకుని పారిపోయాడు. దారిలో దొంగలు చావకొట్టారు. ఒక పొలంలో సొమ్మసిల్లి పడ్డాడు. తెల్లవారింది. ఆ రైతు చూసి జాలిపడి, ఇంటికి తీసుకు వెళ్లాడు. ఉపచారాలు, వైద్యాలు నడిచాయి. శర్మగారు తేరుకున్నారు. కాపుకోడలు కన్ను వేసింది. తెగించింది. నిగమశర్మ అసలే కోతి. మిత్రద్రోహానికి ఒడిగట్టాడు. ఒక జాతర నాటి అర్ధరాత్రి ఇద్దరూ ఉడాయించారు. అడవిలో

కాపురం పెట్టారు. వేటాడి పొట్టపోసుకుంటూ కొన్నేళ్ళు గడిపారు. కాపు కోడలు కన్నుమూసింది. అటుపైని ఈ నిగమశర్మ ఒక ప్లవకన్యను చేరదీశాడు. సంతానం కలిగింది. కొంతకాలానికి ఆవిడా సెలవు పుచ్చుకుంది. నిగమశర్మ ఎంతగానో విలపించాడు. "అందరూ ధనమిచ్చీ, ధాన్యమిచ్చీ ఆడవాళ్ళని కొనుక్కుంటున్నారు. నేను నీ కోసం నా కులం ధారపోశాను. నువ్వు దగాచేసి వెళ్ళిపోయావు" అంటూ వాపోయాడు. చివరకు గుండె రాయి చేసుకున్నాడు. తాను తినాలి, పిల్లలకి పెట్టాలి. సంపాదనకోసం బయలుదేరాడు. నడిచీ, నడిచీ కొన్ని రోజులకి ఒక నృసింహక్షేత్రం చేరుకున్నాడు. అక్కడ తీర్థంలో స్నానం చేశాడు. స్వామిని దర్శించాడు. క్రమంగా చివరి రోజులు వచ్చాయి.

యమదూతలు వచ్చారు. తీసుకుపోతుండగా హరిదూతలు వచ్చారు. జీవితం ఎలా గడిపినా, ఎన్ని పాపాలు చేసినా, చివరి ఘడియల్లో పుణ్యతీర్థాలలో స్నానం చేశాడు. స్వామిని దర్శించాడు. పుణ్యక్షేత్రంలో తనువు చాలించాడు - కనుక వైకుంఠానికే యోగ్యుడన్నారు. గరుడ వాహనం మీద తీసుకుపోయారు. ఈ ముగింపు ఒక్కటీ క్షేత్రమహాత్మ్యం కోసం. మిగతా కథ అంతా సంసారజీవితమే. వివాహవ్యవస్థకు ఈ కథ - ప్రత్యుదాహరణ. నాతిచరామి అని ప్రతిజ్ఞ చేసిన భర్త - అతిచరించడం, భార్య (కాపు కోడలు) వ్యభిచరించడం, పవిత్ర వివాహబంధాన్ని అక్రమ సంబంధాలతో అపహాస్యం చేసి, నవ్వుల పాలు కావడం, కష్టాలూ, కడగండ్లూ కోరి తెచ్చుకోవడం - ఇదీ దీని సారాంశం.

మూడవది శ్రీరాధాదేవి చరిత్రం. ఇది ఒక అలౌకిక వివాహబంధం. మానసికానుబంధం. సాధారణస్థాయి ఊహలకూ, అనుభవాలకూ అందనిది. పరమాత్మనే భర్తగా భావించి, జీవితాన్ని మీదుగట్టి పరమ పవిత్రంగా నిరంతరం తపోదీక్షతో జీవయాత్ర సాగించడం, కడపట ఆ పరమాత్మలో ఐక్యం కావడం దీనిలో కథాంశం.

నాల్గవ కథ – సుశీలోపాఖ్యానం. ఈవిడ పేరుకు తగ్గ ఇల్లాలు. పతిదేవుణ్ణే సేవిస్తూ, ఓర్పులో భూదేవికి సాటి అని పెద్దల ప్రశంసలు అందుకొంది. ఈవిడ భర్త మహా పిసినారి. వడ్డీవ్యాపారి. ఎంగిలిచేత్తో కాకిని కొట్టడు. తాను తినడు. ఇంకొకరికి పెట్టడు. ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారమన్న చందంగా ఉంటాడు. సకల బంధువిరోధి. ఏ పూటకు ఆ పూట ఇల్లాలికి బియ్యపుగింజలూ, పప్పుబద్దలూ వగైరా కొలిచి లెక్కపెట్టి, సణుగుతూ 'తప్పదు భగవంతుడా' అన్నట్టు ఇస్తుంటాడు.

అప్పులు ఇవ్వడం, వడ్డీలు గుంజడం, ముష్టి ఎత్తడం వస్తువులు సమకూర్చడం – ఇదీ ఇతడి వ్యాపారం. ఏదీ పోనివ్వడు. ఎందుకో అందుకు పనికొస్తుంది. రానిమ్మంటాడు. ఇతడితో అలాగే వేగుతోంది సుశీల.

ఇతడు వడ్డీల వసూళ్లకు పొరుగూరు వెళ్ళగా ఒకనాడు వీళ్ళ ఇంటికి ఒక బ్రహ్మచారి వచ్చాడు. "అమ్మా! ఆకలిగా ఉంది, అన్నం పెట్టు" అన్నాడు. చల్ది అయినా ఫరవాలేదన్నాడు. నేను ఒక్కణ్ణి భుజిస్తే ముల్లోకాలూ తృప్తిచెందుతాయన్నాడు.

సుశీల సాహసం చేసింది. కాళ్ళు కడుక్కుని "రానాయనా!" అని పిలిచి విస్తరివేసి వడ్డించింది. ఆ వచ్చిన వాడు మాయావటువు. వాడి ఆకలి ఎంతకూ తీరడంలేదు. 'ఇంకా తే' అంటున్నాడు. అర్ధాకలితో పంపలేక అటకమీది వాసన కట్టులు దింపి అరిసెలు, లడ్డూలూ వగైరా అన్నీ వడ్డించింది. అయినా ఆ పసిబాలుడి ఆకలి తీరలేదు. సుశీలకు సందేహం కలిగింది. పతివ్రత కాబట్టి అగ్నిదేవుణ్ణి ప్రార్థించింది. ఆయన అనుగ్రహించి ఆదుకున్నాడు. భక్ష్యభోజ్యాలు వంటయింటి నిండా ప్రత్యక్షమయ్యాయి. అంతే వటువు విష్ణుమూర్తిగా దర్శనం అనుగ్రహించాడు.

"ఓ సుశీలా! ఇదంతా నా మాయ. పూర్వజన్మలో నువ్వు ఆవు. అప్పడేదో సేవ చేశావు. అందుకని ఇప్పుడు దర్శనం ఇచ్చాను. నీ భర్త

ఇంత లోభిగా ఉండటం కూడా నా మహత్తే. నిన్ను పరీక్షించానంతే" అన్నాడు. వరాలు ఇచ్చాడు. మాయమయ్యాడు.

ఆ తరువాత ఆమె భర్త ఇంటికి వచ్చాడు. అతడిలో గొప్ప మార్పు వచ్చింది. వివేకవంతుడయ్యాడు. చేతికి ఎముక లేదన్నంతగా దానశీలుడయ్యాడు. దంపతులిద్దరూ నోములూ, వ్రతాలూ తీర్థయాత్రలతో గడిపారు.

ఈ కథలో దంపతులిద్దరూ వివాహబంధం పరిధిలోనే ఉన్నారు. అనైతికత ఏమీలేదు. చట్రంలోనే ఉన్నారు. పక్క చూపులు లేవు. కప్పదాట్లూ లేవు. కానీ సుఖంగా జరిగిన సంసారం కాదు. ఇల్లాలికి ఇవ్వవలసిన స్థానం ఇవ్వని భర్త. హింసించిన భర్త. అదీ పేచీ. దీనితో సమాజానికి ఉపయోగపడని కుటుంబం అయిపోయింది. ఇదీ దీనిలోని సారాంశం.

అయిదవది – అయుత నియుతోపాఖ్యానం. ఇది అద్భుత రసైక పాత్రమైన కథ. దక్షిణదేశాన ఆకాలంలో అగస్త్యాశ్రమం ఉండేది. అగస్త్యుడు గొప్ప తపశ్శీలి. శిష్యవాత్సల్యంతో ఎంతోమందిని విద్యావంతులుగా చేశాడు. ఆ వేలమంది శిష్యుల్లో అయుతుడు – నియుతుడు అనే వారిద్దరు – అన్నదమ్ములు. శ్రద్ధగా విద్యలన్నీ నేర్చుకున్నారు. అగస్త్యుడికి అత్యంత ప్రేమాస్పదులయ్యారు. మంచి పిల్లల్ని తెచ్చి వీళ్ళకి పెళ్లిళ్ళు చేసి సత్కరించాలని గురువుగారికి సంకల్పం కలిగింది. తగిన మగువలు ధారుణిలో కనిపించలేదు. స్వయంగా అగస్త్యుడే బ్రహ్మలోకానికి వెళ్ళాడు. అగస్త్యుడి కోరికమేరకు బ్రహ్మదేవుడు తన కూతుళ్ళను గాయత్రినీ, సావిత్రినీ అప్పగించాడు. అగస్త్యుల వారు ఆశ్రమానికి తీసుకువచ్చారు. అయుత నియుతలారా! మీరిద్దరూ చెరొకరినీ వివాహమాడండి – అని ఆజ్ఞాపించాడు. అయుతుడు నేనసలు వివాహమే చేసుకోనన్నాడు. ఇద్దరినీ నియుతుడే పెళ్ళాడాడు. తన ఆజ్ఞను

ధిక్కరించినందుకు అగస్త్యుడికి కోపం వచ్చి అయుతుణ్ణి ఆశ్రమం నుంచి వెళ్ళగొట్టాడు.

అయుతుడికి ఒక ఖచ్చితమైన అభిప్రాయం – ఆడవాళ్ళు మన్మథ శిబిరాలనీ, ముక్తికి ప్రతిబంధకాలనీను! ఈ కోరికను విడగొట్టుకోకుండా తపస్వులమని విర్రవీగేవాళ్ళు వట్టి దాంభికులనీ, సిగ్గులేని కపట సన్యాసులనీ గట్టి నమ్మకం. అంచేత వివాహసంస్కారాన్ని పూర్తిగా తిరస్కరించి హిమాలయాలకు వెళ్ళిపోయాడు. గాఢతపస్సు చేశాడు. దాని తీవ్రతకు ఇంద్రుడు కంగారుపడ్డాడు. ముసలిబాపడుగా వేషం మార్చి, శిష్యులతోను, ఒక ముసలి ఆవుతోను అయుతుడి ఆశ్రమానికి వచ్చాడు. తన ముసలి ఆవుని కొన్నాళ్ళపాటు నీ ఆశ్రమంలో ఉంచుకోమనీ, మళ్ళీ వచ్చి నేను తోలుకు వెడతాననీ చెప్పి ఆ కామధేనువును సవత్సంగా అప్పగించి వెళ్ళిపోయాడు. అయుతుడి పోషణలో ముసలి ఆవు గుండులా తయారయ్యింది. అడవిలో కలయ దిరగడం మొదలు పెట్టింది. ఒకనాడు వాధూల మహర్షి ఆశ్రమంలోకి చొరబడింది. ఆ మహర్షి తీవ్రంగా తపస్సు చేసుకుంటుంటే, అప్పటికే ఆయన మీద పుట్టకట్టింది. ఆ పుట్టను ఈ ఆవు మట్టగించింది. ఆయన ఉగ్రుడైపోయాడు. దురాత్మ! మదాంధా! మహాగర్వీ! – అంటూ అయుతుడి మీద రంకెలు వేశాడు. నా తపస్సుని భంగపరచడం ఇంద్రుడి వల్లకూడా కాలేదు. నువ్విలా ఆవుని తోలి భంగపరుస్తావా? 'కప్పవై పో' అని శపించాడు.

అయుతుడు కాళ్ళా వేళ్ళాపడ్డాడు. విషయం తెలిసి వాధూలుడు మెత్తబడ్డాడు. ఓదార్చాడు. గృహమేధి గొప్పతనం చెప్పాడు. గృహస్థాశ్రమాన్ని నువ్వు తిరస్కరించడం వల్ల ఈ గొడవంతా వచ్చింది. అయినా ఏం చెయ్యను? శాపం శాపమే. అనుభవించక తప్పదు. నీవు సంతానవంతుడివి అయినప్పుడు శాపవిమోచనం కలుగుతుంది అని

చెప్పాడు. అంటే ఏది ముక్తికి ఆటంకం అని తాను అనుకున్నాడో - అదే ఇప్పుడు తన శాపవిముక్తికి సాధకమయ్యింది. వివాహం, సంసారం, సంతానప్రాప్తి - తప్పనిసరివై మెడకు చుట్టుకున్నాయి. కప్పగా మారి పాండురంగక్షేత్రం చేరుకున్నాడు. స్వామి పాదాలను ఆశ్రయించాడు. కప్పగా మారినా మనఃప్రవృత్తి భక్తిగానే కొనసాగింది. దినచర్య తాపసి మార్గాన నడిచింది. భక్తులూ, యాత్రికులూ ఈ వింత కప్పను చూసి హరిదాసం అని పేరుపెట్టారు. కొన్ని ఏళ్ళుగడిచాయి.

పౌండరీకనాథుడి పర్వదినాలలో ఒకనాడు కన్యాకుబ్జవిభుని కన్యాశిరోమణి సఖీజనంతో రథాలమీద చాలా ఆర్భాటంగా వచ్చింది. అందరికందరే అందగత్తెలు. భీమరథినదిలో అంతా జలకాలాడారు. వీరి కంటపడింది ఈ కప్ప. దాన్ని పట్టుకోవడానికి రాకుమారి స్వయంగా పూనుకుంది. పట్టుకుంటానని పందెం వేసింది. పట్టుకుంది. మెడకు బంగారుతాడు కట్టింది. చాలాసేపు ఆడించింది. సరదా తీరిపోయింది. కప్ప అంటే భయపడే ఒక బ్రాహ్మణుడి మీదకు విసిరేసింది. ఆయనకు కోపం వచ్చింది. "మీరంతా ఈ కప్పకు పెళ్ళాలవ్వండి - అని శపించాడు. ఇలాగ అయుతుడికి వారంతా భార్యలయ్యారు. సంతానం కలిగింది. శాపవిమోచనం అయింది.

ఈ కథకి సారాంశం ఏమిటో కవిగారే చెప్పారు. వివాహవ్యవస్థను తప్పించుకోవడం తగదు. తప్పించుకోవాలనుకోవడం కష్టాలు కోరి తెచ్చుకోవడం! ఆ ప్రయత్నం వద్దు అనీ, బ్రహ్మచర్యం నుంచి వానప్రస్థం వరకూ క్రమపద్ధతిలో అనుభవపరిణతి అవసరమనీ, ధర్మబద్ధంగా నడిచిన పుండరీకుడే భారతీయుల జీవనవిధానానికి ఆదర్శమనీ ప్రబోధించడం ఈ కథాపరమార్థం.

వెరసి, తెనాలి రామకృష్ణుడు మన వివాహవ్యవస్థ తాలుకు మూల్యాలను ప్రబంధధ్వనిగా కథాపరమార్థంగా ప్రబోధించి పునః

ప్రతిష్ఠించి, కవిగా – క్రాంతదర్శిగా ఒక గురుతరమైన బాధ్యతను సమర్థంగా నిర్వహించాడు.

సంసారాన్ని వదుల్చుకోమనికాదు. ఒదులుగా ఉంచుకోమని దీని సందేశం. అదే ఈ నాటికీ మనకు ఆదర్శం! దీన్ని మర్చిపోయి మనలో చాలామంది సంసారం పట్ల విసుగు చెందిపోతారు. సన్యాసం పుచ్చేసుకొందామనుకొంటారు. వాస్తవానికి సన్యాసమనేది పుచ్చుకొంటే వచ్చేదికాదు, మనసు విచ్చుకొంటే వస్తుందది. అలా మనసు విచ్చుకొన్నప్పుడు సంసారాన్ని ఒదులుగా ఉంచుకోవడం తెలుస్తుంది. రామకృష్ణపరమహంస చెప్పిన సూక్తి మనసులోకి ఇంకుతుంది. సంసారం గురించి చెబుతూ ఆయన "నువ్వు సంసారంలో ఉండు... తప్పులేదు. నీలో సంసారం ఉండకూడదు... అది తప్పు" అన్నారు. దానికో పోలిక చెబుతూ "నావ నీళ్లలో ఉంటే తప్పులేదు, నీళ్లు నావలో ఉంటే అదే ముప్పు'' అని హెచ్చరించారు. సంసారులందరూ గ్రహించి ఆచరించవలసిన సూక్తి అది. దాన్నే తెనాలిరామకృష్ణుడు "తప్పించుకోవడం కాదు, తప్పుగా ఉంచుకోవడం" వలదని ఈ కథలో హెచ్చరించాడు.

# 9. లోభగుణవంతులు

కార్తవీర్యార్జునుడు హైహయవంశపు రాజు. ఆయన తండ్రి కృతవీర్యుడు. వింధ్యపర్వతాల చెంతన గల మహిష్మతీపురం వారి రాజధాని. గర్గమహర్షి వారికి పురోహితుడు. గర్గుడి ఉపదేశంతో – దత్తాత్రేయుణ్ణి ప్రసన్నం చేసుకొన్న మహావీరుడు – కార్తవీర్యార్జునుడు. శత్రువులనుంచి ఓటమి లేకుండా వరాలు పొందాడు. మిక్కిలి బలాఢ్యుడు అయ్యాడు.

కార్తవీర్యుడి కథ రావణాసురుడికి తెలిసింది. అతడిలో జిగీష రగిలింది. వేయిచేతులతో వీరవిహారం చేసే కార్తవీర్యుణ్ణి యుద్ధానికి పిలిచాడు. ఆ సమయంలో కార్తవీర్యుడు నర్మదానదీతీరాన స్త్రీలతో కులుకుతున్నాడు. అలాంటి స్త్రీలోలుడు తనతో యుద్ధానికి రాలేడని రావణుడు భావించాడు. అయితే కార్తవీర్యుడు ఆ స్థితిలోంచే నేరుగా పోరుకు తలపడ్డాడు. ఘోరంగా పోరాడాడు. రావణాసురుణ్ణి మట్టికరిపించి బందీని చేశాడు. రావణుడి తండ్రి పులస్త్యబ్రహ్మ. కొడుకు పరాజయం వార్తవిని ఆయన పరుగున వచ్చి కార్తవీర్యుణ్ణి మంచి చేసుకొని రావణుణ్ణి విడిపించాడు.

ఒకసారి అగ్నిదేవుడు ఆకలితో అలమటిస్తూ కార్తవీర్యుడి వద్దకు వచ్చి తనకు తగిన ఆహారం సమకూర్చమని అడిగాడు. కారడవులను కార్చిచ్చుతో దహించినప్పుడే అగ్నిదేవుడికి ఆకలి చల్లారుతుంది. భారతంలో ఖాండవవనాన్ని – కృష్ణార్జునుల సాయంతో ఆహుతి చేసినట్లే, కార్తవీర్యుడి అనుమతితో గిరినగర అరణ్యాలను భక్షించడానికి అగ్ని సిద్ధపడ్డాడు. అదే అటవీప్రాంతంలో వరుణుడి కుమారుడు మైత్రావరుణుడి ఆశ్రమం ఉంది. అగ్నిదేవుడి పటాటోపానికి మైత్రావరుణుడి ఆశ్రమం సైతం కాలి బూడిద అయింది. ఆయన గొప్ప తపస్సంపన్నుడు.

తనకు జరిగిన అన్యాయానికి ఆయన స్పందించకపోయినా, ఆయన కుమారుడు మాత్రం తీవ్రమైన ఆగ్రహానికి లోనై, ఈ దురాగతానికి కారణమైన కార్తవీర్యుడి వేయి చేతులను - త్వరలో పరశురాముడు వచ్చి ఖండించు గాక! అని శపించాడు. కార్తవీర్యార్జునుడి వేయిచేతులను పరశురాముడు తన గండ్రగొడ్డలితో ఖండించడం వెనుక కథ ఇది!

తాను శాపగ్రస్తుడు అయిన నాటినుంచి కార్తవీర్యుడిలో ఎంతో మార్పు వచ్చింది. ధర్మమార్గంలో జీవించడం ఆరంభించాడు. అయినా, ఆ స్థితిలో సైతం లోభానికి లోబడి భ్రష్టుడైన ఉదంతాన్ని మనకు భాగవతం వివరించింది. అరిషడ్వర్గాల్లో ఒకటైన లోభం కారణంగా మనిషి ఎంతకు దిగజారతాడో గ్రహించాలంటే మనం కార్తవీర్యుడి కథ తెలుసుకోవాలి.

ఒకరోజు కార్తవీర్యుడు తన పరివారంతో సహా అడవికి వేటకై వెళ్ళాడు. ఎక్కడెక్కడో తిరిగి తిరిగి, ఆకలిదప్పులు పీడిస్తుంటే, చివరకు పరశురాముడి తండ్రి జమదగ్నిమహర్షిఆశ్రమానికి చేరాడు. దాహం తీర్చమని ప్రార్థించాడు. "దప్పిక అన్నమాటేమిటి... అన్నమే పెడతాను" అన్నాడాయన. మునులు ఏర్పాటు చేసే భోజనమంటే - వారు తినే కందమూలాలే కదా!" అనుకొన్నాడు కార్తవీర్యుడు. కాని ఆ మొత్తం సైన్యం అంతటికీ జమదగ్నిమహర్షి అప్పటికప్పుడు అద్భుతమైన పంచ భక్ష్య పరమాన్నాలతో, షడ్రసోపేతమైన విందుభోజనాలు సిద్ధం చేశాడు. కార్తవీర్యుడు ఆశ్చర్యపోయాడు. ఓ మారుమూల అడవిలో, అంత తక్కువ వ్యవధిలో ఇందరికీ ఈ స్థాయి విందుభోజనాలను ఆ ఋషి ఎలా ఏర్పాటు చేశాడని తీవ్రంగా మధనపడ్డాడు. ఆరా తీశాడు.

చివరకు కారణం ఏమిటో తెలిసింది. జమదగ్ని దగ్గర సుశీల అనే గోవు ఉంది. అది కామధేనువు. ఏం కోరినా క్షణాల్లో సమకూర్చేశక్తి ఆ గోవుకు ఉంది. దాని సాయంతోనే మహర్షి రాజోచితసత్కారాలను

నెరవేర్చాడని గ్రహించాడు. వెంటనే కార్తవీర్యుడిలో దుర్బుద్ధి ప్రవేశించింది. లోభం ఆవహించింది. తనది కాకపోయినా – తనకు సొంతం కావాలని అనుకోవడం, మరోమనిషికది దక్కకుండా చేయాలన్న ఆరాటమే – లోభం అంటే! అది అరిషడ్వర్గాల్లో ఒకటి మాత్రమే కాదు, ముఖ్యమైనది కూడా!

సరిగ్గా ఇలాంటి సన్నివేశమే రామాయణంలోనూ ఉంది. విశ్వామిత్రుడు అప్పటికి ఇంకా రాజు మాత్రమే. ఆయన అసలు పేరు గాధేయుడు. గాధి కుమారుడు కాబట్టి గాధేయుడు. ఆయనా ఒకసారి ఇలాగే సైన్యంతో ఊరేగుతూ వశిష్ఠుడి ఆశ్రమానికి వెళ్ళాడు. ఒక భూపాలుడు వచ్చాడనే గౌరవంతో వశిష్ఠ మహర్షి గాధేయుణ్ణి స్వాగతించి ఆతిథ్యమర్యాదలు నిర్వహించబోయాడు. విశ్వామిత్రుడు వారించాడు. "ఇంతమందికి వండి వడ్డించడమంటే చిన్న విషయం కాదుకదా!" అన్నాడు.

అయితే జమదగ్ని వద్ద సుశీల మాదిరే, వశిష్ఠులవద్ద శబలఅనే కామధేనువు ఉంది. కాబట్టి వశిష్ఠమహర్షి జమదగ్ని మాదిరే రాజుకు, రాజుపరివారం మొత్తానికి మహత్తరమైన భోజనాలు ఏర్పాటు చేశాడు. "యస్య యస్య యథా కామం షడ్రసేష్వభిపూజితం..." అన్నారు వాల్మీకి మహర్షి. అంటే ఎవరెవరు ఏయే రకాల ఆహారాలను కోరుకొంటారో – ఆయా రకాలన్నీ సమకూరాయట. ఆ రకంగా ఇష్టమైన అన్ని రుచులతో ఆరగింపు పూర్తయ్యేసరికి – విశ్వామిత్రుడిలోంచి లోభం తొంగిచూసింది. కార్తవీర్యుడు జమదగ్నిని కోరినట్లే – గాధేయుడూ ఆ ధేనువును తనకు స్వాధీనం చేయమని వశిష్ఠుణ్ణి కోరాడు. బందిపోట్లు దాన్ని ఎత్తుకు పోతారని కార్తవీర్యుడు బెదిరించినట్లే – "రత్నహారీ చ పార్థివః" రత్నంవంటి శ్రేష్ఠమైనవన్నీ రాజు అధీనంలోనే ఉండాలన్న తర్కంతో గాధేయుడు వాదనకు దిగాడు. ఇది లోభానికి పరాకాష్ఠగా చెప్పదగిన వితండవాదం.

వాస్తవానికి సుశీల, శబల వంటి కామధేనువులకు రాజుల సంరక్షణతో పనిలేదు. వాటికి మహర్షుల అండ చాలు. ఆ మాటకొస్తే అవి తమను తామే రక్షించుకోగల సామర్థ్యం కలవి. శబలవిషయంలో జరిగిందికూడా అదే! ఒక్కసారి అది వశిష్ఠ మహర్షి కేసి వివరణ కోరుతూ చూసింది. "స్వామీ! నన్ను మీరు విడిచి పెడుతున్నారా?" అంది దీనంగా "కాదు, అధికార బలమదగర్వంతో నన్నుకాదని ఈ రాజు నిన్ను స్వాధీనం చేసుకొన్నాడు" అన్నారు వశిష్ఠులు. "బ్రహ్మదండం ఉన్నా మీరు – అతిథిగా వచ్చినవాడు కదా! అని సందేహిస్తున్నట్లయితే నాకు అనుజ్ఞ ఇవ్వండి. నన్ను నేనే రక్షించుకొంటాను" అంది శబల. వశిష్ఠులు అంగీకరించారు.

అంతే! శబల సమస్త అవయవాల్లోంచి, రోమకూపాల్లోంచి వేలు, లక్షలుగా వనచర సైనికులు పుట్టుకొచ్చారు. విశ్వామిత్రుడి సైన్యాన్ని ఊచకోత కోశారు. విశ్వామిత్రుడు తన శస్త్రాస్త్రసంపదతో వనచర సైనికులను మట్టుపెడుతూనే ఉన్నాడు... శబల మళ్ళీ సృష్టిస్తూనే ఉంది. చివరకు విశ్వామిత్రుడి సైన్యం నేలకూలింది. ఆయన పరాభవంతో వెనుతిరిగాడు.

భాగవతంలోని కార్తవీర్యుడి కథగాని, రామాయణంలోని విశ్వామిత్రుడి కథగాని – మనిషిలోని ఒకానొక విచిత్ర స్వభావానికి వ్యాఖ్యానాలు. వారిద్దరి ప్రధానసమస్య – ఆకలిదప్పులు. అవి తీరేసరికల్లా వారిలోంచి లోభం తొంగి చూసింది. చాలామందిలో కనపడే సహజ దుర్గుణం లోభం! ఒక పెద్దధాన్యపురాశి ఉందనుకోండి – పిచుకలు, పిట్టలు దానిపై వాలి, తమకు కావలసినంతా తినేసి తృప్తిగా ఎగిరిపోతాయి. ఒక గడ్డిమేటులోంచి పశువులు తమ ఆకలిమేరకు గడ్డి మేసి తిరిగి వెళ్ళిపోతాయి... అంతే తప్ప పిట్టలుగాని, పశువులుగాని కొంచెం దాచిపెట్టుకుందామని ఇంటికి ఎత్తుకెళ్లవు. మరి అదే ధాన్యపురాశిని నడివీధిలో పోసి ఎవరికి ఎంత కావాలో తీసుకోమని

ప్రకటించి చూడండి. ఎంత రచ్చ అవుతుందో! దాన్నే లోభం అంటారు. అంతా తనకే దక్కాలి అనిపించడమే లోభం. కామధేనువులు తమకు కావాలని కార్తవీర్యుడికి, విశ్వామిత్రుడికి అనిపించడానికి కారణం వారి లోభం! పైగా దానికోసం ఆ మహర్షులతో వితండవాదం! ఎంత చిత్రం!

ఈ భాగవత రామాయణ కథల్లోంచి మనం గ్రహించవలసిన విషయం మరొకటుంది. ఈ విందులు వినోదాలు రాజభోగాలు విలాసాలు సుఖలాలసతలు... ఇవేవీ ఋషులకు తెలియనివేం కావు. కావాలనుకొంటే ఇలాంటివెన్నో తమకోసం సంపాదించనూ గలరు, సృష్టించనూ గలరు. అయినా కందమూలాలతో సరిపెట్టుకొన్నారు... కాదు కాదు... సంతృప్తిచెందారు. కోరికలను జయించారు. గింజలు ఏరుకొని తిని బతికారు. బతకడం కోసమే తిన్నారు. కర్తవ్యాలు ముగించారు. ముక్తిని సాధించారు. సాక్షాత్తూ కామధేనువులే తమ స్వాధీనంలో ఉన్నా - కామాన్ని అదుపులో పెట్టారు. అందుకే ఋషులయ్యారు. శంకరభగవత్పాదుల విషయమే చూడండి - ఆర్తితో ఆశువుగా శ్లోకాలు వల్లించి, అమ్మవారిని మెప్పించి, పసిడి ఉసిరి పళ్ల వర్షం కురిపించారాయన. తన కోసం కాదు. ఒక దానగుణవంతురాలి దైన్యాన్ని తొలగించేందుకు! అలా తనవల్లే అంత సంపద కురిసినా, ఆ పసిడి రాశిలోంచి ఓ గుప్పెడు వాటికోసం ఆయన ఆశపడలేదు. భిక్షకై పక్కఇంటికి వెళ్ళిపోయారు నిశ్చింతగా... అదీ ఆదిశంకరుల గొప్పతనం! పరకాయప్రవేశవిద్య తెలిసి, ఓ చక్రవర్తి శరీరంలో ప్రవేశించిన సందర్భంలో సకలరాజభోగాలు అందుబాటులో ఉండీ, ప్రలోభాల జోలికి పోకుండా యాచనతో పొట్టపోసుకొన్న మహనీయుడాయన. జమదగ్నిదీ, వశిష్ఠులదీ అదే మార్గం. అదే గురుజాడ.

కార్తవీర్యుడు అపచారం చేశాడు. సరే! పరశురాముడిదీ అదే దారా? హింసకు సమాధానం ప్రతిహింసేనా? కాదు కదా! అందుకే జమదగ్ని

కొడుకును తీవ్రంగా మందలించాడు. తప్పుపట్టాడు. అదే కాదు, భాగవతం మొదట్లో తన తండ్రి శమీకమహర్షి మెడలో చచ్చిన పామును వేలాడదీసాడన్న కోపంతో పరీక్షిత్తును శృంగి శపించినప్పుడు సైతం - శృంగిని తండ్రి శమీకుడు గట్టి చివాట్లు పెట్టాడు. అంటే, తగిన కారణాలున్నా కూడా మునిపుత్రులు అధర్మానికి పాల్పడితే - తండ్రులు తమ తనయులను ఏనాడూ సమర్థించలేదు. సరికదా నిరసించారు. వారిపై ఆగ్రహించారు. ధర్మం విషయంలో వారు కొడుకు కూతురు భార్య... ఎవరినీ సహించరు. తమ వారే అయినా దోషం చేయరాదని ఋషుల నియమం. మన పురాణాలు ఎంతటి దివ్యమైన సందేశాన్ని మనకు అందించాయో... అవి ఈనాటికీ ఎందుకు ఆచరణయోగ్యాలు, అనుకరణయోగ్యాలు అవుతున్నాయో - పై కథలు చదివితే అర్థం అవుతుంది. భారత భాగవత రామాయణాలు భారతీయమైన సంస్కృతీ సంప్రదాయాలకు వెన్నెముకగా నిలిచాయంటే - ఎందుకో తెలుస్తుంది.

మహాభారతంలో ధృతరాష్ట్రుడిది రాజ్యలోభం. ఆయన పుట్టుకతో అంధుడు. కాబట్టే ధర్మశాస్త్రరీత్యా ఆయనకు రాజ్యాధికారం దక్కలేదు. తమ్ముడు పాండురాజు ప్రభువయ్యాడు. దరిమిలా పాండురాజు ఆకస్మికంగా మరణించడంతో రాజ్యసంరక్షణబాధ్యత అన్నగారికి సంక్రమించింది. దాని అర్థం - ధర్మకర్తగా ఉండమని. క్రమంగా ఆయన రాజభోగాలకు అలవాటుపడ్డాడు. అది లోభానికి దారితీసింది. తనకు దక్కని రాజ్యశ్రీని కనీసం తన కొడుక్కి అయినా కట్టబెట్టాలని ఆయన ఎన్నో పన్నాగాలు పన్నాడు. కొడుకు దుర్యోధనుడి దురాగతాలకు వంతపాడాడు. విదురుడు ఎన్నోరకాలుగా చెప్పినా వినిపించుకోలేదు. దీని అంతటికీ మూలం - ఆయనకుగల బలమైన రాజ్యలోభం. దాని ఫలితంగా చివరకు రాజ్యాన్నేకాదు, నూరుమంది సంతానాన్ని కోల్పోయాడు. లోభానికి బలై జీవచ్ఛవమై అడవుల పాలయ్యాడు.

తాత్కాలిక రాజ్యాధికారం కారణంగా భారతంలో ధృతరాష్ట్రుడు భ్రష్టుపట్టిపోతే - దానికి లోబడని శీలవంతుడు రామాయణంలోని భరతుడు. భరతుడికి దక్కిన రాజభోగమూ తాత్కాలికమే. కాని లోభానికి, ప్రలోభానికి ఆయన లోనుకాలేదు. రాముడి రాజ్యానికి ఆయన ధర్మకర్తగానే వ్యవహరించి, తిరిగి అధికారాన్ని రాముడికి అప్పగించాడు. లోభం కారణంగా ఎవరూ గుడ్డివారు కారాదన్నది తన ప్రవర్తన ద్వారా లోకానికి బోధించాడు.

భారత భాగవత రామాయణాల్లోని ఈ కథల పరమార్థం గ్రహించినవారు, ఆ తేడాను గుర్తించి లోభ, వ్యామోహాలనుంచి తేలిగ్గా బయటపడతారు.

## 10. నేను - నాది

శ్రీరామచంద్రుడికి హఠాత్తుగా మనసులో ఒక గొప్ప సందేహం పుట్టుకొచ్చింది. సరాసరి వసిష్ఠ మహర్షి ఆశ్రమానికి వెళ్ళి తలుపు తట్టాడు. ఇంత రాత్రివేళ వచ్చినదెవరని ఆశ్చర్యపడ్డాడు వసిష్ఠుడు. "ఎవరూ" అని గట్టిగా అడిగాడు. "నేనే" అన్నాడు రాముడు! తెలియలేదు వసిష్ఠుడికి... "నేనంటే ఎవరు?" అని తిరిగి ప్రశ్నించాడు. "అది తెలుసుకోవాలనే ఇలా వేళకాని వేళ మీ తలుపు తట్టాను గురుదేవా" అని గాఢంగా నిట్టూర్చాడు స్వామి.

"నేనెవరిని" అనేది యుగయుగాలుగా మనిషిని వేధిస్తున్న ప్రశ్న! వెంటాడుతున్న సందేహం! మాటమాటకు మాటిమాటికి మనిషి నోట 'నేను' అనే మాట వస్తూనే ఉంది. కాని ఆ 'నేను' ఎవరనేది చిక్కు ప్రశ్నగా, ఒక చిదంబర రహస్యంగా మిగిలిపోతూనే ఉంది.

సత్యభామ కాలు కృష్ణుడి తలకు తగిలింది. "నన్ను" తంతే తన్నావు, నాకు గౌరవమే అన్నాడా భార్యావిధేయుడు. తలనే కాదు, శరీరంలో ఎక్కడ తన్నినా – 'నన్ను' తన్నాడనే అంటారు. అలా అని శరీరమే 'నేను' కాదు. 'కన్ను నాది', 'కాలు నాది' అంటున్నాం – కాని కన్నూ కాలూ 'నేను' కాదు. ఎందుకంటే కన్ను లేకున్నా, కాలు లేకున్నా 'నేను' ఉన్నాను. నాలుక మిఠాయిని రుచి చూసింది. చెవి చక్కని సంగీతాన్ని ఆలకించింది. ముక్కు సువాసనను పసిగట్టింది. 'నేను' తిన్నాను, 'నేను' విన్నాను. 'నేను' వాసన చూసాను అనేస్తాం... కాని, ఇవేవీ 'నేను' కాదు. ఎవరైనా తిట్టిపోస్తే మనసు గాయపడుతుంది. కాస్త పొగిడితే చాలు – సంతోషపడుతుంది. కాని అదెక్కడుందో అంతు చిక్కదు. అంటే పంచేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనసు... వీటిలో ఏ ఒక్కటీ 'నేను' కాదు. రహస్యం ఏమంటే – 'నేను'లో ఇవన్నీ ఉన్నాయి. ఇన్నీ

కలిస్తేనే 'నేను' అవుతున్నాను. మనసులాగే 'నేను' కూడా బయటకు కనపడదు.

రాజుగారొకాయన "జ్ఞానోపదేశం" పై మనసుపడ్డాడు. ప్రసిద్ధుడైన ఒక ఆధ్యాత్మిక గురువు ఇంటికి వెళ్ళాడు. అక్కడున్న శిష్యుణ్ణి ఒకణ్ణి పిలిచాడు. "నేనొచ్చానని నీ గురువుకి చెప్పు" అన్నాడు. లోపలికి వెళ్ళి శిష్యుడు ఆ మాట గురువుతో చెప్పాడు. "నేను పోయాకా రమ్మను... ఉపదేశం చేస్తాను" అని గురువు బదులిచ్చాడు. ఆ మాట రాజును అయోమయంలో పడవేసింది. "పోయినాయన చెప్పేదేముంటుంది? తాను వినేదేముంటుంది?" అని తెల్లబోయాడు. మారుమాట లేకుండా ఇంటికి తిరిగివెళ్ళిపోయాడు. కాని గురువుమాట మాత్రం రాజు మనసును గట్టిగా పట్టుకుంది. కూడా అంతఃపురానికి వచ్చింది. పదే పదే రాజును సతాయించింది.

ఎన్నాళ్ళో మధనపడగా అకస్మాత్తుగా రాజుకు సత్యం స్ఫురించింది. జ్ఞానోదయం అయింది. క్షణంలో ముడివిడిపోయింది. గురువు చెప్పింది – ఆయన పోయాక రమ్మని కాదు, 'నేను' వచ్చానని కదా కబురు చేసాడు... ఆ 'నేను' పోయాక వస్తే – తనకు గురువు ఉపదేశం చేస్తాడు. ఇంతే విషయం! ఎప్పుడైతే ఈ ఎరుక కలిగిందో – మనసులో ఏదో తెలియని ఆనందం ఉబికి వచ్చింది. మనసంతా తేలిక అయిపోయింది. మూసి ఉంచిన గదిలో ఎన్నో ఏళ్ళుగా దట్టంగా పేరుకు పోయిన చీకటిని తరిమేయడానికి దీపానికి క్షణకాలం చాలు, ఏళ్ళు పట్టదు! సత్యదర్శనంతో రాజుగుండెల్లో స్థిరపడిన చిక్కుప్రశ్న ఒక్కమారుగా సమసిపోయింది. రాజు తన నుండి తాను విడిపోయాడు. తనలోని గుజ్జు పోగులు సమస్తం కాలి బూడిద అయ్యాక వెదురు వేణువుగా మారుతుంది. కృష్ణుడి పెదవిని తాకగల్గుతుంది. రాజు విషయంలో జరిగిందదే! "నేను" అని తాను భావిస్తున్నది, లోకానికి ప్రదర్శిస్తున్నది తొలిగిపోయేసరికి అసలైన 'నేను' బయటకు వచ్చింది. రాజుగారి కథ సుఖాంతమైంది.

మనం చర్చిస్తున్నది వేదాంతం కాదు, వివేకం గురించి! ఆధ్యాత్మిక లోకాల్లోనే కాదు, రోజువారీ జీవితాల్లోను ఈ సూత్రం పనికొస్తుంది. 'నేను'నే సంస్కృతంలో 'అహం' అంటారు.

ఆధునికజీవనసరళిలో అగచాట్లకు గురిచేస్తుంది, జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తున్నది – అహమే! అహాన్ని వదులుకోగల్గితే లోకంలో ఎన్నో సమస్యలు పరిష్కారం అవుతాయి. అహం అంటే అహంకారం ఒక్కటే కాదు, కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే అవలక్షణాలన్నీ కలిస్తే అహం అవుతోంది. కనుకనే వాటిని పెద్దలు 'అరిషడ్వర్గం' (ఆరు శత్రువుల కూటమి)గా పరిగణించారు.

రోడ్డు మీద గాయపడిన వ్యక్తికి ఓ పెద్దావిడ సపర్యలు చేస్తోంది. ఇంతలో ఒక నర్సు వచ్చింది. "మీరు తప్పుకోండి. నేను సుశిక్షితురాలైన నర్సుని... మీకంటే నేను ఉన్నతంగా సహాయపడగలను. నా పనే అది" అంది. పెద్దావిడ పక్కకు తప్పుకొని నర్సుకి దారిచ్చింది. నెమ్మదిగా నర్సుతో "మీకు నిపుణురాలైన ఎముకల వైద్యురాలితో పని పడితే చెప్పండి. ఇక్కడే ఉంటాను" అంది. అదీ అహంకారరాహిత్యం అంటే! అది మనిషిని ఉన్నతుణ్ణి చేస్తుంది.

స్త్రీ, పానం, జూదం, దుబారాఖర్చు, వేటపై ప్రీతి, దండపారుష్యం (దండించడంలో శాడిజం) వాక్పారుష్యం (మాటతీరులో సౌమ్యత అంటూ లేకపోవడం).... ఏడింటినీ సప్త వ్యసనాలు అంటారు. వీటిలో మొదటి ఐదు కామజాలు. అంటే కోరికల్లోంచి పుడతాయి. తక్కిన రెండు క్రోధజాలు, అంటే కోపంలోంచి వస్తాయి. కనుక అరిషడ్వర్గాల్లోని మొదటి రెండింటిలోంచే ఏడు వ్యసనాలు పుట్టుకొస్తున్నాయి. మరి మిగిలిన నాల్గింటి నుంచీ ఎన్ని పుట్టుకొస్తున్నాయో లెక్కే లేదు. ధర్మరాజు జూద వ్యసనం, దుర్యోధనుడి దురభిమానం, ధృతరాష్ట్రుడి మితిమీరిన పుత్ర వ్యామోహం, దక్షప్రజాపతి దురహంకారం, రావణుడి కాముకత, కీచకుడి

మూర్ఖత్వం, కంసుడి భయం, విశ్వామిత్రుడికి వశిష్ఠులపై ద్వేషం, అశ్వత్థామ పగ, కూతురు దేవయానిపై శుక్రాచార్యుడి అలవిమాలిన మమకారం... ఇలా మనిషి పతనానికి, సమాజానికి చేటు కలిగించడానికి కారణమవుతున్న ఎన్నో స్వభావాలు కలిగలిస్తే 'నేను' అవుతోంది. ఇందులో మంచివీ ఉన్నాయి. చెడ్డవీ ఉన్నాయి. ఏది మితిమీరినా మనిషీ చెడిపోతాడు, సంఘమూ చెడిపోతుంది.

ఇప్పుడు లోకంలో జరుగుతున్నదదే! జనాల ఆదాయం పెరిగిపోతోంది. కాని ఆనందం తరిగిపోతోంది. డబ్బుంది, సుఖమే లేదు. ఆహారం ఉంది. భోగం లేదు, మందులున్నాయి - రోగాలు తగ్గడం లేదు. దీన్ని బట్టి ఆనందానికి కావలసింది ఆదాయాలు కావని తేలిపోయింది. మరి ఆనందం కావాలంటే ఏం చెయ్యాలి? 'నేను' లోంచి అరిషడ్వర్గాలను, సప్త వ్యసనాలను, వల్లమాలిన అహంకార, మమకారాలను తొలగించాలి. అప్పుడు మిగిలే అసలైన 'నేను' స్వయంగానే ఆనందస్వరూపుడు. ఆ నేనును పునరుద్ధరించుకోవాలి. పైన చెప్పినవన్నీ సుఖాన్నో సంతోషాన్నో అందించగలవు గాని శాశ్వతమైన, మనిషికి నిజంగా అవసరమైన ఆనందాన్ని మాత్రం అందించలేవు. కనుక వాటిలో ఒక్కోదాని గురించి విశ్లేషించుకుంటూ ఒక్కొక్కదాన్నుంచీ 'నేను' ను విడిపించుకుంటూ మనిషి ఆనంద స్వరూపుడు కావలసిన అవసరం ఎంతో ఉంది. దీన్నే జీవనకళ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) అంటారు. అది అటు వ్యక్తిగతజీవితానికి ఇటు సమాజహితానికి ఎంతో మేలు చేస్తుంది.

అహంతో కలగలసిపోయిన ఎన్నో అవలక్షణాలను వేరువేరుగా గుర్తిస్తూపోతే, 'నేను' అనేది తేలిపోతుంది.

'నేను' నుండి విడివడిన మనిషికి 'నాది' నుంచి బయటపడటం తేలికవుతుంది. సుప్రసిద్ధ హాలీవుడ్ హాస్యనటుడు ఛార్లీఛాప్లిన్ నటించిన

ఓ ఆంగ్ల చిత్రం ఈ అంశాల్ని అద్భుతంగా తెరకుఎక్కించింది. చలన చిత్రమాధ్యమం ద్వారా ఈ ఆధ్యాత్మిక అంశాల్ని గొప్పగా ఆవిష్కరించింది. ఆ చిత్రంలో ఛాప్లిన్ ఒక సోమరి. పగలంతా జులాయిగా తిరిగి, చీకటి పడేవేళకు ఏదోఒక పార్కులోని సిమెంటు బల్లపై ఆదమరచి నిద్రించడం అతడికి నిత్యకృత్యం. ఓ రోజు అలాగే బారెడు పొద్దెక్కేక నిద్రలో మునిగిన అతనికి లయాత్మకమైన బాజాల సందడితో మెలకువ వస్తుంది. కళ్లు తెరిచి చూసేసరికి దూరంగా ఒక మిలటరీ బృందం కవాతు చేస్తూ కనపడుతుంది. ఆ బృందంలోని మొదటి దళం సరిగ్గా తన దగ్గరకు వచ్చిన వెంటనే సైనికవందనం చేసేసరికి ఛాప్లిన్ ఆశ్చర్యపోతాడు. రెండోదళం తనను సమీపించి తిరిగి వందనం చేయటం చూసి మొహమాటంతో లేచి కూర్చుంటాడు. తక్కిన సైనికదళాలకు తాను లేచి నిలబడి ప్రతివందనం చేస్తాడు. ఈ కార్యక్రమం జరిగినంతసేపూ అయోమయంగా యాంత్రికంగా ప్రతిస్పందించిన ఛాప్లిన్ - సైన్యం వెళ్ళిపోయాకా తీరిగ్గా కూర్చొని ఏం జరిగిందని ఆలోచిస్తాడు. చుట్టూ పరికిస్తాడు. తాను ఏ బెంచీ మీద ఇంతవరకు పడుకొన్నాడో - సరిగ్గా అది అమెరికాకు అధ్యక్షుడిగా పనిచేసిన అబ్రహాంలింకన్ శిలావిగ్రహాన్ని ఆనుకొని ఉన్నట్లు గ్రహిస్తాడు. వారంతా గౌరవవందనం చేసింది తనకు కాదని, తన వెనకగల అబ్రహంలింకన్‌కని గ్రహిస్తాడు. తాను చేసిన ఘనకార్యమల్లా ఆయన విగ్రహం ముందున్న బల్లను ఆశ్రయించడ మేనన్న సత్యాన్ని గుర్తిస్తాడు.

ఈ కథలోని అంతరార్థాన్ని గ్రహించినవారికి - "పలికెడిది భాగవతమట పలికించు విభుండు రామభద్రుండట" అనడంలో పోతన ఆంతర్యం చక్కగా అర్థం అవుతుంది. "నా నాలికపై నుండి నానా సంకీర్తనలు, పూని నాచే పొగడించితివి" అంటూ అన్నమయ్య స్వామిని కీర్తించడంలోని ఆర్తి పరిచయం అవుతుంది. దాని అనంతరస్థితిని

సాక్షీభూతస్థితిగా చెబుతారు. ఏదీ మనది కానిదే అనే ఎరుక స్పష్టమైనప్పుడు – సాక్షీభూతస్థితి కలుగుతుంది. అక్బర్ పాదుషా తాన్‌సేన్‌ల కథ దాని గురించి చక్కగా వివరించింది. "ఏదీ మనది కానిదే" అనే అవగాహన మనసులో స్థిరపడిన వ్యక్తులకు కర్మలకు, లీలలకు మధ్యతేడా తెలుస్తుంది. కర్మఫలం అందకుండా మనుగడను లీలామయంగా మలచుకోవడం చేతనవుతుంది. తాన్‌సేన్ గురువు సంత్ హరిదాస్ ఈ లోకానికి వివరించింది అదే! కృష్ణుడు బోధించిన కర్మయోగం అదే!

గంధర్వ గాయకుడు తాన్‌సేన్ పరమాద్భుతగానం విని, మురిసిపోయిన అక్బర్ పాదుషా ఒకసారి అడిగాడట "అయ్యా! మీరు జగదేకగాయకులు. సంగీతసాగరులు. మీకింత గాత్రమాధుర్యం ఎలా లభ్యమైంది? మీ విజయరహస్యం ఏమిటి?" అని. దానికి బదులిస్తూ "జహాపనా! ఇదంతా మా గురుదేవుల కరుణాకటాక్షం. వారి దివ్య అనుగ్రహ విశేషం చేత ఈ విద్య నాకు అలవడింది" అని తాన్‌సేన్ వినమ్రంగా బదులిచ్చాడు. వారి ప్రతిభలో సహస్రాంశం కూడా తనకు లేదన్నాడు.

రసజ్ఞుడైన అక్బర్ వెంటనే "అయితే మీ గురువుగారిని మొగలాయి దర్బారుకు ఆహ్వానించండి. ఘనంగా సత్కారాలు చేసి పంపుదాం" అన్నాడు. తాన్‌సేన్ నవ్వి "ప్రభూ! మా గురువులు ఎలాంటి సన్మానాలు ఆశించరు. వారే దర్బారులను సందర్శించరు. మనం పిల్చినా వారు రారు" అంటూ తన గురువు సంత్‌హరిదాస్ ప్రత్యేకతను వివరించాడు. అక్బర్‌కు పట్టుదల పెరిగిపోయి – ఏమైనాసరే, ఆ గురువు పాట విని తీరాలన్నాడు. దాంతో ఇద్దరూ మారువేషాలలో బయలుదేరి ఎక్కడో ఒక పల్లెలో, పాడుబడ్డ గుడిలో ఒంటరిగా కూర్చుని గంధర్వ గానార్చన నిర్వహిస్తున్న హరిదాస్‌ని సందర్శించారు. ఆయన పాట వినగానే

అక్బర్‌కు అది అతిలోక మనోహరమైన గానమని తెలిసిపోయింది. తాన్‌సేన్ పాటకీ, హరిదాస్ పాటకి చాలా తేడా ఉందని అర్థమైంది. ఆ ఆనందంలోంచి తేరుకున్నాక, పారవశ్యంలోంచి మేలుకొన్నాక అక్బర్ చక్రవర్తి తాన్‌సేన్‌తో "అవును. తమరు చెప్పింది నిజమే – అక్షరాలా! మీ గురువుగారి విద్యతో పోలిస్తే, మీ ప్రతిభ చాలా సాధారణమైనదిగా అనిపిస్తోంది. మీ గానమే అద్భుతం అనుకుంటే – మీ గురువుగారిది పరమ లోకోత్తరమైనదిగా తోస్తోంది. మరివారి గాత్రవిద్య, ఆ ప్రతిభ మీకు పూర్తిగా ఎందుకు దక్కలేదు? మీరిద్దరికీ తేడా ఎక్కడుంది?" అని అడిగాడు.

ఎన్నోసార్లు అడిగించుకున్నాక, తాన్‌సేన్ వినయంగా నమస్కరించి సన్నని ఎలుగుతో సమాధానం చెప్పాడు. "ఏలినవారు అనుగ్రహించాలి. మా గురుదేవుల గాత్రవిద్య నాకు సిద్ధించడం అసాధ్యం! అంతటి విద్య నాకెలా పట్టుపడుతుంది? నేను కేవలం ఢిల్లీశ్వరుణ్ణి మెప్పించడం కోసం పాడుతున్నాను. మరి ఆయనో...! సాక్షాత్తూ ఆ జగదీశ్వరుణ్ణి తృప్తిపరిచేందుకు గానం చేస్తున్నారు. మా ఇద్దరి మధ్య చాలా తేడా ఉండి తీరుతుంది" అన్నాడు.

భగవద్గీతలో ఫలాపేక్షరహితమైన కర్తవ్యనిర్వహణ గురించి, నిష్కామకర్మ గురించి శ్రీకృష్ణుడు చాలా అద్భుతంగా ప్రవచించాడు. తానే యుద్ధం చేస్తున్నానని కాకుండా, తన ద్వారా స్వధర్మనిర్వహణ లేదా క్షత్రియధర్మనిర్వహణ జరుగుతోందని ఎలా గ్రహించాలో అర్జునుడికి ఆయన బోధించాడు. సర్వధర్మాలను పరిత్యజించి శ్రీకృష్ణుని చరణారవిందాలను ఆశ్రయించి, ఫలాపేక్షరహితంగా యుద్ధాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించడం ఎలాగో గీతాచార్యుడు చెప్పాడు. ఎదురుగా కనపడిన గురువులు, బంధువులు, మిత్రులు వారందరినీ తన చేతులతో సంహరించలేనని, ఆ పాపం మూట గట్టుకోలేనని, ఆ నెత్తురుకూడు

భుజింపలేనని, వికలమైన మనసుతో కూలబడిన అర్జునుడికి – ఆ జగద్గురువు కర్మయోగాన్ని వివరించాడు. జయాపజయాలను, లాభనష్టాలను, సుఖదుఃఖాలను సమానంగా భావిస్తూ – ఒకానొక పవిత్ర యజ్ఞంలా యుద్ధాన్ని నిర్వహిస్తే పాపాన్ని పొందవు – అని ఆయన అర్జునుణ్ణి ప్రోత్సహించాడు.

ఇక్కడ కృష్ణుడు నిర్వహించిన పాత్రను మనం సరిగ్గా అర్థం చేసుకుంటే – ప్రపంచంలోనే ఉత్తమోత్తమైన స్ఫూర్తిదాతగా ఆయన దర్శనమిస్తాడు. ఇప్పటికే భగవద్గీత అనన్య సామాన్యమైన ప్రేరణగాను, విజయసాధనలో అపురూపమైన ఉత్ప్రేరకంగాను కోట్లాది మందికి తోస్తోందంటే – దానిలోని అంతర్లీనంగా సాగిపోయిన తీక్షణమైన మోటివేషన్ ప్రక్రియను మనం జాగ్రత్తగా పట్టుకోవాలి. యుద్ధం – యజ్ఞం లాంటిదంటున్నాడు – ఆ పరమాత్మ. ఇది మనం నిత్యజీవితానికి అన్వయించుకోవలసిన శాశ్వత సత్యం. 'నేను' 'నాది' అనే అహంకారాన్ని ఒదులుకోవడమే యజ్ఞం! ఏం చేసినా ఏది పొందినా 'న మమ' అనుకోవడమే యజ్ఞం. న మమ అంటే 'నాది కాదు' అని అర్థం. నిజానికి 'మన'వి అని మనం భావించేవేవీ మనవి కావు. ఇక్కడ యజ్ఞమంటే కర్మకాండ కాదు. యజ్ఞమంటే క్రియ కాదు. యజ్ఞమంటే ఒక భావన! అహంకార మమకారాదులను ఆహుతి చేసే ఒక మహోన్నతమైన త్యాగభావననే కృష్ణుడు చెప్తున్న యజ్ఞంగా మనం అర్థంచేసుకోవాలి. అన్నిటికీ ఆయనే కర్త. ఆయన సర్వకర్త అని గుర్తించాలి. ఆ ఎరుకతో కర్మలను ఆచరిస్తే అది యోగమవుతుంది. కర్మయోగమని కృష్ణుడు బోధించిన కర్మనిర్వహణాకౌశలంలో మనిషికి ఆకాంక్ష ఉండదు. ఏ కోరికా లేకుండా చేసిన కర్మ నిజానికి చాలా ఆనందాన్నిస్తుంది. ఆనందం 'కోసం' చేసేవి – కర్మలు! ఆనందం 'తో' చేసేవీ – లీలలు! కర్మలను – లీలలుగా మార్చేందుకే భగవద్గీత! మన జీవితాల్లోకి తొంగి చూసి

లోతుగా ఆలోచించినట్లయితే - మనకు అమితమైన ఆనందాన్నిచ్చిన కర్మలన్నీ ఏ ఆకాంక్షలూ లేకుండా చేసినవేనవి మనకే తెలుస్తుంది. అవతలివాడు కృతజ్ఞత చెప్తున్నాడా లేదా అన్నది కూడా పట్టించుకోకుండా మనం ఏదైనా సహాయం చేస్తే కలిగే అనిర్వచనీయమైన సంతృప్తిని ఒకసారి గుర్తుచేసుకోండి. ఏ కోరికా లేకుండా భగవంతుణ్ణి గూర్చి నిశ్చలంగా ప్రార్థన చేసిన సందర్భాలలో మనకు లభించిన అమోఘమైన దివ్యానుభూతిని మనసులోకి తిరిగి తెచ్చుకోండి. అప్పుడు ఎలాంటి ఆకాంక్ష ఫలాపేక్ష లేకుండా నిర్వహించిన కర్మలు మనకు ఎంతటి ఆనందాన్నిచ్చాయో గుర్తొస్తుంది. కర్మలకు, లీలలకు తేడా తెలుస్తుంది. ఆ తేడాను తెలుసుకోవడం కోసమే మనం తాన్‌సేన్ కథను గుర్తుచేసుకున్నాం. ఏవేవో పొందాలన్న ఆరాటం, ప్రభువులను మెప్పించి పదవులను సాధించాలనో ప్రతిష్ఠను ఆర్జించాలనో ఆకాంక్ష - తాన్‌సేన్‌గాత్రానికి నేపథ్యం. ఎలాంటి ఆరాటమూ లేని ఆనందమయ నిష్కామ స్వరార్చన సంత్ హరిదాస్‌ది. కనుక గురువుగారి గాత్రంలోని అతిలోక మాధుర్యం ఆనందానుభూతి తాన్‌సేన్‌కి దక్కడం అసంభవం. తనకే లేనిది తాన్‌సేన్ శ్రోతలకి ఎలా పంచగలడు? కనుక హరిదాస్ పాటలోని తీపి ఆయన శిష్యుడి గాత్రంలో లోపించిందని అక్బర్‌కి తెలిసిపోయింది.

కోరికలతో మనం కర్మలు చేస్తుంటాం. కోరికలు లేనివాడి ద్వారా కర్మలు నిర్వహించబడతాయి. మనం చేయడానికీ, మనద్వారా జరగడానికీ మధ్య అదొక్కటే తేడా. ఆకాంక్షతో కర్మ చేసినవాడు బద్ధుడవుతాడు. లేకుండా చేసినవాడు బుద్ధుడవుతాడు. నేనే చేస్తున్నాను - అని అనుకుంటూ గానీ, ఏవేవో కోరికలతో గానీ కర్మలు చేసేవారంతా ఆ కర్మఫలానికి బద్ధులవుతారు. వాటికి సంబంధించిన పాపపుణ్యాలు వారి ఖాతాలోనే జతపడతాయి. అలా కాకుండా ఇది నా ద్వారా

జరుగుతోంది. దీనికి కర్త ఆ పరమేశ్వరుడు అనే భావనతో కర్మలు ఆచరిస్తే ఆ మనిషి బుద్ధుడౌతాడు. కర్మఫలానికి దూరమవుతాడు. వాటికి సంబంధించిన పాపపుణ్యాలతో ఆ మనిషికి ప్రమేయం ఉండదు. కర్మణ్యేవ అధికారస్తే... శ్లోకానికి తాత్పర్యం ఇదే. ఫలితాలను ఆశించకుండా, సర్వం శివార్పణం అనుకుంటూ కర్మ ఆచరణానికి సిద్ధం కమ్మని ఆ జగద్గురువు అర్జునుడికి బోధించాడు. ఈ కీలకాన్ని ప్రతి మనిషి బాగా అర్థం చేసుకోగల్గితే జీవితమే ఒక యజ్ఞంగా పరిణమిస్తుంది. అలా జీవించడమే స్వర్గమంటే! స్వర్గం అనేది వేరే ఏ లోకాల్లోనో లేదు. అది మనలోనే ఉంది. మన అంతర్యంలోనే అది దాగి ఉంది. మనకి ఇష్టమైన జీవితం గడిపినంతకాలం మనం స్వర్గంలో ఉన్నట్లు లెక్క. అది లేనప్పుడంతా మనకి నరకమే!

ప్రసిద్ధ తత్త్వవేత్త జాన్‌పాల్ సార్త్రే ఈ తేడా గురించి చెప్తూ "మనం కానిదానిగా ఉండటమూ, అయినదానిగా ఉండకపోవడమూ రెండూ నరకమే!" అన్నాడు. "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" అని కృష్ణుడు వివరించడంలో రహస్యం ఇదే. అర్జునుడు క్షత్రియుడు. యుద్ధం అతని స్వధర్మం. యుద్ధం చెయ్యడమే అతనికి అయినపని. అదే అతనికి స్వర్గం. గెలిస్తే రాజ్యం దక్కుతుంది. లేదా స్వర్గం దక్కుతుందని కృష్ణుడు స్పష్టంగా చెప్తున్నాడు. ఎందుకని? స్వధర్మాచరణకు సంసిద్ధుడైనా, నిష్కామకర్మాచరణకు సంసిద్ధుడైనా అర్జునుడికి దక్కేది తప్పకుండా దివ్యానంద అనుభూతి మాత్రమే. అదే స్వర్గం. సార్త్రే చెప్పిన ప్రకారం చూసినా - అతనికి 'అయినవి' కూడా ఆ రెండే. అయినదానిలో ఉండటమే స్వర్గం. మనిషి అంతర్యంలోని అసలు స్వభావం - అతడు చేసే పనులతో ఏకీభవించడమే సుఖమనీ, మనిషి తన అసలు స్వభావాన్ని అనుసరించి, పరిపూర్ణంగా ఎదగడమే స్వర్గమనీ, మరో ప్రసిద్ధ తత్త్వవేత్త ప్లేటో చెప్పిన వివరణ కూడా సరిగ్గా అదే చోటికి దారితీస్తుంది. "చేస్తున్నది

నీవు కాదు. దీని ఫలితం నీది కాదు. నీ అసలు స్వరూపం, స్వభావం ఏమిటో, నీ స్వధర్మం ఏమిటో గ్రహించి ఆ ప్రకారం చేయడమే నీ సుఖానికి దారి" అనేది కృష్ణుడి బోధ. ఆధ్యాత్మికప్రగతికే కాదు. వ్యక్తిత్వవికాసానికి సైతం దోహదకారి – ఇది!

మన ప్రాచీన వాఙ్మయాన్ని ఇలా అధునాతన అభివ్యక్తితో అర్థం చేసుకోగల్గితే – మనకు వేరే విదేశీ వ్యక్తిత్వ వికాస గ్రంథాలతో పని అంటూ ఉండదు. నిజం! ఇన్నేళ్లుగా మన సాహిత్యాన్ని ఆ దృష్టితో చూడకపోవడం వల్ల దానిపై మనకు గురి కలగడం లేదు.

ఉదాహరణకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, రచయిత శివఖేరా రచించిన ప్రసిద్ధ గ్రంథం "యు కెన్ విన్" అట్టపై ఓ వాక్యం ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. "విన్నర్స్ డోన్ట్ డు ది డిఫరెంట్ థింగ్స్ దే డు ది థింగ్స్ డిఫరెంట్లీ" అంటాడాయన. విజేతలు మనకన్నా విభిన్న పనులేవీ చేయరుగాని మనం చేసే పనులనే మనకన్నా విభిన్నంగా చేస్తారని దాని తాత్పర్యం. అయితే మన కవి సమ్రాట్ విశ్వనాథసత్య నారాయణ ఇదే భావాన్ని ఇంతకన్నా అందంగా చెప్పారు తమ రామాయణ కల్పవృక్షంలో! రాముడట – "అందరివలె మాట్లాడడు, అందరివలె చేయడు ఏది ఐనను, తన ఆత్మను ఒలుకబోసిన చందంబున పలుకుసేయు సర్వము తానై" అన్నారాయన. శివఖేరా – విశ్వనాథల వాక్యాలను బేరీజువేసి చూస్తే – ఏది మెరుగైనదో మనకే తెలిసిపోతుంది "పొరుగింటి పుల్లకూర రుచి" అని మన పెద్దలు ఊరికే అన్నారా!

# 11. లోపలి గాయాల ప్రభావం

మనిషిప్రవర్తనపై అతని జన్యువుల ప్రభావం ఏ మేరకి ఉంటుందో సైన్సు గొప్పగా నిరూపించింది. జీన్స్ మనిషిస్వభావాన్ని శాసిస్తాయి. ప్రవర్తనని నియంత్రిస్తాయి. ఆలోచనలను ప్రభావితం చేస్తాయి. ఆఖరికి శరీరపు రంగును సైతం నిర్దేశిస్తాయి. ఇదే సందర్భంలో మరో తీవ్రమైన విషయాన్ని మనం గుర్తుచేసుకోవాలి. మనిషి గర్భస్థశిశువుగా ఉన్నసమయంలోను, ప్రసవ సమయంలో పురిటికందుగా ఎదుర్కొన్న సవాళ్ళు కూడా – మనిషి ప్రవర్తనను నిర్దేశిస్తాయి. వాటినే 'చైల్డ్ హుడ్ ట్రామాస్' అని పిలుస్తున్నారు. వాటి ప్రభావం చాలా తీవ్రమైనది మాతృగర్భంలో ఉండే శిశువు ఎంత సుకుమారంగా, సెన్సిటివ్‌గా ఉంటుందో సైన్సు నిరూపించింది. గర్భిణిగా ఉండే సమయంలో తల్లి అగచాట్లకి, అవమానాలకి లోనయితే ఆ ప్రభావం పుట్టబోయే బిడ్డపై తప్పనిసరిగా ఉంటుందని, ఆ బిడ్డ అంతరాంతరాల్లో ఎక్కడో ఆ గాయం ముద్రపడి ఉంటుందని, పెరిగి పెద్దవాడయ్యాకా అతడు అసాంఘిక కార్యకలాపానికి గాని, దౌర్జన్యాలకు గాని పూనుకోవడానికి తల్లి కెదురైన, లేదా తానెదుర్కోన్న ఈసడింపులే కారణమని సైన్సు నిరూపించింది. గర్భిణిగా ఉండగా స్త్రీని మనం అవమానించినా, చులకనగా చూసినా, సూటిపోటు మాటలన్నా – ఒక భావిపౌరుడు పెద్ద దుర్మార్గుడయ్యేందుకు కృషి చేసినవారం అవుతామన్నది తిరుగులేని నిజం. అలాగే ప్రసవం సమయంలో తల్లినిగాని, పసికందును గాని, ఎవరైనా – విసుక్కున్నా, చీదరించుకున్నా కూడా అది ఆ బిడ్డస్వభావంపై తీవ్రపరిణామం చూపిస్తుంది. ప్రతి శిశువుజననమూ ఒక అద్భుతమే! భగవంతుడికి మనిషి మీద నమ్మకం ఇంకా చచ్చిపోలేదని దాని అర్థం. జీవిని ఈ భూమిపైకి మోసుకుని తీసుకొస్తున్న పుణ్యమూర్తిగా నీళ్ళాడిన స్త్రీని మనం ఆదరించాలి. ప్రేమగా చూడాలి. ఆమెకు ఆత్మీయతను పంచాలి.

"స్త్రీకి గౌరవవాచకం ఇల్లాలయితే, ఇల్లాలికి గౌరవవాచకం తల్లి" అని మర్చిపోకూడదు. మాతృత్వం అనేది మగువ జీవితంలో మర్చిపోలేని, అనిర్వచనీయమైన అనుభూతి. కోటి సంపదల పెట్టు. కనుక భగవంతుడి ప్రతిరూపం మన మధ్యకు వచ్చేటప్పుడు ఆ బిడ్డకు, ఆ బిడ్డను తన కడుపులో పెట్టుకుని భద్రంగా కాపాడిన తల్లికి – ఈ జాతి ప్రణామాలు చేసేది. ఆప్యాయంగా చూసుకునేది. ఆమె గదిలో ఆహ్లాదకరమైన వాతావరణం, అందమైన వర్ణచిత్రాలు అమర్చేది, అడిగినవన్నీ తెచ్చి తినిపించేది, కోరిన కోరికలు తీర్చమని సంఘం భర్తను ఆదేశించేది. భార్య కడుపుతో ఉన్నప్పుడు భర్త ఆమెను మరింత ఒద్దికగా, ఆత్మీయంగా చూసుకునేవాడు. భయానకదృశ్యాలు, హారర్ సీరియళ్ళు జోలికి పోకుండా అమ్మలు కాబోయే అమ్మాయిలు మంచి సంగీతం వింటూ, చక్కని సినిమాలు చూస్తూ ఉల్లాసంగా గడిపేందుకు తమవంతు ప్రయత్నం చేసేవారు. ఇదంతా దేనికి? అంటే – పుట్టబోయేవాడి సంస్కారాలు ఉన్నతంగా భాసించేందుకు! వాడు సత్పౌరుడిగా ఎదిగేందుకు! తనకూ తన వంశానికి పేరుతెచ్చే సద్గుణసంపత్తిని ఆ బిడ్డ పొందేందుకు!

కనుక తల్లి అవడం గాని, తల్లిదండ్రుల హోదాని పొందడం గాని – ఆషామాషి వ్యవహారం కాదు. ఎంతో శ్రద్ధగా, నైపుణ్యంగా, బాధ్యతతో నిర్వహించవలసిన ఒక పవిత్ర కర్తవ్యం. ప్రతి మనిషి తన పితృఋణం తీర్చుకునే గొప్ప ప్రక్రియ. తండ్రి అయిపోవడం అనేది – ప్రమాదవశాత్తూ జరిగిన అనుకోని సంఘటన కాకూడదు. కావాలని కోరి ప్రార్థించి పొందవలసిన ఒక గొప్ప హోదా అది. భాగ్యం అది. కలయిక అంటే – గర్భం ఆశించి చేసే పని అన్నది – ధర్మశాస్త్రాల నిర్దేశం. శ్రీకృష్ణుడు సంతానంకోరి తపస్సు చేసినట్లు భాగవతం చెబుతోంది. దశరథుడు సంతానంకోసం పుత్రకామేష్టియాగం నిర్వహించాడు రామాయణంలో! పిల్లల పెంపకం విషయంలోను తగుజాగ్రత్తలు అవసరమంటుంది

భారతీయ సారస్వతం. సైన్సు సైతం దాన్ని గట్టిగా సమర్థించింది. భాగవతంలోని ప్రహ్లాదుడి కథలో సారాంశం అదే!

ప్రహ్లాదుడు కడుపులో ఉన్న సమయంలో తన భార్య లీలావతిని విడిచిపెట్టి, హిరణ్యకశిపుడు అడవులకు వెళ్ళి తపస్సుకి కూర్చున్నాడు. అదే సమయంలో దేవేంద్రుడు ఆమెను చెరబట్టి సురలోకానికి తరలిస్తుండగా నారదుడు అడ్డుపడి ఆమెను ఆశ్రయానికై తన ఆశ్రమానికి తీసుకెళ్ళాడు. ఒక గర్భిణిని కంటికి రెప్పలా ఎలా చూసుకోవాలో ప్రత్యక్షంగా చేసి చూపించిన ఆ మహర్షిని భాగవతం వర్ణించింది. పరమ ప్రశాంతమైన ఆశ్రమవాతావరణంలో గడిపిన లీలావతి పండంటి బిడ్డకి జన్మనిచ్చింది. ఇదే సమయంలో ఆమె రాక్షసగణం మధ్య గడిపి ఉంటే – ప్రహ్లాదుడి స్వభావంలో అంతటి సాత్త్వికస్థితి, సౌమ్యత అలవడే అవకాశం లేదనేది సైన్సు నిరూపిస్తున్న విషయం. తల్లి చేస్తున్న భగవన్నామసంకీర్తన, నారదుడి నోట వింటున్న దైవలీలలు, ఆశ్రమంలో తింటున్న సాత్త్వికాహారం, కంటున్న ఆహ్లాదకరమైన పరిసరాల ప్రభావం ప్రహ్లాదుడి స్వభావంపై తీవ్రమైన ప్రభావం చూపించాయి. అంటే హిరణ్యకశిపుడి జన్యువుల ప్రభావతీవ్రతను – నారదమహర్షి ఆశ్రమవాతావరణం చక్కదిద్దింది. అదుపు చేసింది. గర్భిణీస్త్రీలకు ప్రశాంత సుందరమైన పరిసరాల్లో ఉంచాలనేది అందుకే! ఎలాంటి తండ్రికి ఎలాంటి బిడ్డ పుట్టాడో, దానికి కారణాలేమిటో మనం అర్థం చేసుకోవాలనే ఈ కథ మనకి ఇవ్వబడింది.

ఇంతటి సత్త్వగుణసంపన్నుడు, గొప్ప దైవభక్తుడు అటు విష్ణువుకి, ఇటు దేవతలకి ప్రీతిపాత్రుడైన ప్రహ్లాదుడు – దేవతలకి వ్యతిరేకంగా ఘోరయుద్ధం చేసి భయంకరమైన హింసకు కారణమయ్యాడంటే – మనం నమ్మం. కాని జరిగింది. దేవతలకి ప్రహ్లాదుడు సాక్షాత్తూ నరకం

చూపించాడు. క్రూరంగా ప్రవర్తించాడు మరి దీనికి కారణం ఏమిటి అయి ఉంటుందో చూద్దాం!

హిరణ్యకశిపుడు ఇంట లేని సమయంలో నిండుచూలాల్ని దేవేంద్రుడు చెరబట్టి లాక్కుపోయాడని చెప్పుకున్నాం! అదిగో అప్పుడు జరిగిన అవమానం ప్రహ్లాదుడి మనసులో లోపలి పొరల్లో (ఇన్నర్ హార్ట్) ఎక్కడో గాయం చేసిందన్నమాట. లీలావతి సాధారణ స్త్రీ కాదు. హిరణ్యకశిపుడి పట్టమహిషి. అలాంటి స్త్రీని ఒక పరాయివాడు చేయిపట్టి లాగి అవమానిస్తే ఆ తల్లి ఎంత క్రుంగిపోయి ఉంటుంది? ఒక రాజపత్ని స్థాయికి అది ఎంతటి పరాభవం! అదిగో ఆ అవమానభారం, తల్లి పట్ల జరిగిన అకృత్యం గర్భస్థశిశువుపై తప్పకుండా ప్రభావం చూపిస్తుందనేది – సైన్సు నొక్కి చెప్తోంది. ఎక్కడ అణచివేత ఉంటుందో అక్కడ తిరుగుబాటు ఉంటుంది. ఇది సామాజికన్యాయం. ఎక్కడ అవమానం జరుగుతుందో అక్కడ ప్రతీకారం రేగుతుంది. అది వ్యక్తిగతన్యాయం. ప్రతీకారం తీర్చుకోలేని బలహీనుడైతే మనసులోనే కుతకుతలాడిపోయి, జీవితమంతా వ్యధతోనే గడిపి నిస్సహాయంగా మరణిస్తాడు. ఈ లోకంలో చాలా మంది విషయంలో జరిగేదదే! బలవంతుడి దౌర్జన్యానికి బలైపోయిన బలహీనులు చేసేదేం లేక కడుపుమంటతోనే నిస్సహాయంగా కాలం గడిపి, నిట్టూర్పులతో మరణిస్తారు. ప్రహ్లాదుడు బలహీనుడు కాదు. కనుక తన తల్లికి జరిగిన అవమానానికి చాలా ఏళ్ళు గడిచాకా తగినంత స్థాయిలో తన ప్రతీకారం తీర్చుకున్నాడు. తగు విధంగా తీర్చుకున్నాడు. అక్కడితో పగ సమసిపోయింది.

పగ అనేది కట్టె చివర పుట్టిన నిప్పులాంటిది. క్షమతోనో వేరే రకంగానో దాన్ని ఆర్పకపోతే కట్టె తగలబడిపోతుంది. ఈ వేళ మనుషుల అధికరక్తపోటులకు, గుండెజబ్బులకు, తీవ్ర అనారోగ్యాలకు ఇలా కడుపులో దాచి పెట్టుకున్న పగలు, ద్వేషాలు, కోపాలు, కక్షలు… ఇవే

కారణాలు. మనిషిని మరణానికి చేరువ చేసే అల్సర్లకి వేరేవేవో కావు – ఇవే, ఇవే కారణాలు! కనుక మనం మందులు వాడవలసింది అల్సర్లు తగ్గడానికి కాదు – వాటికి కారణమవుతున్న కోపతాపాలకి నివారణ చూసుకోవాలి. లేకపోతే అడవిలో పుట్టిన దావాగ్ని అడవినే దహించినట్లు మనిషిలో పుట్టిన మంట మనిషినే దహిస్తుంది. దీపం ఆర్పేస్తుంది.

గర్భస్థ (ఏంబ్రియో) స్థితిలో గాని, పసితనపు నిస్సహాయస్థితిలో గాని అయిన గాయాలు (చైల్డ్‌హుడ్ ట్రామాస్) ఎంతటి తీవ్ర పరిణామాలకు దారితీస్తాయో తెలుసుకోవడానికి మనకి ప్రహ్లాదుడి కథ ఉపకరిస్తుంది.

మన పురాణగాథలను ఈ తరహా ఆధునిక దృక్పథంతో మనం ఆస్వాదించవలసిన అవసరం ఈ రోజుల్లో మరీ ఎక్కువగా కనపడుతోంది. భారతీయ ప్రాచీనవాఙ్మయాన్ని చిన్నచూపు చూస్తున్న రోజులివి. “పాతచింత కాయపచ్చడి”గా ఈసడిస్తున్న కాలమిది. కాబట్టే అధునాతన శాస్త్రీయదృక్పథంతో (SCIENTIFIC APPROACH) ఆ కథల్లోని అంతరార్థాలను గ్రహించవలసి ఉంది. అందుకు ఒక బలమైన ఉదాహరణ – ఈ ప్రహ్లాదుడి కథ.

నేటి ఆర్థిక అవసరాలరీత్యా భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేయవలసిన అగత్యం ఏర్పడి ఉంది. దాంతో సంతానం విషయంలో తగినంతగా సమయం కేటాయించలేక తల్లిదండ్రులు వారితో అటు నిర్లక్ష్యంగానో, ఇటు గారాబంగానో వ్యవహరిస్తున్నారు. అలాంటి సందర్భాల్లో పెంపకం కారణంగా పిల్లల్లో అభద్రతాభావం పెరిగి, వారు హానికరమైన పౌరులుగా ఎదుగుతున్నారు. అసాంఘిక శక్తులుగా మారుతున్నారు. దానికి బాధ్యత వహించవలసింది తల్లిదండ్రులే! కాబట్టి అలాంటివారంతా తప్పక అధ్యయనం చేయవలసినది – భాగవతంలోని ప్రహ్లాదుడి కథ!

# 12. కృష్ణతులాభారం

ఆంధ్రులు అల్లారుముద్దుగా అతిగారాబంగా చూసుకొనే కావ్యనాయిక – 'సత్యభామ'. ఆంధ్రనాట్యం, కూచిపూడి వారి ధర్మమా అని ఈమె కలాపమంతా తెలుగునాట మారుమ్రోగింది. అయితే ఈమె రూపురేఖలు కోపతాపాలు ప్రస్ఫుటంగా చిత్రించిన మహాకవి నంది తిమ్మనగారు. ఆయన రచించిన 'పారిజాతాపహరణము' పంచకావ్యాల్లో పంచదారచిలక. ఆయన ముక్కు పారిజాతపరిమళాలను ఆఘ్రాణించింది. ఆ సౌరభాలు గాలికి ఎగిరిపోకుండా మాటల్లోనే వాటిని బంధించి మధురకావ్యాన్ని ఆయన సంతరించారు" అన్నారు ప్రముఖ పరిశోధకులు ఆరుద్ర (సమగ్ర ఆంధ్రసాహిత్యం, రెండవ సంపుటి).

నందితిమ్మన పుణ్యమా – అని మనకు సత్యభామసౌందర్యం, ఆభిజాత్యం, స్వాభిమానం... వంటి లక్షణాలతో పరిచయం ఏర్పడింది. చక్కని శృంగార రసాధిదేవతగా ఆమెను చిత్రించాడు తిమ్మన. ఆయా సందర్భావసరాలను బట్టి అష్టవిధనాయికల్లోని "కలహాంతరిత" (తొలుత పతిని అవమానపరచి దరిమిలా పరితపించే నాయిక)గాను, "స్వాధీన పతిక (తన గాఢమైన ప్రేమానురాగాలతో భర్తను స్వాధీనం చేసుకొన్న నాయిక)గాను ఎంతో ముచ్చటగా తీర్చిదిద్దాడు. ఫలితంగా పారిజాతాపహరణం ఒక రసమహితమైన ప్రబంధంగా రూపొందింది.

స్వర్గలోకంలోని పారిజాతవృక్షాన్ని భూమికి తీసుకురావడం, పుణ్యకవ్రతం అనే రెండూ... ప్రధానఘట్టాలుగా ఈ కావ్యం ఆవిర్భవించింది. మొదటిదానిలో వీర అద్భుతరసాలను, సుకుమారమైన విప్రలంభశృంగారాన్ని అమోఘంగా ఆవిష్కరించిన నంది తిమ్మన – రెండో ఘట్టంలో కపట నాటక సూత్రధారిగా శ్రీకృష్ణుణ్ణి, దానికి వంతపాడుతూ తన వంతు పాత్రను అద్భుతంగా పోషించిన

నారదమహర్షిని మనకు గొప్పగా పరిచయం చేశాడు. ఆ నెపంతో కొన్ని ఆధ్యాత్మికసందేశాలను నేర్పుగా అందించాడు.

పారిజాతవృక్షం - కల్పతరువుల్లో ఒకటి. అది దేవలోకాల్లోని సమస్త సౌభాగ్యాలకు, సకల సంపదలకు, సర్వ శుభాలకు దోహదకారి. దివ్య జీవనసంస్కారానికి సూత్రధారి. ఆ సౌభాగ్యాన్ని, సంస్కారాన్ని భూలోకానికి పరిచయం చేయాలన్నది నారదమహర్షి సంకల్పం. నిత్యపరిమళభరితం, శుభప్రదం అయిన పారిజాతకుసుమాన్ని మనలోకానికి తీసుకురావడంలో నారదుడి ఆంతర్యం - భూలోక వాసులకు మేలుచేయడంగా మనం భావించవచ్చు.

నేరుగా ఆ పుష్పం సత్యభామకు చేరి ఉంటే - నారదమహర్షి ఆశయం సత్వరం నెరవేరి ఉండేది. ఎందుకంటే ఆమెది భూదేవి అంశ. ఆమె ద్వారా దేవతలకు లభ్యమైన దివ్యజీవనసౌభాగ్యం భూమ్మీద ఆవిర్భవించి ఉండేది. అయితే ఆ దివ్యకుసుమం లక్ష్మీదేవి అంశతో జన్మించిన రుక్మిణికి చేరింది. సత్యభామఅలుకకు కారణమైంది. పారిజాతాన్ని దక్కించుకోవాలన్న తీవ్రమైన ఆకాంక్ష - వాస్తవానికి సత్యభామది కాదు. అది భూలోకవాసులందరి ప్రగాఢమైన కోరిక. దాన్ని సత్యభామ తుదకు ఆగ్రహంగా మార్చేందుకు నారదుడు ప్రయత్నించాడు. కలహాన్ని కల్పించాడు. కృష్ణుణ్ణి కదిలించాడు. స్వర్గానికి పరుగులు పెట్టించాడు. పారిజాతవృక్షాన్ని నేలకు దించాడు. భూలోకంలో దివ్యజీవనవైఖరికి ప్రోత్సాహాన్ని అందించాడు. మానవచైతన్యాన్ని ఊర్ధ్వదిశగా మళ్ళించేందుకై తపన చెందాడు. ఆ క్రమంలో, ఆ ప్రయత్నంలో నారదమహర్షిని లోకం అపార్థం చేసుకొంది. తంటాలమారిగా, కలహకారిగా ముద్రవేసింది. అది వేరే సంగతి.

నారదుడి ప్రయత్నానికి సత్యభామ యథాశక్తి సహకరించింది. కలహాంతరితగా, స్వాధీనపతికగా అవతారాలు దాల్చింది.

పారిజాతాపహరణంలో కీలకపాత్ర పోషించింది. భర్తను వేధించింది. లక్ష్యాన్ని సాధించింది. ఆరుద్రమాటల్లో చెప్పాలంటే పారిజాత దివ్యపరిమళాలను నంది తిమ్మన నాసికను సోకేలా చేసింది. అందుకే ఆంధ్రుల అభిమానకావ్యనాయికగా లోకంలో స్థిరపడింది.

భాగవతంలోంచి కొంత, హరివంశంలోంచి మరికొంత కథాభాగాలను స్వీకరించి నంది తిమ్మన 'పారిజాతాపహరణం' రచించాడు. సత్యభామ శ్రీకృష్ణుడి శిరస్సును కాలితో 'తొలగంద్రోచిన' వైనం మూలంలో లేదు. నారదుడు తెచ్చి ఇచ్చిన పారిజాతపుష్పాన్ని తనకు కాకుండా రుక్మిణికి ఇచ్చాడని సత్యభామ అలిగింది. ఆమెను అనునయించాడు కృష్ణుడు. "నేను రుక్మిణీదేవిమందిరంలో ఉండగా పారిజాతం నా చేతికి అందించాడు నారదమహర్షి. దాంతో నేను ఆ పుష్పాన్ని రుక్మిణికి ఇచ్చాను. అదొక్కటి నేను చేసిన అపరాధం" అని మాత్రమే అన్నాడు మూలంలో శ్రీకృష్ణుడు. కాని నందితిమ్మన మరో అడుగు ముందుకు వేసి. నాయిక చేత తన్నించాడు. అరణపుకవిగా ఆయన లక్ష్యం వేరు. కృష్ణరాయలవారికి, తిరుమలదేవికి మధ్య జరిగిన చిన్న ఘర్షణను నివారించేందుకై, తిరిగి వారి మధ్య సమోధ్య కుదిర్చేందుకై నంది తిమ్మన ఆ కల్పన చేశాడని వ్యాఖ్యాతలు వివరించారు.

"తిమ్మన వ్రాసినది లోకములోని ఒక గొప్ప ఇంటిలో జరిగెడి వ్యవహారము. సామాన్యసంసారపు కథ. భార్య ఏదో అడిగినది, భర్త తెచ్చి పెట్టినాడు. దానికి సంబంధించిన ఒక పండుగ జరిగినది" అన్నారు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ - పారిజాతాపహరణాన్ని సమీక్షిస్తూ!

అయితే తిమ్మన చేసిన కల్పనలోని నాటకీయత లోకాన్ని ఆకర్షించడాన్ని ఆధునిక కవులు గ్రహించారు. మరో అడుగు ముందుకు వేసి చొరవగా "కృష్ణతులాభారం" అనే ఉదంతాన్ని కల్పించి, సత్యభామ

నగలతో తూచలేకపోయినది, రుక్మిణి భక్తితో సమర్పించిన తులసిదళం సాధించినట్లుగా కథను పొడిగించారు. శృంగార రస ప్రధానమైన కావ్యానికి ఆధ్యాత్మిక అత్తరు పరిమళాలను పులిమారు. 'శ్రీకృష్ణతులాభారం' పేరుతో నాటక, చలనచిత్ర రంగాలకు విస్తరించారు. వారితో ముత్తరాజు సుబ్బారావు అగ్రగణ్యులు. దాంతో తులాభారం వృత్తాంతం – పారిజాత అపహరణంతో సమానమైన ప్రాచుర్యాన్ని సాధించింది. అంతేకాదు, డబ్బుతో ధర్మాన్ని కొనుగోలు చెయ్యడం సాధ్యం కాదని నిరూపించడానికే కృష్ణతులాభారం కథ మనకి ఇవ్వబడిందన్న అభిప్రాయానికి బీజం వేసింది.

ధర్మ, అర్థ, కామాలు చతుర్విధ పురుషార్థాలలో మొదటి మూడును. వీటి విషయమై లోకంలో ఒక పొరపాటు జరుగుతోంది. అర్థ కామాలనేవి ధర్మం మీద ఆధారపడి నడవాలి. అది సరైన విధానం. అంటే – ధర్మం పునాదిగా అర్థ కామాలు నిలబడాలి. కాని అర్థ కామాల కోసం అవసరమైతే ధర్మాన్ని విడిచిపెట్టేయడం అనే పొరపాటు ఈనాడు లోకంలో అలవాటు అయిపోయింది. డబ్బు సంపాదించేస్తే దానితో ధర్మంతో సహా దేన్నయినా కొనుగోలు చెయ్యవచ్చుననే భ్రమ మనలో వ్యాపించి ఉంది. బాగా డబ్బు కూడబెట్టి – ఆ తర్వాత తీరిగ్గా కొన్ని ధార్మికమైన కార్యక్రమాలు చేపడితే "పుణ్యం, పురుషార్థమూను" – అనే ఆలోచన మనం చాలామందిలో గమనిస్తూంటాం. "డబ్బుతో చాలావాటిని కొనగలం గాని అన్నింటినీ కొనలేము" – అనే వాక్యం మనం వల్లించడానికే తప్ప – ఆచరించడానికి ఇష్టపడేది కాదు, అంగీకరించడానికి ఇష్టపడేది కాదు.

డబ్బుతో దేన్నయినా కొనవచ్చునని మనం పొరబడినట్లే సంపదతో దేన్నయినా తూచగలమని సత్యభామ గర్వపడింది, పొరబడింది. తీరా చేసి, తన దగ్గరున్న అపార ధనరాశులన్నింటినీ కుప్పలుగా పోసినా –

అవి కృష్ణుణ్ణి ఏ మాత్రం తూచలేకపోయాయి. ఇల్లంతా గాలించి ఎక్కడెక్కడో దాచిన సంపదలన్నీ తెచ్చి పరిచారికలు త్రాసులో పోసారు. అయినా సరిపోలేదు. దేహం మీద ఉన్న సొమ్ములను కూడా విడిచిపెట్టేయడానికి సత్య సిద్ధపడింది. అయితే ఇక్కడ రహస్యం ఏమంటే – ఆవిడ విడిచిపెట్టవలసినవి – దేహం మీద సొమ్ములు కాదు. దేహం లోపలివి! అహంకారం, అతిశయం, దురభిమానం. ఇలాంటి వాటిని సంపదలు మాదిరిగా ఆమె గుండెల్లోపల దాచి పెంచి పోషించింది. అదిగో వాటిని విడిచిపెట్టవలసిన సమయం వచ్చింది. అందుకూ కృష్ణుడి నాటకమంతా! ఇది కృష్ణతంత్రమే కాదు, జనాకర్షకమంత్రం కూడా!

ఒకవైపు త్రాసులో కూర్చున్నవాడు నిజానికి గోపాలుడు కాదు. అక్కడ కూర్చున్నది ధర్మం! ధర్మమే ఆయన రూపంలో అక్కడ ఉంది. ధర్మాన్ని అర్థంతో తూచడం ఎన్నటికీ సాధ్యమయ్యే విషయం కాదు. ధర్మం యొక్క బరువు ముందు అంతటి సంపద వెలవెలపోయిందంటే మరి – ధర్మం గొప్పదా? అర్థం గొప్పదా? ధర్మాన్ని అర్థం అనుసరించాలా? లేక అర్థాన్ని ధర్మం అనుసరించాలా? ఏది ముందు నడవాలి? ఏది వెనుక నడవాలి? – అది తేల్చి చెప్పేందుకే – కృష్ణతులాభారం కథ మనకి ఇవ్వబడింది.

అక్కడికీ నారదుడు చెప్తూనే ఉన్నాడు. "కామిత సిద్ధిదాయకుడు, అనంతుడు, అచ్యుతుడు – ముజ్జగాలను బొజ్జలో దాచిన సాక్షాత్తూ ఆ దేవదేవుడే ఈ రూపంలో కూర్చుని ఉన్నాడు, ఆయనను తూచడం నీకు సాధ్యం కాదమ్మా" అని చిలక్కి చెప్పినట్లు చెప్పాడు. సత్యభామ వాటిని వినిపించుకోలేదు. ఆవిడ చేసిన పొరపాటు ఏమిటంటే – ఆ దేవదేవుణ్ణి తన మొగుడిగానే చూసింది గాని, తన మొగుడిలో ఆ దేవదేవుణ్ణి చూడలేదు. దేవుడే తనకు మొగుడయ్యాడని గుర్తించనూ లేదు. కనుకనే ఆ సమయంలో మొగుడి బరువునే తూస్తున్నాననుకుంది గాని – ఆ

దేవుడి బరువును తూచవలసి వస్తుందని అనుకోలేదు. అదిగో అక్కడ తేడా వచ్చింది.

ఇదే విషయాన్ని నారదుడు ముందే వివరించినా అప్పుడు వినిపించు కోకుండా 'నువ్వు నన్ను మోసం చేసావు' అని నారదుడి మీద విరుచుకుపడింది. ధూర్తుడివి, మోసగాడివి, వంచకుడివి అని నిందించింది. నారదుడు ఆమెకు స్పష్టంగా వివరించాడు. "చతుర్దశ భువనాలను బొజ్జలో ఉంచుకున్న భగవంతుడిని ధన, ధనేతరాలెన్నున్నా వాటితో తూచడం సాధ్యం కాదని నేను ముందే హెచ్చరించాను. అయినా నువ్వు తెలుసుకోక – "ఈ సత్యభామ సంపదతో కోటిమంది కృష్ణులను కొనగలన"ని ప్రగల్భాలు పలికావు. ఇప్పుడు నన్ను నిందించి ప్రయోజనం ఏముంది?" అని ప్రశ్నించాడు.

"అవును. నేను అలా అన్నమాట నిజమే. అజ్ఞానం కొద్దీ అన్నానే అనుకోండి, జ్ఞానులు మీరు వివరించవద్దా" అని సత్యభామ ఎదురుదాడికి దిగింది.

నిజానికి సత్యభామది ఈ విషయంలో అజ్ఞానం కాదు. అహంకారం. మనిషిలో అహంకారానికి దారితీసే లక్షణాలను మన పెద్దలు వివరించారు. రూపం, సిరి సంతానం, విద్య, అధికారం... వీటివల్ల అహంకారం పెరుగుతుంది. ఈ లక్షణాలలో ఏ ఒక్కటి ఉన్నా చాలు – అది మనిషిలో గర్వానికి కారణమవుతుంది అని పెద్దలు చెప్పారు. ఈ మాట నిజమో కాదో మనం ఒక్కసారి గుండెల మీద చెయ్యి వేసుకుని ఆలోచిస్తే తెలుస్తుంది. అలాంటిది సత్యభామ విషయంలో ఆమెకు మొదటి రెండూ భారీగా సమకూరాయి. దానికి ఫలితమే ఈ అహంకారం. ఈ అహంకారమే నారదుడి మాటల్లోని సత్యం ఆమె చెవికెక్కకుండా అడ్డం పడింది. దేవదేవుణ్ణి తేలిగ్గా తూచగలననుకుంది. ఆయనదేమైనా తనకు తెలియని బరువా? – అనే ఆలోచనకు చోటిచ్చింది. ఆయన కేవలం

ఆమె మొగుడైతే తన అపారధనరాశులతో భర్తని తూచగల్గేదేమో కాని, ఆయన జగదీశ్వరుడు. ఆయన కేవలం పతిదేవుడు కాదు – పతి అయిన దేవుడు. సాక్షాత్తూ ధర్మస్వరూపుడు. ధర్మాన్ని సంపదలతో తూచడం సాధ్యం కాదని మనం ముందే చెప్పుకున్నాం. కాబట్టి తులాభారం విఫలమైంది. ధర్మం బరువుకి సత్యభామ సంపదలేకాదు. ఈ లోకంలోని సమస్త సంపదలూ కలిపి తూచినా సరితూగజాలవని లోకానికి రుజువైంది... కృష్ణుడు సత్య చేజారిపోయాడు. తులాభారం కథ ఈ రకంగా ముగిసింది. నంది తిమ్మన మాత్రం తులాభారం జోలికి పోలేదు. నాటకంలోని విషయం ఇదంతా!

నారదుడి సంగతి వేరు. దేవుడే సేవకుడైనా – ఆ సేవకుడిలోనూ దేవుణ్ణే చూడగల వివేకవంతుడాయన. సంపదల కన్నా ధర్మం చాలా గొప్పదని ఆయనకు బాగా తెలుసు. అంతేకాదు, ఈ విషయంలో ధర్మం ఆయనను వరించింది. అనుసరించింది. కనుక ధర్మస్వరూపుడైన కృష్ణుడు ఆయనకు దాసుడైనాడు. అనుచరుడైనాడు. "త్రాటికే కాదు నామాటకూ కట్టుబడి ఉండాలి. అలా ఉంటావా? ఉండవా!" అని నారదుడు అడగ్గానే అంగీకారంతో కృష్ణుడు తల ఊపాడు. "నీవు ఇక నావాడివి. అవునా కాదా" – అనగానే 'అవునని' స్పష్టంగా చెప్పాడు.

ఎప్పుడైతే కృష్ణుడు తనకు లోబడ్డాడో, వెంటనే నారదుడు ఆంక్షలను అమలు చెయ్యడం ఆరంభించాడు. "సత్యాదేవీ! నీవు అతనితో మాట్లాడరాదు. తాకరాదు. అగ్నిసాక్షిగా పంచభూతాల సాక్షిగా, నాకు ఆయనను ధారపోశావు. కనుక ఇక తప్పుకో" అని సత్యభామను శాసించాడు.

కృష్ణుడు దేవుడనే ఎరుకను ఏమాత్రమూ విస్మరించలేదు గాని – ఆయన నాటకంలో తనవంతు పాత్రను సక్రమంగా పోషించడానికై

నారదుడు – తన ధోరణిలోకి కొంత నాటకీయతను ప్రవేశపెట్టాడు. సాక్షాత్తు కృష్ణుడితో ప్రదక్షిణాలు చేయించాడు. పరిహాసంగా పరిచర్యలు చేయించుకొన్నాడు. తన చేతిలోని వీణను, కమండలాన్ని ఆఖరికి జపమాలను సైతం కృష్ణుడి చేత మోయించాడు. నారదుడి చర్యలన్నీ నాటకీయత కోసం మాత్రమే కాదు, కృష్ణుణ్ణి భక్తపరాధీనుడిగా నిరూపించడం కోసం కూడా! మొత్తంమీద, పుణ్యకవ్రతం, పతిదానంతో నంది తిమ్మన కథను సరిపెడితే. ముత్తరాజు సుబ్బారావు దాన్ని తులాభారంగానే పొడిగించి, ఆధ్యాత్మికతదిశగా మళ్ళించారు. ప్రజాదరణను సాధించారు.

# 13. అమరత్వసిద్ధి

మునలితనాన్ని నిరోధించడం ఎలా?...

మృత్యువును నిరాకరించడం ఎలా?...

– అనాదికాలం నుంచి మనిషిని వెంటాడుతున్న ప్రశ్నలివి. ముసలితనాన్ని మృత్యులోగిలికి మునివాకిలిగా పరిగణిస్తారు మనిషి. మహాభారతంలో యయాతి మహారాజు మాదిరి వృద్ధాప్యాన్ని వాయిదా వేయడం ఎలా... అనే విషయమై ప్రపంచంలో ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఎలన్‌మాస్క్ వారీ పేజ్ జెఫ్ బెజోస్ మార్క్ జుకెర్ బర్గ్... వంటి ప్రపంచ కుబేరులు ఆ పరిశోధనలపై వేలకోట్లు వెచ్చిస్తున్నారు. "వృద్ధాప్యంపై మనిషి యుద్ధం" అనే అంశంపై ప్రసిద్ధ హార్వర్డ్ విశ్వవిద్యాలయం మొదలు – అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ వరకు ఎన్నో సంస్థలు ఆలోచనల్లో నిమగ్నమై ఉన్నాయి. "ప్రాజెక్టు దీర్ఘాయువు" అనే పేరుతో అధ్యయనాలు సాగిస్తూ ఉన్నాయి. ముసలితనం గుట్టు తెలిస్తే మరణాన్ని నివారించడం సాధ్యం అవుతుందని మనిషి నమ్మకం. తొలుత మలిసంధ్యను నిలువరించి తదుపరి మరణాన్ని సవాలు చేయాలన్నది మనిషి ఆలోచన. దీనంతటికి ముఖ్యకారణం – మృత్యువు మనిషికి ఆగర్భశత్రువు కావడమే! ఆ శత్రువును జయించాలంటే తొలుత శత్రుసైన్యాన్ని నిర్మూలించాలి. ఆ శత్రుసైన్యానికి నాయకత్వం వహించేది ముసలితనం. కాబట్టి మొదట దానిపై దాడి చేసి దాన్ని లోబరుచుకోవాలన్నది జాతీయ అంతర్జాతీయ సంస్థల ఆలోచన. అది లొంగితే అంతిమంగా అసలు శత్రువును... అంటే మృత్యువును ఎదిరించడానికి ఓ దారి దొరుకుతుందని మనిషి నమ్మకం.

మరణాన్ని జయించాలన్న మనిషి కోరికకు తొలిబీజాలు మనకు మహాభారతంలో దర్శనం ఇస్తాయి. మరణం లేకపోవడమంటే అమరత్వం,

లేదా అమృతత్వం. భారతం పేర్కొన్న 'మృతసంజీవనీ' విద్య అమరత్వ స్థితికి ఆదిమదశ. ఆ కోణంలో చూస్తే - మృత్యువును జయించాలన్న మనిషి ప్రయత్నాలకు తొలి విషయం "మృతసంజీవనీవిద్య" రూపంలోనే లభించింది. దానికి ఆద్యుడు శుక్రాచార్యుడు. వృషపర్వుడనే రాక్షసరాజుకు ఆయన గురువు. దేవదానవసంగ్రామాల్లో రాక్షసులు పెద్ద సంఖ్యలో మరణించడం చూసి, దానికి విరుగుడుగా శుక్రాచార్యుడు 'మృతసంజీవనీ' అనే విద్యను కనిపెట్టాడు. దాంతో యుద్ధంలో చనిపోయిన తన వారందరినీ ఆయన తిరిగి బతికిస్తూ ఉండేవాడు. ఇది దేవతలకు పెద్ద తలనొప్పిగా మారింది. ఆ విద్యను తామూ సాధిస్తే తప్ప రాక్షసులపై తమది పై చేయి అయ్యేయోగం ఉండదని వారికి తెలిసిపోయింది.

దేవతలగురువు బృహస్పతి. కచుడు బృహస్పతి కుమారుడు. ఆ గురుపుత్రుణ్ణి పిలిచి, శుక్రాచార్యుడికి శిష్యుడిగా చేరి, మృతసంజీవనీ విద్యను నేర్చుకొని రమ్మని దేవతలు అభ్యర్థించారు. కచుడు అంగీకరించాడు. అయితే ఇది దేవతల పన్నాగమని శుక్రుడు గ్రహిస్తే - తమ పాచిక పారదు. ఆ విద్యను కచుడికి బోధించడు. కాబట్టి ఏం చేయాలన్నది ఆలోచించారు.

శుక్రాచార్యుడి కూతురు పేరు దేవయాని. ఆమె తన తండ్రికి ఆరోప్రాణం. ఆమెపట్ల ఆయనకు అంతులేని మమకారం. కాబట్టి దేవయానిని ప్రసన్నం చేసుకోవడం ద్వారా శుక్రుణ్ణి లోబరుచుకోవాలని కచుడికి సూచించారు దేవతలు. ఆమె మాటను తండ్రి జవదాటడు కాబట్టి అదే సరైనదారి అంటూ సలహా ఇచ్చారు. దాంతోపాటు శుక్రాచార్యుణ్ణి భక్తితో సేవించడం ద్వారా కార్యసిద్ధికి మార్గం సుగమం చేసుకోమన్నారు. బృహస్పతి కొడుకు కాబట్టి కచుడు స్వయంగా, సహజంగానే బుద్ధిశాలి. దేవతల ఆంతర్యాన్ని కచుడు స్పష్టంగా

గ్రహించాడు. భక్తిశ్రద్ధలతో శుక్రుణ్ణి సంతృప్తిపరిచి మృతసంజీవనీవిద్యను సాధించి వస్తానని దేవతలకు హామీ ఇచ్చాడు.

సౌమ్యుడు, బుద్ధిమంతుడు అయిన కచుడి ప్రవర్తన శుక్రుణ్ణి ఆకట్టుకొంది. కచుడి మాటతీరు నియమవ్రతశీలం నచ్చాయి. కాబట్టి కచుణ్ణి శుక్రుడు శిష్యుడిగా స్వీకరించాడు. ఆశ్రమనియమాలకు తగ్గట్లుగా వ్యవహరిస్తూ, తన తండ్రి బృహస్పతితో సమానంగా భావిస్తూ కచుడు గురుశుశ్రూష చేస్తూ వచ్చాడు. క్రమంగా శుక్రాచార్యుడికి ప్రియశిష్యుడిగా, ఆంతరంగికుడిగా ఎదిగిపోయాడు.

ఇది దానవులకు నచ్చలేదు. అసలే దేవతల మనిషి కాబట్టి కచుడి పట్ల వారికి వైరభావం, ద్వేషం ఆది నుంచీ ఉన్నాయి. దానికి తోడు తమ కులగురువుకు కచుడు ఆత్మీయుడు కావడం వారికి మరింత కోపాన్ని కలిగించింది. కచుణ్ణి ఎలాగైనా మట్టుపెట్టాలని రాక్షసులు ఒక నిర్ణయానికి వచ్చారు. సమయం కోసం కాచుకొన్నారు. ఒకరోజు వారికి మంచి అవకాశం దొరికింది. ఆ రోజు కచుడు హోమధేనువులకు కాపలాగా ఒంటరిగా అడవుల్లోకి వెళ్ళాడు. వెంటనే రంగంలోకి దిగిన రాక్షసులు కచుణ్ణి చంపి వెళ్ళిపోయారు. సాయంత్రం అయింది. హోమధేనువులన్నీ ఇంటికి చేరాయి – కచుడు తప్ప!

దేవయాని ఆ విషయాన్ని గమనించింది. అప్పటికీ ఆమె కచుడిపై మనసుపడింది. అడవుల్లో ఏ జంతువుల వల్లో కచుడికి హాని కలిగి ఉంటుందని కంగారుపడింది. తండ్రిని పిలిచి సంగతి చెప్పింది. శుక్రుడు దివ్యదృష్టితో అసలు ఏంజరిగిందనేది గ్రహించాడు. దేవయానిని సంతోషపెట్టడం కోసం మృతసంజీవనీవిద్య ద్వారా కచుణ్ణి బతికించాడు. తిరిగి తన వద్దకు రప్పించాడు. ఇది రాక్షసులకు కంటగింపుగా మారింది. తాము కచుణ్ణి చంపినప్పుడల్లా శుక్రుడు తిరిగి బతికిస్తాడని తేలిపోయింది. కాబట్టి అసురులంతా కలిసి మరో మార్గం ఆలోచించారు. చివరకు

వారికో దారిదొరికింది. శుక్రాచార్యుడికి సురాపానమంటే పరమ ప్రీతి. కచుణ్ణి హతంచేయడంతో పాటు ఆ దేహాన్ని కాల్చిబూడిద చేసి, ఆ బూడిదను మద్యంలో కలిపి శుక్రుడి చేత తాగిస్తే – కచుడి పీడ విరగడై పోతుందని వారికి తోచింది. అదే వాస్తవానికి వారి కొంపముంచింది. తప్పనిసరిగా శుక్రుడు కచుడికి మృతసంజీవనీవిద్యను బోధించవలసిన అగత్యం ఏర్పడింది.

ముందు ఆలోచించిన పథకాన్ని దానవులు విజయవంతంగా అమలు చేశారు. కచుణ్ణి చంపి తగలబెట్టి, ఆ బూడిదను మద్యంలోకలిపి తమ గురువుకు తాగించడం ద్వారా ప్రణాళిక అనుకొన్నట్లే పూర్తి చేశారు. అయితే రాక్షసుల పథకం దేవయాని మంకుపట్టువల్ల బెడిసికొట్టింది. కచుడు కనపడకపోయేసరికి ఆమె యథావిధిగా తండ్రిని పరుగులు పెట్టించింది. దేవయానికి నచ్చచెప్పడానికి ఆయన పరిపరివిధాల ప్రయత్నించాడు. "రాక్షసులే సంహరించినా కచుడు ఉత్తమగతులను పొందుతాడు కాబట్టి నీవు వాని కొరకు విచారించడం తగదు" అన్నాడు. దేవయాని శాంతించలేదు. పెద్దపెట్టున ఏడవడం మొదలుపెట్టింది. కచుణ్ణి చూపిస్తే తప్ప ఆహారం ముట్టనని భీష్మించింది. తండ్రి ఎన్నిరకాలుగా బతిమాలినా ఆమె పట్టు విడిచిపెట్టలేదు. ఇక చేసేదేంలేక శుక్రుడు తన యోగదృష్టితో ముల్లోకాలను పరికించి కచుడి జాడ తెలుసుకొనే ప్రయత్నం చేశాడు. చివరకు తన కడుపులోనే భస్మమయుడై ఉన్నట్లు గ్రహించాడు. తన మద్యపానప్రీతికారణంగా జరిగిన అనర్థాన్ని గుర్తించాడు. దేవయాని పోరు పడలేక మరోసారి కచుణ్ణి బతికించాడు. ప్రాణాలను దక్కించుకొన్న కచుడు తాను బయటపడే మార్గం చూపించమని శుక్రుణ్ణి ప్రాధేయపడ్డాడు. దాంతో శుక్రుడికి ప్రాణసంకటం ఏర్పడింది. తన పొట్టన చీల్చుకొని బయటకురావడం తప్ప మరో మార్గం లేదు. కచుడు ఆ పని చేస్తే తాను మరణిస్తాడు.

తనను తిరిగి బతికించాలంటే కచుడికి మృతసంజీవని బోధించక తప్పదు. కాబట్టి శుక్రుడు రాజీపడ్డాడు. కడుపులో ఉండగానే కచుడికి ఆ విద్యను ఉపదేశించి, తిరిగి తనను బతికించమని ఆదేశించాడు. ఆ ప్రకారమే శుక్రుడి పొట్టచీల్చి బయటపడిన కచుడు తనకు గురువు అనుగ్రహించిన విద్యతోనే గురువును బతికించాడు. ఆ రకంగా కచుడికి మృతసంజీవనీ విద్య హస్తగతం అయింది. లక్ష్యం నెరవేరింది. కొన్నాళ్ళ తర్వాత శుక్రుడి అనుమతితోనే దేవలోకాలకి తిరిగి వెళ్లిపోవడానికి సిద్ధపడ్డాడు. అప్పుడు దేవయాని కచుణ్ణి నిర్బంధించబోయింది. తనను పెళ్ళాడవలసిందని బలవంతం చేయబోయింది. ధర్మవిరుద్ధమైన ఆమె ప్రతిపాదనను కచుడు తిరస్కరించాడు. శిష్యుడు కొడుకుతో సమానం శుక్రుడికి తాను కొడుకు వంటివాడు. కాబట్టి దేవయానిని వివాహం చేసుకోవడం దోషమని వారించాడు. ఆమె తీవ్ర ఆగ్రహంతో "మృత సంజీవనీ విద్య నీకు పనిచేయకుండు గాక!" అని శపించింది. అదంతా వేరే సంగతి. మనిషి తాను మరణించకుండా ఉండేందుకై మృతసంజీవనీ విద్యను సాధించడం అనేది అమృతత్వసాధనలో తొలిమెట్టుగా గుర్తించాలన్నదే పై కథలోని ప్రధానాంశం.

ఇంతాచేసి, మృతసంజీవనీవిద్యకు కొన్ని పరిమితులున్నాయి. అది యుద్ధాల్లో మరణించినవారికి ఉపయోగపడుతుందే తప్ప ముసలితనాన్ని గాని, మానవదేహం రోగగ్రస్తం కాకుండా ఉంచడంగాని దానివల్ల కాదు. అవసానదశలో మరణించిన వ్యక్తిని ఈ విద్యతో తిరిగి బతికించడం కుదరదు. అలా మరణించిన దేహం శిథిలంకాకుండా చేయడం ఈ విద్య వల్ల సాధ్యంకాలేదు. ఈ వివరాలన్నింటినీ మనకు భారతమే చెప్పింది.

ఈ నేపథ్యంలోనే మనిషి ఆలోచన మోక్షం దిశగా సాగింది. దాన్నే జన్మరాహిత్యస్థితిగా వేదాంతం చెబుతోంది. అంటే మనిషి జన్మపరంపరల

నుంచి పూర్తిగా విముక్తుడు కావడం! 'దుర్లభం' అని శంకరులు చెప్పిన మానవజన్మ-మరణావస్థకు చేరుకొనేలోగా ఈ దేహం సాయంతోనే ముక్తస్థితిని సాధించడం జీవితపరమార్థంగా పెద్దలు భావించారు. మానవజన్మను సద్వినియోగం చేసుకోవడమంటే అదేనని మనపెద్దల నిశ్చితాభిప్రాయం.

మహాభారతంలో ధర్మరాజు బొందితో స్వర్గానికి వెళ్ళాడు. అయితే ఆకాశగంగలో స్నానం చేసిన పిదప 'ఆత్మస్థితిని' పొందితే తప్ప ఆయన మహాప్రస్థానం పూర్తి కాలేదు. కచదేవయానికథ ద్వారా మృతసంజీవనీ విద్య గురించి వివరించిన మహాభారతమే ధర్మజుడి వృత్తాంతం రూపంలో ఆత్మస్థితి ఆవశ్యకతనూ బోధించింది. ఫలితంగా మానవశరీరం అశాశ్వతమని, ఆత్మ ఒక్కటే నిత్యమని, ఆత్మస్థితిలో మాత్రమే మోక్షప్రాప్తి సాధ్యమని మనిషి గ్రహించాడు. మృత్యువనేది కేవలం దేహానికి చెందినదనే సత్యం మనిషికి తెలిసిపోయింది. భాగవతం వినకపూర్వం పరీక్షిత్తు వేరు, శుకమహర్షి భాగవతాన్ని బోధించిన పిదప పరీక్షిత్తు వేరు. భాగవతాన్ని వినక పూర్వం ఒంటి స్తంభం మేడలో, సంపూర్ణ రక్షణ వలయంలో ఉన్నప్పుడు పరీక్షిత్తుది మనలాగే పూర్తిగా దేహసంబంధిత తాపత్రయం. భాగవతం మనసులోకి ఇంకిపోయిన తర్వాత ఆయనది ఆత్మస్థితి లేదా అమృతత్వస్థితి మృత్యువును జయించే దిశగా ఇది గొప్ప ముందడుగు. ఈ కథలను సంపూర్ణంగా అర్థం చేసుకొన్నవారంతా పరీక్షిత్తు మాదిరే మృత్యుభీతినుంచి బయటపడతారు. ధర్మరాజు మాదిరి ఆత్మస్థితిని పొందాలంటే మనిషి తొలుత చావుభయం నుంచి బయటపడాలి. మృత్యువును జయించడమంటే మృత్యుభయాన్ని జయించడమేనన్న పరమసత్యం మనసులో స్థిరపడాలి. మరణభయం అంతరించిన దరిమిలా ఆత్మజ్ఞానం దిశగా మనిషి ప్రయాణించడమే భారతీయతత్త్వచింతన బాపతు అంతిమలక్ష్యం. మనిషికి నిజంగా కావలసింది శుక్రుడు

సాధించిన మృతసంజీవనికాదు. ధర్మజుడు, పరీక్షిత్తు సాధించిన అమృతత్వస్థితి. వారికి దక్కిన ఆత్మస్థితి! ఎందుకంటే అది జరామరణాలకు అతీతమైనది కాబట్టి! మహాభారతం సందేశమే అది. అందుకే 'ధర్మజ యక్షసంవాదం'లో దీన్ని చర్చించింది. "లోకంలో అన్నింటికన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి?" అని అడిగాడు యక్షుడు. మహాభారతంలో ధర్మరాజుకు ఎదురైన యక్షప్రశ్నల్లో ఇదొక ముఖ్యమైనప్రశ్న. "తనకంటి ముందే ఇంతమంది చనిపోతుంటే చూస్తూనే ఉంటాడు కాని మనిషి. తానుమాత్రం శాశ్వతంగా ఉండిపోతానని అనుకొంటాడు. ఇది చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది" అని బదులిచ్చాడు ధర్మజుడు. ఆకాలంలోనేకాదు, ఇప్పటికీ మానవస్వభావంలో ఒకానొక ప్రధానమైన అంశమిది.

అలా అనుకోవడమే కాదు, అది నిజంకావాలని మనిషి ఏనాటినుంచో ప్రయత్నిస్తూనే ఉన్నాడు. దీన్ని మనం రెండు రకాలుగా విశ్లేషించుకోవాలి. పుట్టిన తర్వాత తనకు మరణమనేది లేకుండా శాశ్వతంగా జీవించాలన్న అభిలాష - మొదటి కోవలోది! అంటే మృత్యువును జయించడం! మహాభారతంలోని ఉదంకోపాఖ్యానంగాని, భాగవతంలోని క్షీరసాగరమథనాన్ని గాని మనం విశ్లేషిస్తుంటే, అవి "మరణాన్ని నివారించాలన్న మనిషి తపనకు ప్రతీకలు"గా గోచరిస్తాయి. 'పుట్టుకలేని స్థితి' ని సాధించాలన్నది రెండోకోవకు చెందిన ఆలోచన. పుట్టుక అనేదే లేకపోతే ఇక మృత్యువుప్రసక్తి రానేరాదన్నది ఈ ప్రయత్నంలోని ఆంతర్యం. "శ్రీ కైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్..." అనేది పోతన జీవితాశయం. దాని నిమిత్తమై భాగవతాన్ని తెలుగు చేసే పనికి పూనుకొన్నాడాయన "అలా చేస్తే నీవు భవబంధాలనుంచి విముక్తుడవుతావు" అని రాముడు హామీ ఇచ్చాడు. అంటే అది మోక్షస్థితి. దాన్నే జన్మరాహిత్యమనీ అంటారు. తిరిగి పుట్టుకలేక

పోవడమని దాని అర్థం. పారమార్థిక స్థితి గురించి ప్రాచీనుల ఆలోచనా విధానంగా దీన్ని మనం అర్థం చేసుకోవాలి. “జంతూనాం నరజన్మ దుర్లభం” అన్నారు వివేకచూడామణిలో శంకర భగవత్పాదులు. కాబట్టి దాన్ని సద్వినియోగం చేసుకొని మోక్షస్థితిని పొందాలని పెద్దలు సూచించారు.

పైకి లౌకికవాఙ్మయంగా... అంటే ఆధునిక జీవన వాస్తవికతకు అద్దంలా కనిపిస్తుందిగాని, మహాభారతంలోని ధ్వని మాత్రం స్పష్టంగా అలౌకికమే! మనం నిజాయితీగా ఆలోచిస్తే. ముసలితనాన్ని దరిచేర నివ్వరాదన్న మనిషి ప్రగాఢ ఆకాంక్షకు మూలకారణం యౌవనంలో అనుభవానికి వచ్చే సుఖభోగాలే! ముసలితనం ఆవరిస్తే ఇంద్రియ పటుత్వం జారిపోతుంది. సుఖానుభూతి పారిపోతుంది. నిస్సత్తువ దాపురిస్తుంది. కాబట్టే వృద్ధాప్యం పట్ల ఆంతర్యంలో మనిషికి అసహ్యం పేరుకొంటుంది. ఒక దశలో అది చావుకన్నా దుర్భరం అనిపిస్తుంది. కాబట్టి మనిషి ముసలాణ్ణి కాకూడదనుకొంటాడు. సుఖం అనేది ఇంద్రియాల ద్వారా మాత్రమే దక్కుతుందని నమ్ముతాడు. అదే పొరబాటు!

జఠరాగ్ని అంటే ఆకలి. అది అన్నంతో చల్లారుతుంది. కామాగ్ని అంటే కోరికల మంట. దాన్ని ఆర్పేకొద్దీ పెరుగుతూనే ఉంటుంది. అందుకే పెద్దలు కామాన్ని అరిషడ్వర్గంలో... అంటే శత్రుకూటమిలో చేర్చి దాన్ని జయించమని హితవు పలికారు. వాస్తవానికి ఆ శత్రు వర్గానికి నాయకురాలు ‘కామమే’ అని చెప్పడం కోసం దాన్ని మొదటనే పేర్కొన్నారు. కాబట్టి కామాన్ని అదుపు చేస్తే ముసలితనాన్ని అంగీకరించడం సాధ్యం అవుతుంది. వృద్ధాప్యాన్ని అంగీకరించిన స్థితికి చేరుకొంటే మృత్యువును ఆహ్వానించగలస్థితి చేతికొస్తుంది. ఈ పూవు నీ పూజ కోసం పూచింది. ఆలస్యం చేయకుండా స్వీకరించు...” అని గీతాంజలిలో విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ కోరికలోని అంతరార్థం

మనసులోకి ఇంకుతుంది. నిజం చెప్పాలంటే అదే జీవన్ముక్తి. ఆ ముక్తస్థితిలో ఉన్నప్పుడే మనిషి జీవిస్తున్నట్లు లెక్క, అంతవరకు గడుపుతున్నట్లు లెక్క. పై కథల్లోని సారాంశం ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి ముసలాడవకూడదు, పెద్దవాడవ్వాలి అంటే ప్రాజ్ఞుడవ్వాలి. అప్పుడే అమరత్వం సిద్ధిస్తుంది!

# 14. దేవయాని కథ

మహాభారతంలో కచుడు కాదని వెళ్ళిపోయాక, దేవయాని జీవితం ఏదిశగా సాగిందనేది ఆసక్తికరమైన విషయం. మనుచరిత్రలో వరూధినిని తిరస్కరించి ప్రవరుడు తన ఇంటికి వెళ్ళిపోయిన తర్వాత వరూధిని జీవితం మాయాప్రవరుడితో ముడిపడింది. ఆ విధంగానే దేవయాని యయాతి మహారాజును వివాహం చేసుకొంది. అంటే తన వలపు దిశను తానే మార్చుకొంది. కచుణ్ణి మర్చిపోయి యయాతిపై ప్రేమను పెంచుకొంది.

దేవయానికి వృషపర్వుని కూతురు శర్మిష్ఠ ఆప్తమిత్రురాలు. ఇద్దరూ ఒకరిపై మరొకరు స్నేహానురాగాలు కలిగినవారు. ఒకసారి వారు తమ చెలికత్తెలతో కలిసి జలక్రీడలకు ఉపక్రమించారు. ఇంతలో తీవ్రమైన సుడిగాలి రేగి, కొలను గట్టున పెట్టిన వస్త్రాలన్నీ కలగలసిపోయాయి. కంగారులో శర్మిష్ఠ పొరబాటున దేవయాని చీరను చుట్టబెట్టుకొంది. అక్కడ మిగిలినదల్లా ఇక శర్మిష్ఠ చీర ఒక్కటే. దాన్ని ధరించడానికి దేవయాని ఇష్టపడలేదు. ఇద్దరి మధ్యా వాదోపవాదాలు జరిగాయి. చిలికి చిలికి గాలివానగా మారాయి. ఆ కోపావేశంలో దేవయానిని ఒక పాడుబడ్డ బావిలోకి నెట్టి, శర్మిష్ఠ ఇంటికి వెళ్ళిపోయింది.

ఇంతలో నహుషుడి పుత్రుడైన యయాతి వేటకై వచ్చి, బావిలోంచి దేవయాని ఆర్తనాదాలు విన్నాడు. జాలిపడ్డాడు. తన కుడిచేతిని పొడుగ్గా చాచి, ఆమె చేతిని అందుకొన్నాడు. పైకిలాగి ఆమెను రక్షించాడు. “అలా యయాతితో నాకు పాణిగ్రహణం జరిగిపోయింది. కాబట్టి ఈ జన్మకు ఆయనే నా భర్త. మా ఇద్దరికీ నీవు వివాహం జరిపించు” అని తండ్రి శుక్రాచార్యుణ్ణి ఆమె ఒత్తిడి చేసింది. అంతేకాదు, రాచకన్య శర్మిష్ఠ తనకు దాసి కావాలని పట్టుపట్టింది. అంటే దేవయాని ఎంత మొండి మనిషో, ఆమెది ఏ స్థాయి అహంకారమో మనం అర్థం చేసుకోవచ్చు. ఆ అహంకారం ముందు – తండ్రి పట్ల భయభక్తులు,

రాజు పట్ల గౌరవాభిమానాలు, స్నేహితురాలి పట్ల గాఢ అనురాగం అన్నీ మటుమాయమై పోయాయి.

లోకంలోని ఆడపిల్లలు ఎలా ఉండకూడదో చెప్పాలంటే దేవయాని కథను వినిపించాలి. అంతేకాదు, ఆమె పంతానికి ప్రతిఫలంగా ఆమెకు సవతిపోరు సంప్రాప్తించింది. ఎందుకంటే దేవయాని కన్నా ముందే శర్మిష్ఠను యయాతి ఇష్టపడ్డాడు. పరిస్థితుల ప్రభావంతో ఆయన దేవయానికి భర్త అయ్యాడు. మరోవైపు శర్మిష్ఠ దాంపత్యజీవితానికి దూరమై దాసిగా కాలం గడుపుతోంది. ఈ దశలో వారిద్దరి మధ్యా వలపు చిగురించింది. దేవయానికి తెలియకుండా ఒక్కటయ్యారు. కాలక్రమంలో వారికి ముగ్గురు కొడుకులు జన్మించారు. అంతవరకు వారి గుట్టు రట్టు కాలేదు.

ఒకరోజు యయాతి మహారాజుకు సమీపంలో ఆ ముగ్గురూ ఆడుకొంటున్న సమయంలో దేవయాని అక్కడికి వచ్చింది. తన భర్త పోలికలను ఆ బాలురలో గమనించింది. అనుమానించింది. యయాతిని నిలదీసింది. యయాతి మౌనంగా ఉండిపోయాడు. దేవయాని తెలివిగా ఆ పిల్లలనే ప్రశ్నించింది. వారు నిజం చెప్పేశారు. ఇంకేముంది! అసలే మొండిఘటం... ఆపై భర్త చేసిన ద్రోహం... పైగా తన ప్రత్యర్థితో ఆయన కాపురం చేసి పిల్లల్ని కనడం... కాబట్టి ఎంత రచ్చ చేయాలో అంతా చేసింది. తండ్రి కాళ్లపై పడి కన్నీరుమున్నీరుగా విలపించింది. తనకు జరిగిన తీరని అవమానాన్ని సహించలేనని గట్టిగా చెప్పింది. ప్రతీకారం జరిపితీరాలంది.

శుక్రాచార్యుడు ఆగ్రహ ఆవేశాలకు లోనయ్యాడు. యయాతి ఎన్ని రకాలుగా బతిమాలినా పట్టించుకోలేదు. మాటను వినిపించుకోనే లేదు. తన కూతురికి జరిగిన అన్యాయాన్ని దృష్టిలోపెట్టుకొని "నీ కోడె వయసును కోల్పోయి తక్షణమే ముసలివాడివి అయిపోతావు" అని శపించాడు.

ఆ సమయంలో యయాతి ఒకానొక ధర్మసూక్ష్మాన్ని శుక్రుడి దృష్టికి తెచ్చాడు. రాజులకు బహుభార్యాత్వం నిషేధం కాదు. శర్మిష్ఠ ఋతుమతియై తనను సంతానానికై అభ్యర్థించింది. అలాంటి సందర్భాల్లో భర్త తిరస్కరించడం ధర్మంకాదు. ఒక వేళకాదంటే - అది భ్రూణహత్యాదోషం అవుతుంది. మరో ముఖ్యవిషయం ఏమంటే తనకు దేవయాని పట్ల అనురాగం నశించలేదు. విరక్తి జనించలేదు. ఇప్పుడు శుక్రుడి శాపం వల్ల తనకు జరాభారం ప్రాప్తించి నిర్వీర్యుడు అయితే అది దేవయానికి కూడా ఎంతో దుఃఖదాయకమైనదే అవుతుంది. అంటే శుక్రుడి శాపం తనకు మాత్రమే కాదు. ఆయన సొంతకూతురికి కూడా బాధాకరమైనదే అవుతుంది. కాబట్టి లోతుగా ఆలోచించి తనకు శాపవిమోచనం కలిగించాలి!

ఇది ధార్మికమైనదే కాదు, తార్కికమైన ప్రతిపాదన. తన శాపం తన కూతురికీ వర్తిస్తుందన్న సత్యాన్ని శుక్రుడు గ్రహించాడు. సత్యదర్శనంతో ఆయన కోపం శాంతించింది. శర్మిష్ఠ తనకు దాసి కావాలని, తనతోపాటు అరణంగా రావాలని, తన తండ్రి వృషపర్వుడికి దూరం కావాలని... దేవయాని హఠం చేయడమే - దీని అంతటికి మూలకారణమనే ఎరుక కలిసింది. ఇదంతా తనకూతురి స్వయంకృత అపరాధం. ఈ నేరానికి అల్లుణ్ణి శపించడం దోషం. వాస్తవానికి తన కుమార్తె కారణంగా మరో ఆడపిల్ల జీవితం నాశనం అయింది. ఆమె దాంపత్యానికి దూరమైంది. ఆ వయసులో... ఆ పరిస్థితుల్లో... శర్మిష్ఠ యయాతికి దగ్గరవడం సహజమైన విషయం. అల్లుడివాదన సమంజసం, ధర్మసమ్మతం, తర్కసహితం అని శుక్రుడికి స్పష్టంగా తోచింది. అల్లుడు చెప్పిందే సబబు అనిపించింది.

శుక్రుడు ఇంకేం సందేహించలేదు. తక్షణమే స్పందించాడు. యయాతికి శాపవిమోచనం కలిగించాడు. తన శాపం తిరుగులేనిది

కాబట్టి యయాతి జరాభారాన్ని ఆయన కొడుకుల్లో ఒకరు స్వీకరిస్తే యయాతి తిరిగి యౌవనవంతుడు అవుతాడు. అంతేకాదు దైహిక భోగాలను రాజసుఖాలను యథేచ్ఛగా అనుభవించి భోగానుభవాన్ని పూర్తి చేసుకొన్నాక – తిరిగి తన కొడుక్కి యౌవనాన్ని తిరిగి ఇచ్చేయ వచ్చునని శుక్రుడు నివారణోపాయాన్ని ప్రకటించాడు. అంతకన్నా ముఖ్యంగా యయాతి ముసలితనాన్ని స్వీకరించిన కొడుక్కే రాజ్యాన్ని కట్టబెట్టమని ఆదేశించాడు. ఆ కొడుకే వంశకర్త కాగలడని ఆశీర్వదించాడు. దేవయానిని వెంటతీసుకొని తన ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు.

శర్మిష్ఠ మూడవ కొడుకు పూరుడి యౌవనాన్ని స్వీకరించి యయాతి వేయి సంవత్సరాలు కోరిన సుఖాలను అనుభవించాడు. తృప్తి చెందాడు. తిరిగి కొడుక్కి యౌవనాన్ని బదిలీచేసి ముసలితనాన్ని గ్రహించాడు. పూరుడికి పట్టాభిషేకం చేశాడు. పూరుడు ధర్మసమ్మతంగా రాజ్యపాలన చేసి వంశకర్తగా చరిత్రలో నిలిచాడు. ఇదంతా నన్నయగారు ఆంధ్ర మహాభారతంలో చెప్పిన కథ.

లోగడ కచుడు తనను తిరస్కరించినప్పుడు దేవయాని అతడికి ఓ శాపం ఇచ్చింది. కచుడు అంత కష్టపడి నేర్చుకొన్న మృతసంజీవనీ విద్య కచుడికి ఉపయోగపడదన్నది ఆమె ఇచ్చిన శాపం. ఆ సందర్భంలో కచుడు సైతం ప్రతిశాపం ఇస్తూ – బ్రాహ్మణకన్య అయిన దేవయానికి మరో బ్రాహ్మణుడు భర్తగా రాడని శపించాడు. అది ఇప్పుడు ఒక రకంగా వరం అయింది. యయాతి క్షత్రియుడు. బ్రాహ్మణకన్యను తాను చేపట్టడం ధర్మవిరుద్ధమని భావించాడు. దేవయానిని వివాహం చేసుకోవడానికి వెనుకాడాడు. ఆ సమయంలో దేవయాని తనకు కచుడిచ్చిన శాపాన్ని వెల్లడించింది. పైగా "సర్వలోకపూజ్యుడైన నా తండ్రి శుక్రాచార్యుడి నోట ఇది ధర్మాతిక్రమణం కాబోదని చెప్పిస్తే నీవు నన్ను

స్వీకరిస్తావా?" అని యయాతిని అడిగింది. ఒప్పించింది. కూతురు పట్ల అతిమమకారంతో శుక్రుడు వారి వివాహానికి సమ్మతించాడు. దోషరహితం అవుతుందని వరమిచ్చాడు. ఇద్దరికీ వివాహం జరిపించాడు.

భగవద్గీత నాలుగో అధ్యాయంలో భగవానుడు పేర్కొన్న రాగభయక్రోధాలు మూడూ ఈ కథలో శుక్రుడి పట్ల రుజువయ్యాయి. ఆయన తన కూతురు మీద చూపించింది మితిమీరిన అనురాగం. దాని కారణంగానే శుక్రాచార్యుడు – మరో ఆడపిల్ల, అందునా తనకు ఆశ్రయమిచ్చిన రాజు కూతురు శర్మిష్ఠ పట్ల దేవయాని తీరని అపచారం చేస్తున్నా వారించలేకపోయాడు. కూతురి చర్యలను సమర్థించాడు. అయితే శర్మిష్ఠను దాసిగా పంపించడం వల్ల జరిగే పర్యవసానాన్ని ఊహించి భయపడ్డాడు. "నీవు దాసిగా మాత్రమే ఉండాలి" అని శర్మిష్ఠను, ''దేవయానికి ద్రోహం చేయకు సుమా!'' అని యయాతిని హెచ్చరించడానికి కారణం భయమే. అనుకోనిది జరుగుతుందేమోనన్న అనుమానంలోంచే కదా – భయం పుట్టేది! చివరకు ఆయన భయపడినట్లే జరిగింది. దాంతో శుక్రాచార్యుడు క్రోధావేశాలకు లోనై అల్లుడు యయాతిని శపించాడు. ఆ విధంగా రాగభయక్రోధాలు మూడూ ఆచార్యుడి విషయంలో రుజువయ్యాయి.

అహంకారమనేది ఈ కథలో ఒక ప్రధానాంశం. ముందుగా మనకు శర్మిష్ఠ అహంకారంతో పరిచయం అయింది. రాజుగారి కూతుర్ననే దురహంకారంతోనే ఆమె దేవయానిని నూతిలోకి నెట్టింది. ఫలితంగా ఆమెకు దాసీతనం సంప్రాప్తం అయింది. జీవితమంతా శర్మిష్ఠ దాసీగానే గడిపింది. చివర్లో పూరుడికి రాజ్యాధికారం దక్కడం వల్ల రాజమాత హోదాతో సరిపెట్టుకొంది.

రెండోది దేవయాని దురహంకారం. రాజగురువు కూతుర్ననే అతిశయం. దాని ఫలితమే శర్మిష్ఠ తనకు దాసీగా రావాలన్న షరతు!

అంటే దేవయాని తనకొంగున తానే చిచ్చు మూటకట్టుకొన్నట్లు – శర్మిష్ఠను దాసీగా తెచ్చుకొంది. భర్తతో ఆమె అనుబంధం గురించి తెలిసిన నాటి నుంచి తనకు దుఃఖమే మిగిలింది. తన దురహంకారం కారణంగానే యయాతి మహారాజుకు భార్య అయినా, అంటే రాజపత్ని అయినా, రాజ్యాధికారం మాత్రం తన సంతానానికి దక్కకుండా పోయింది. తాను రాజమాత కాలేక పోయింది. తాను బాధపడి తండ్రిని బాధపెట్టింది.

శుక్రుడి విషయంలో కూతురి పట్ల మమకారం మితిమీరి ఆమె చెప్పినట్లుగా ఆడవలసి వచ్చింది. అది తీవ్రమైన కోపంగా పరిణమించి అల్లుణ్ణే శపించే దుస్థితికి చేర్చింది. మొత్తంమీద శర్మిష్ఠ దేవయాని శుక్రాచార్యుల అహంకారాలు, కోపాలు చివరకు వారి దుఃఖానికి దారితీసాయి. సాంఖ్యయోగంలో గీతాచార్యుడు ప్రవచించిన – "క్రోధాద్భవతి... శ్లోకానికి ఉదాహరణప్రాయంగా నిలిచాయి. 'కర్తరిలో వేసిన అరటిగెలకు కంతులు తప్పవని'సూక్తి. కోపం ఆవరించిన స్థితిలో చేసే దుష్కార్యాలకు పరాభవం దుఃఖం తప్పవనేది ఇందులో నీతి.

"నన్ను పొందాలనుకొంటే మనిషి రాగ భయక్రోధాలను విసర్జించాలి" అని జ్ఞానయోగంలోని గీతాచార్యుడి హితబోధను శుక్రాచార్యుడు విస్మరించడంవల్ల కలిగిన అనర్థాలివి. శుక్రాచార్యుడు విద్వాంసుడు. పండితుడు ప్రతివాడూ జ్ఞాని కావాలని లేదన్నది ఆయన కథలోంచి గ్రహించవలసిన వాస్తవం! పాండిత్యం వేరు, జ్ఞానం వేరు. ఆ తేడా గురించి తెలియాలంటే ఒక ఉదాహరణ చెప్పుకోవాలి. 'బ్రాహ్మణ్యం' అనే మాట ఎక్కడెక్కడ ఎన్నెన్ని శాస్త్రాల్లో వినపడుతుందో, దాని గురించి ఎవరెవరు ఏయే నిర్వచనాలు ఇచ్చారో... తడుముకోకుండా చెప్పగలిగేవాడు పండితుడు. "బ్రాహ్మణ్యం'లో నిలిచేవాడు, దానితో కలిసినడుస్తూ స్వధర్మాచరణంలో పండిపోయేవాడు – జ్ఞాని! పాండిత్యంతో సరిపెట్టుకోకుండా జ్ఞానమూర్తులం కావాలన్నదే శుక్రాచార్యుడి నుంచి నేర్చుకోవలసిన పాఠం!

# 15. విశ్వామిత్రుడి పాత్ర

వాల్మీకి రామాయణం బాలకాండలో అహల్యాగౌతముల కొడుకు శతానందుడు మనకు విశ్వామిత్రమహర్షిని పరిచయం చేశాడు. లోకంలో మేనకావిశ్వామిత్రుల ఉదంతం ప్రసిద్ధికి ఎక్కినంతగా – ఆయన దీక్షాతపస్సులు పట్టుదల, ముఖ్యంగా రాముడి విషయంలో ఆయన నిర్వహించిన మహోన్నతమైన పాత్ర ప్రాచుర్యానికి నోచుకోలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే రామాయణంలో "విగ్రహవాన్ ధర్మః మూర్తీభవించిన ధర్మం" వంటి లోకోత్తరప్రశంసకు పాత్రుడైన రెండో మహనీయుడు విశ్వామిత్రుడు. మొదటివాడు అవతారమూర్తి శ్రీరామచంద్రుడు. విశ్వామిత్రుణ్ణి మనకు పరిచయంచేస్తూ శతానందుడు చెప్పిన "ఈయన తపస్సునే తపింపచేసినవాడు" అనే మాట ఒక్కటీచాలు. విశ్వామిత్రుడు ఎంతటివాడో మనకు తెలియడానికి! బాలకాండలో వసిష్ఠమహర్షి స్వయంగా "ఈయనకన్నా బుద్ధిమంతుడు, వీర్యవంతుడు తపశ్శాలి మరొకడు లేడు" అనడంకన్నా యోగ్యతాపత్రం ఏం కావాలి – విశ్వామిత్రుడికి...?

సీతారామకల్యాణం, లోకకల్యాణం అనేవి ఆయన పుట్టుకకు ప్రధాన లక్ష్యాలు. బ్రహ్మర్షికాక ముందు కౌశికుడిగా మహాపరాక్రమవంతుడిగా ఆయన రాజ్యపాలన సాగించాడు. విశ్వామిత్రుడు విలువిద్యాపారంగతుడు. తాటకవధ అనంతరం రాముడికి అస్త్రవిద్యను ఉపదేశించాడు. ఆ విద్య ధనుర్వేదానికి సంబంధించింది. ఋగ్వేదానికి ఆయుర్వేదం మాదిరే యజుర్వేదానికి ధనుర్వేదం ఉపవేదం. రుద్రుడు – ధనుర్వేదానికి అధిదేవత. ఆయన నుంచి క్రమంగా అస్త్రవిద్య విశ్వామిత్రుడికి సంక్రమించింది. అది "ఈశానసంహిత" పేరుతో త్రేతాయుగంనాటికి వ్యాప్తిలోకి వచ్చింది. (దరిమిలా పరశురాముడి ద్వారా ఆ విద్య 'శాండిల్యభాష్యం' పేరిట ద్వాపరయుగంలో ప్రసిద్ధికెక్కింది).

ఇక్కడే మనం మరో విషయాన్ని గమనించాలి. విలువిద్య అంటే ఇటీవల మనం చలనచిత్రాల్లో చూస్తున్న బాణాలు విసరడం ఒకటేకాదు. ఆ బాణం వంటి ఒక ఆయుధాన్ని శస్త్రం అంటారు. తాటకను రాముడు సంహరించింది శస్త్రంతోనే. శస్త్రాన్ని ఏదైనా ఒక మంత్రంతో అనుసంధానించి వదిలితే – అది అస్త్రప్రయోగం. రాముడు అస్త్రశస్త్ర విద్యాకోవిదుడు. ఆయనది కోదండవిద్య.

ఇంతకూ రాముడికి విశ్వామిత్రుడు – ఐంద్రం శైవం బ్రహ్మాస్త్రం నారాయణం గాంధర్వం మానసం – వంటి ఎన్నోరకాల అస్త్రమంత్రాలను ఉపదేశించినా, రాముడు సంతృప్తి చెందలేదు. వాటి ఉపసంహార విద్యనుసైతం తనకు నేర్పించమని అభ్యర్థించాడు. అస్త్రవిద్యలో సంధానం, ప్రయోగం, ఉపసంహారం అనే మూడు దశలుంటాయి. సాధారణ విలుకాడైతే మొదటి రెండింటితోనే సంతృప్తిపడిపోతాడు. కాని రాముడు పరిపూర్ణధనుర్విద్యావేత్త. ప్రత్యర్థి తనపై ఒక అస్త్రాన్ని ప్రయోగిస్తే – దానికి ప్రతిగా దేన్ని సంధించాలో ధనుర్వేత్తకు తెలియాలి. అంతేకాదు. అవసరమైతే తాను ప్రయోగించిన అస్త్రాన్ని వెనక్కి రప్పించడమూ తెలియాలి. ఉపసంహారం ఎలాగో తెలియకుండా అస్త్రప్రయోగం చేయడం – ఉత్తమ విలువిద్యావేత్తలక్షణం కాదు. ఈ మాట అన్ని విద్యలకు, శాస్త్రాలకూ సైతం వర్తిస్తుంది.

త్రేతాయుగంలో రాముణ్ణి, ద్వాపరంలో అర్జునుణ్ణి మాత్రమే లోకం 'జగదేక ధానుష్కులు'గా గుర్తించింది. రాముడి విషయంలో ఆ కీర్తికి, ఘనతకు మూలకారకుడు–ఒకే ఒక్కడు. ఆయనే విశ్వామిత్రుడు! రాముడికి అంతటి విద్యను నేర్పించాడంటే అదంతా ముందుగా ఆయన సాధించాడు కాబట్టే! ఎవరైనా తన దగ్గర ఉన్నదాన్నే కదా ఎదుటివారికి ఇవ్వగలిగేది. బల అతిబల మంత్రాలతో పాటు ధనుర్వేదాన్ని సంపూర్ణంగా సాధించి, వాటిని రాముడికి ఉపదేశించి లోకోత్తరవీరునిగా తీర్చిదిద్దిన

ఆచార్యుడు - విశ్వామిత్రుడు. వాస్తవానికి తాటకవధ కోసం ఆయన రాముడి సాయం కోరడమనేది ఒక నెపం మాత్రమే - ధనుర్విద్యను నేర్పించి రాముణ్ణి లోకకల్యాణం దిశగా నడిపించడమే విశ్వామిత్రుడి ఆంతర్యం!

శివుడి శిరస్సున చేరినందుకుకాదు, భూమిపై పారినందుకు ఫలితంగా జనం దప్పిక తీరినందుకు గంగాదేవికి పూజ్యత లభించింది. పిడకల్లో దాగినప్పుడు కాదు పైరుగా ఎదిగినప్పుడే విత్తనానికి ధన్యత చేకూరుతుంది. గర్వంగా అరుస్తున్నందుకు కాకుండా వర్షంగా కురుస్తున్నందుకు మబ్బుకు ఘనత దక్కుతుంది. అదే మాదిరిగా దశరథరాముణ్ణి – కోదండరాముడిగా తీర్చిదిద్ది అవతారలక్ష్యం దిశగా నడిపించినందుకు, రావణసంహారంతో దుష్టశిక్షణ శిష్టరక్షణ కర్తవ్యాల్లో రాముడికి ఉపయోగపడినందుకు మనం విశ్వామిత్రుణ్ణి కారణజన్ముడిగా సంభావించాలి.

అయితే ఇదంతా విశ్వామిత్రుడికి తేలిగ్గా లభించలేదు. ఒక సాధారణ పరిపాలకుడు కౌశికుడు - ఋషిగా మహర్షిగా దేవర్షిగా చివరకు బ్రహ్మర్షిగా మారిన క్రమమంతా వ్యక్తిత్వ వికాస తరగతుల్లో విలువైన పాఠ్యాంశం వంటిది. ఈ లోకాన్నంతటినీ తరింపచేస్తున్న 'గాయత్రీమంత్రద్రష్ట'గా మనకు విశ్వామిత్రుడు పూజ్యనీయుడు. పావన చరితుడు. దేవతలను సైతం విస్మయానికి గురిచేసిన తపోబలసంపన్నుడు "రాముడంటే ఏమిటో నాకు తెలుసు" అని బాహాటంగా ప్రకటించిన ఆ బ్రహ్మర్షిపాత్రను ఆధునికకవులు ఎందరో స్పష్టంగా గుర్తించారు "విశ్వామిత్రుడంటే ఏమిటో నాకు తెలుసు" అంటూ లోకానికి వివరించారు. అలాంటి ఆధునిక కవుల్లో అగ్రగణ్యులు - కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ!

వాల్మీకిరామాయణంలో సీతారామకల్యాణక్రతువు పూర్తయ్యాక, దశరథాదుల వద్ద వీడ్కోలు గ్రహించి, విశ్వామిత్రమహర్షి హిమాలయాలకు

వెళ్ళిపోయాడు. మిథిల నుండి మగపెళ్ళివారంతా అయోధ్యకు తిరుగు ప్రయాణమయ్యే సమయంలో పరశురాముడు రంగప్రవేశం చేసాడు. శివధనుర్భంగవిషయమై రాముడిపై పెను ఆగ్రహం ప్రకటించి, తనతో తెచ్చిన వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టవలసిందిగా నిర్బంధించాడు. ఆ నెపంతో వైష్ణవమహాతేజస్సును శ్రీరాముడికి ధారాదత్తంచేసి, తన అవతారభూమికకు స్వస్తి చెప్పాలన్నది పరశురాముడి ఆంతర్యం.

విశ్వనాథ సత్యనారాయణగారు ఇక్కడొక మార్పు చేశారు. రామాయణ కల్పవృక్షంలో పరశురామగర్వభంగం – సీతాకళ్యాణానికి ముందే వస్తుంది. సీతను చేపట్టేసరికే రాముణ్ణి వైష్ణవతేజస్సు ఆవహించిన సంపూర్ణ అవతారమూర్తిగా చూపించే ప్రయత్నం ఒకటే కాకుండా – విశ్వప్రణాళికకు సంబంధించిన ఒకానొక అవగాహన, తిరిగి దాన్ని రచనలో పొందుపర్చాలన్న ఒక్క చక్కని వ్యూహం – ఈ మార్పు వెనుక ఉన్నాయి. ఈ వ్యూహంలో విశ్వామిత్రుడు కేంద్రబిందువు. రాముడి విషయంలో విశ్వామిత్రుడు నిర్వహించిన పాత్ర సరిగ్గా అర్జునుడి విషయంలో శ్రీ కృష్ణుడు నిర్వహించిన తరహాది.

యాగసంరక్షణకై శ్రీరాముణ్ణి వెంట పెట్టుకుని వెళ్ళేందుకు విశ్వామిత్రుడు అయోధ్యకు వచ్చాడు. అంతవరకు రాముడు – చక్రవర్తి పెద్ద కుమారుడు. రాజాంతఃపురాలలో సుకుమారంగా పెరుగుతున్న అందాల రాకుమారుడు. ఆయన అలాగే పెరిగి పెద్దవాడయి, తండ్రి తదనంతరం నేరుగా రాజయి పరిపాలన సాగించి ఉంటే – రాముడి కథను పారాయణం చేయవలసిన అవసరం ఈ జాతికి ఉండేది కాదు. రాముడి కథను ఈ దశలో మలుపు తిప్పినవాడు విశ్వామిత్రమహర్షి. ఆయన ప్రమేయంతో రాముడి గమ్యం మారిపోయింది. రాకుమారుడు ప్రజల మనిషయ్యాడు. మునుల యజ్ఞకార్యాలకు రక్షకుడయ్యాడు. రాక్షసజాతినిర్మూలన బాధ్యత తలకెత్తుకున్నాడు. అంతఃపురాలను,

అయోధ్యను దాటి – రాముడి స్వధర్మనిర్వహణాపరిధి – భూమి నలు చెరగులకూ విస్తరించింది. ఒక్కమాటలో – వ్యక్తిచైతన్యం (ఇండివిద్యువల్ కాంషస్‌నెస్) – సమష్టి చైతన్యంగా (కలెక్టివ్ కాంషస్‌నెస్) రూపొందింది. రాజమందిరాలలో హాయిగా ఆటపాటలలో కాలం గడిపే ఒక రాకుమారుణ్ణి బయటకు రప్పించి, జనారణ్యాల బాట పట్టించి, రక్కసులతో శాశ్వతవైరానికి పథకం రచించి, అయోధ్యరాముడు కాలక్రమంలో అడవిరాముడయ్యేందుకు ముఖ్యకారకుడు విశ్వామిత్రుడు. ఇదంతా ఒక విశ్వప్రణాళిక (డివైన్‌ప్లాన్) కాగా దానికి ఇరుసు విశ్వామిత్రుడు.

మహాభారతంలోనూ ఇలానే జరిగింది. అర్జునుడి విషయంలో ఇదే తరహా భూమికను స్వయంగా శ్రీకృష్ణుడే నిర్వహించాడు. నేను, నా బంధువులు, నా గురువులు, నా కోడి, నాకుంపటి... తరహా ఆలోచనలతో ఇరుకుదారుల్లోకి ప్రవేశించిన పార్థుడి వ్యక్తిచైతన్యాన్ని గీతాప్రబోధంతో సమష్టిచైతన్యం వైపు మళ్ళించినవాడు కృష్ణభగవానుడు. 'నేను' అనేది తొలగిపోవడమే ముక్తస్థితి. ముక్తస్థితిలో నిల్చిన వ్యక్తిచైతన్యం – సమష్టిచైతన్యంగా ఎదుగుతుంది. స్వధర్మం విస్తరించి జనహితం వైపు ప్రయాణిస్తుంది. వ్యక్తిగా తన సామర్థ్యం ప్రకటించి – శత్రువును ఓడిస్తే అది 'జయం' అవుతుంది. లోకం బాగుకోసం సాధించే గెలుపును 'విజయం' అంటారు. యుగ అవసరాలకు తగినట్లుగా – సమష్టి చైతన్యంతో శత్రువులను జయించాడు కనుకనే అర్జునుణ్ణి 'విజయుడు' అన్నారు. అటు విశ్వామిత్రుడు, ఇటు శ్రీకృష్ణుడు – ఇరువురి ప్రమేయంతో రామార్జునుల జీవనయానం లోకకళ్యాణం దిశగా ప్రయాణించాయి. క్షేమాన్ని కూర్చాయి.

ఇక్కడ మరో రహస్యం ఉంది. ఎప్పుడైతే ఇండివిద్యువల్ కాంషస్‌నెస్ – కలెక్టివ్ కాంషస్‌నెస్‌గా విస్తరించిందో – అప్పుడు విశ్వచైతన్యం (కాస్మిక్

కాంషస్‌నెస్) ఆసరా దానికి తప్పక లభిస్తుంది. దీన్నే ఆత్మ – మహాత్మగా ఎదిగినప్పుడు పరమాత్మ అండ లభించడంగా కూడా చెప్పుకోవచ్చు. మహాభారతంలోని ద్రోణపర్వం దీనికి తిరుగులేని సాక్ష్యం పలుకుతోంది.

ఈ సృష్టికి సంబంధించిన ఒకానొక దివ్య ప్రణాళిక లోకంలో అమలవుతున్నప్పుడు – మనిషి తన స్వధర్మాన్ని దానికి అనుసంధానించు కోవాలి. అప్పుడు బయట నుండి ఎంతో సహకారం లభించి, తన సత్తాకు మించిన పనులను సాధించడం వీలవుతుంది. కృష్ణుడి సారథ్యంలో అర్జునుడు భీకరసమరం సాగిస్తుండగా, ఒక దివ్యాకృతి త్రిశూలాన్ని ధరించి, తన ముందు నడుస్తుండటాన్ని అర్జునుడు గ్రహిస్తాడు. ఆ త్రిశూలం వేటుకు మహాయోధులు నేలకూలుతుండగా అర్జునుడి బాణాలు వారి దేహాలకు గుచ్చుకుంటున్నాయి. అంటే, పరాక్రమం – ఆ దివ్యాకృతిది, కీర్తి – అర్జునుడిది! 'ఇదేమిటి' అని అర్జునుడు అడిగితే, 'నిజమే' అన్నాడు వ్యాసమహర్షి, "ఆ త్రిశూలధారి సాక్షాత్తూ పరమశివుడు" అని స్పష్టం చేశాడు. "విశ్వప్రణాళిక అమలుచేసే పనిలో – నీవు ఒక పనిముట్టు అయ్యావు కనుక – నీకు పరమశివుడి తోడ్పాటూ లభిస్తోంది" అని వ్యాసమహర్షి వివరించారు. దేవుడి కోసమే కావచ్చు, గంధం తీసిన చేతులకు పరిమళం అంటుకోవడం సర్వ సహజం – పరమేశ్వరుడి పరాక్రమవైభవం – లోకక్షేమం కోసం నడుంబిగించిన అర్జునుడి ఖాతాకు జమ పడటం అంతే సహజం.

వ్యక్తిచైతన్యం – సమష్టిచైతన్యంగా ఎదిగి, అది జాతి ప్రయోజనాలకై తపనపడుతుంటే – విశ్వచైతన్యం చేయూత ఏ స్థాయిలో లభిస్తుందనడానికి ద్రోణపర్వంలో ఈ సంఘటన గొప్ప ఉదాహరణ. ధర్మం విషయంలో లోకానికి ఉదాహరణప్రాయంగా నిల్చిన ధర్మరాజుకు – అరణ్యవాససమయంలో ద్రౌపదిని సైంధవుడు చెరపట్టిన వైనాన్ని – ప్రకృతి ఎన్నో రకాల సూచనల రూపంలో నివేదించడాన్ని సైతం ఈ

కోణంలోంచి మనం అర్థం చేసుకోవచ్చు. ఇది ప్రకృతి సహజమైన ఒకానొక నిరంతర చర్య.

చైతన్యాలను విస్తరించడం ద్వారా పాండవులను అలా తమతమ వ్యక్తిగత పరిధుల్లోంచి - సమాజహితం వైపుకు మళ్ళించినవాడు శ్రీకృష్ణ భగవానుడు. గీతాబోధ ద్వారా అర్జునుణ్ణి పరిపూర్ణ యోధునిగా, ధర్మసంస్థాపనకు ఆయుధంగా మలచినవాడాయన. సరిగ్గా అదే పనిని విశ్వామిత్రుడు - రాముడి కోసం సమకట్టాడు. యాగసంరక్షణనెపంతో ధనుర్వేద సమస్తాన్నీ రామభద్రుడి వశం చేశాడు. రాక్షసజాతితో శాశ్వత వైరానికి పునాదులు తీశాడు. "యాగం పూర్తవగానే రాముణ్ణి తీసుకొచ్చి నీకు అప్పగిస్తాను" అని దశరథుడికి వాగ్దానం చేసినవాడు - తీసుకెళ్ళి సీతకు అప్పగించాడు. లోకకళ్యాణం జరిపించాడు. విశ్వప్రణాళికకు అనుకూలంగా రాముడి స్వధర్మాన్ని అనుసంధించాడు. వ్యక్తిచైతన్యాన్ని - సమష్టిచైతన్యంగా మలచి, విశ్వచైతన్యపు ప్రమేయానికి ముడిపడేలా చేశాడు. రామచంద్రుణ్ణి పరిపూర్ణ అవతారమూర్తిగా తీర్చిదిద్దాడు.

ఇంత గొప్ప పాత్రను నిర్వహించిన విశ్వామిత్రమహర్షి - వైష్ణవ మహాతేజస్సు రాముడిలో సంలీనమయ్యే దివ్యక్షణాలలో లేకుండాపోతే ఎలా? వైష్ణవతేజస్సంటే - కాస్మిక్ కాంషస్‌నెస్సే! అది రాముడి చైతన్యానికి అనుసంధానమయ్యే అపూర్వఘట్టంలో, రాముడు పరిపూర్ణ అవతారమూర్తిగా ఆవిర్భవించే అద్భుతక్షణాల్లో విశ్వామిత్రుడి ఉనికి లేకుండా పోవడం ఎలా? గాధేయుడు - బ్రహర్షి విశ్వామిత్రుడు కావడం వల్లనే కదా గాయత్రిదర్శనం! గాయత్రి సైతం విశ్వచైతన్యానికి ప్రతీకే కదా! కనుక రాముడు సంపూర్ణ వైష్ణవతేజోరాశిగా మారడం - విశ్వామిత్రుడి సమక్షంలోనే జరగాలి. అదే న్యాయం!

కాబట్టే, విశ్వనాథ సత్యనారాయణ గారు 'రామాయణ కల్పవృక్షం'లో విశ్వామిత్రుడు మిథిలను విడిచి వెళ్ళక ముందే పరశు

రాముణ్ణి రంగంలోకి దించారు. 'గుర్తింపు దాహాలు' తపన (ఐడెంటిటీ లేదా ఎగ్జిస్టెన్స్ క్రైసిస్)ల గురించి మానవులే తప్ప మహర్షులు పట్టించుకోరు కనుక వాల్మీకి ఈ ఘట్టంలో విశ్వామిత్రుడి ఉనికి గురించి ప్రత్యేకంగా చెప్పి ఉండకపోవచ్చు గాక, వారి పాత్రల గురించి ఆలోచించడం, గుర్తించడం, కీర్తించడం, లోకానికి వెల్లడించడం "రామాయణభాష్యకారుల" ముఖ్య బాధ్యత. కనుక విశ్వనాథ యుగ ధర్మాన్ని తలకెత్తుకున్నారు. విశ్వామిత్రుడి సమక్షంలో విష్ణుతేజాన్ని రామాంకితం చేసి మహర్షితేజానికి జేజేలు పలికారు. కవి అంతశ్చేతన ఒకనొక నిశ్చల ధ్యానస్థితిలో ఉండగా – తపస్సిద్ధికి ఫలితంగా దిగి వచ్చిన కావ్యం – కల్పవృక్షం అనడానికి ఈ సన్నివేశం ఒక ఉదాహరణ. "బ్రహ్మర్షి" విశ్వామిత్రుడి అసలుసిసలు కథ ఇది!

**ఎర్రాప్రగడ రామకృష్ణ, రాజమండ్రి.**
**సెల్. 93979 07344**

**(2012 మార్చి నెలలో తిరుపతిలో జరిగిన విశ్వనాథ కల్పవృక్ష సదస్సులలో రేఖామాత్రంగా ఈ ఆలోచనను బయటపెట్టగానే సంతోషాన్ని ప్రకటించిన శ్రీకోవలె సుప్రసన్న, నా భుజాలపై తమ రెండు చేతులు ఆన్చి – "ఇది కొత్త చూపు, దీన్ని వ్యాసంగా విస్తరించి, ప్రచురించు – అని ఆత్మీయంగా ఆదేశించిన శ్రీ తుమ్మపూడి కోటీశ్వరరావు గార్ల పెద్ద మనస్సుకు అంజలిస్తూ – ఎర్రాప్రగడ).**